


ఆ చిన్ని స్టేషన్లో రైలాగింది.

భుజానికి ఫోల్డర్ బేగ్ తగిలించు కుని ఒక చేత్తో సూట్‌కేస్ పట్టుకుని చెంగున రైలు దిగింది హేమ.

ఉదయపు గాలి అప్పుడే వచ్చిన అతిథిని ఆప్యాయంగా పరామర్శిస్తున్నట్టు చల్లగా ఆమె మొహాన్ని తాకింది.

ప్రయాణపు బడలిక అంతా తీరినట్టు అయి హాయిగా ఫీలయింది హేమ.

## కొత్త సీరియల్ ప్రారంభం



# రహస్యం

**-వలివేటి నాగచంద్రావతి**

సూట్‌కేస్ కిందపెట్టి తన వెనుకగా దిగుతున్న తల్లి గాయత్రికి చెయ్యందించింది.

చాలా చిన్న స్టేషన్ అది. పాసింజర్ బళ్ళు తప్ప మరేవీ ఆగవు. దగ్గరకొచ్చిన స్టేషన్ మాస్టర్‌కి తల్లి టిక్కెట్లు అందిస్తుంటే వేళ్ళు విరుచుకుంటూ చుట్టూరా చూసింది హేమ.

ట్రాక్‌ని ఆనుకుని కనుచూపుమేరంతా ఆవరించిన పంటపొలాలు దేవుడు పరిచిన ఆకుపచ్చ తివాచీల్లా ఉన్నాయి.

రంగురంగుల కోకలు కట్టి వంగి కలుపు తీస్తున్న ఆడవాళ్ళు ఆ తివాచీమీద అద్దిన పువ్వుల డిజైన్‌లా వున్నారు. చేల గట్లంట గుత్తులు గుత్తులుగా పూసిన బంతిపూలు ఆ తివాచీలకు వేసిన అందమైన బోర్డరు లాగా ఉన్నాయి. దూరంగా గొడ్లను కాస్తున్న పిల్లకాయలు 'ఓహోయ్' అనే అదలింపులు, ఇంకెక్కడి నుంచో లీలగా కోవెలలో ధ్వజస్తంభపు గంటలు గలగలా గాలిలో తేలి వినవస్తున్నాయి.

నిద్రమాను చెట్లమీద పక్షుల కలకలలూ, ఎక్కడో 'కూ' అన్న కూతకి మరెక్కడ్నించో 'కూ' అని బదులిస్తున్న కోకిల కూతలు పూల మీద నుంచీ, చేలమీదనుంచీ పరిమళాలు మోసుకొస్తూ దూసుకొస్తున్న పిల్లగాలి చేసే చిరునవ్వుడులూ, ప్రకృతి మృదువుగా ఆలపించే భూపాలరాగంలా తోనస్తూ వివశత్వాన్ని కలిగిస్తున్నాయి.

"మనకోసం ఎవరూ వచ్చినట్లు లేదుకదూ?" తల్లి పలకరింపుతో తన్మయత్వం నుంచి తేరుకున్నది హేమ. తల్లి కంఠంలో ధ్వనించిన ఆశాభంగానికి విచలితురాలై తలెత్తి చూసిందామె వంక.

"తెలియని ఊరా అమ్మా... రాకపోతారా అనుకుని ఉంటారు" అన్నది దిగాలు పడిపోయినట్టయిపోయిన తల్లిని జాలిగా చూస్తూ.

నిట్టూర్చింది గాయత్రి.

"మరే... అంతే అయ్యుంటుందిలే" అన్నది సంశయిస్తూ కలవరపడుతున్న మనస్సును సమాధానపరచుకుంటూ.

స్టేషన్ దాటి ఇవతలకు వచ్చారు.

ఊరికీ, స్టేషన్‌కీ రెండు మైళ్ళ దూరం. మధ్యలో చిన్న వాగు కూడా ఉంది. ఎంతవారికైనా ఊరు చేరాలంటే నాటు బండే శరణ్యం.

'దశాబ్దాలు గడిచి ప్రపంచం ఎంత ముందుకెళ్లినా కానీ ఈ ఊరు మాత్రం ఎద్దుబండి దగ్గరే ఉండిపోయింది'' నవ్వుకున్నది హేమ.

బండికేసి నడవబోతుంటే "గాయత్రమ్మా నువ్వేనా తల్లీ" అంటూ బండి తోలే మనిషి ఎదురొస్తూ కనిపించాడు.

"రంగయ్య తాతే" సంభ్రమంగా పరిశీలించి చూస్తూ అన్నది గాయత్రి.

"అవును తల్లీ నేనే. తంతి కొట్టావంటగా. నిన్న సాయంత్రం కరణంబాబు 'గాయత్రమ్మ వస్తోందిరా' అంటే విలిచి మూర్ఛాలు పెట్టినట్టనిపించిందనుకో. రాత్రంతా నిద్రపట్టలేదు. ఎప్పుడెప్పుడు తెల్లారునా ఎప్పుడెప్పుడు నిన్ను చూద్దునా అని, చీకటి విడవకుండా బండి కట్టుకు వచ్చేసాను" ఆప్యాయత రంగరించిన కంఠంతో చెబుతూ బండిలో గడ్డి సమంగా సర్ది ఈతాకుల చాప పరచి మెత్తగా ఉందోలేదో చేత్తో వత్తి చూసి పెట్టేబుట్టా బండిలో పెట్టి ఎక్కేటప్పుడు భుజంమీద చెయ్యెయ్యమని–

అప్పుడే పిండిన పాలలా ఏ స్వార్ధమూ, కపటమూ, కల్మషమూ సోకని రంగయ్య తాత అమాయకపు పల్లెటూరి అభిమానం చానాళ్ళకు చవిచూసిన ఆ అనుభూతికి హృదయం ప్రతిస్పందించిన గుర్తుగా తల్లి కళ్లల్లో మెరిసిన తడి.

ముగ్ధురాలైపోతూ బండెక్కి కూర్చున్నది హేమ. చద్దెన్నం తిని బడికి వెడుతున్న కుర్రపిల్లాడిలా బండి సాఫీగా సాగుతోంది.

రంగయ్య తాత గాయత్రిని క్షేమ సమాచారాలడుగుతున్నాడు.

"కన్నతల్లిలాంటి పుట్టిన ఊరినీ, ఇంతో అంతో ఆస్తి పాస్తుల్ని, ఓ అంటే పలికే హితైషుల్నీ వదిలి ఎంతోదూరం వెళ్ళిపోయావు. ఈ పన్నెండేళ్ళు ఏం పాట్లు పడ్డావో అమ్మా" అంటూ విచారిస్తున్నాడు.

"చంద్రం బాబు ఏం చేస్తున్నాడమ్మా. పెళ్లయిందంటగా, రవిబాబు చదూతున్నాడా? ఆ బాబుని కూడా తీసుకురాపోయావా తల్లీ! అంతా చూసేవాళ్ళం" అని పరామర్శిస్తున్నాడు.

ఏదో విధంగా అతనికి సమాధానాలిస్తోందేగానీ గాయత్రి మనసు కలవరంతో నిండి వుంది. అతన్నేదో అడుగుదామని వుందిగానీ మళ్ళీ జంకు. కొంచెం సేపు ఆగితే అన్ని సందేహాలూ తీరిపోతాయికదా! ఎందుకు తొందరపడ్డం అనుకుంటూ ఆత్రుత అణచుకుంటోంది.

ఇవేవీ పట్టించుకోవడంలేదు హేమ. పన్నెండేళ్ళ క్రితం నడిచి వెళ్లిపోయిన ఈ దారి వెంటే వస్తుంటే ఆ బాట, ఆ పరిసరాలు ఇంత మొహం చేసుకుని 'మేము గుర్తున్నామా?' అని పలకరిస్తున్నట్లుగా అనిపించి గతకాలపు స్మృతులు తలపోతలో మునిగిపోయింది.

బండి స్టేషన్ రోడ్డు వదలి వూరి దారికి మళ్లింది.

అక్కడ్నించే మొదలవుతుంది మునసబు వీరినాయుడుగారి పొలం ఇరవై ఎకరాలు ఏకఖండం.

అదిగో ఆ పచ్చటి పొలం మధ్యగా వాలిన దేవతాపక్షుల్లా ఆయన తన తల్లీ తండ్రీ జ్ఞాపకార్థం కట్టించిన తులసికోటలు రెండూ ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

ఆలా స్మృత్యర్థం తులసికోటలు కట్టడం, అందునా తళతళలాడిపోతూ కళ్ళు మిరుమిట్లు గొలిపేలా పింగాణి రాళ్ళు తాపడంచేసి అద్భుతంగా ఆలంకరించడం ఆ ఊళ్ళో అదే మొదలు. ఊరు ఊరంతా జాతర జనంలా వెళ్లి అదో ప్రపంచపు వింతలా చూసి వచ్చారప్పుడు.

దరిమిలా పెద్దిరెడ్డిగారూ, సరివిశెట్టిగారూ, బంగార్రాజుగారూ లాంటి మోతుబర్లు కూడా తమ తమ పెద్దల గుర్తుగా తులసికోటలు కట్టించేరుగానీ వీటి అందం, నాణ్యత వాటికి రాలేదు.

"అరే... ఆలోచనల్లోనే బండయ్యగారి మామిడితోపు, అంకమ్మబాబుగారి సరివి తోట కూడా దాటేసినట్టున్నామే. అదిగో దొంగల తోట నమీపానికొచ్చేసాం. అదిదాటితే వూరి మొదలుకి వచ్చేసినట్టే."

చిన్నప్పుడు ఈతోట పక్కంటే వెళ్లాలంటే ఎంత భయమేసేదో!

చుట్టూ దట్టంగా వెంతుమ్మ చెట్ల కంచెతో పట్టపగలే హడలెత్తేలా జీబురుమంటూ ఉండేది. దానికి తగ్గట్టే రాత్రిళ్ళు దొంగలకది ఆవాసమన్న దానికి నిదర్శనంగా అప్పుడప్పుడు ఒకటీ అరా వాళ్లెత్తుకొచ్చిన బట్టలో, వస్తువులో దొరుకుతుండేవక్కడ.

అందుకే అది అవడానికి రామయ్య తాతగారి జామతోటే అయినా దొంగల తోటగానే ప్రసిద్ధమయింది.

"దొంగల తోట సరే. దాని పక్కనే ఎందరి జీవితాలనో బహుశా తమ బ్రతుకులనీ అస్తవ్యస్తం చేసిన ఆ కలువ కొలను ఏదీ అది!"

ఈ సంగతి గమనించిందో లేదో అని విస్మయపడుతూ చూసింది తల్లివంక.

అప్పడికే "కలువ కొలను ఏది రంగయ్య తాతా?" అని అడుగుతోంది గాయత్రి కుతూహలంగా.

"పూడ్చేసారమ్మా" ముక్తసరిగా చెప్పాడు రంగయ్యతాత.

"అదేం?"

"ఎందుకని నువ్వే అడుగుతున్నావా తల్లీ! దాని మూలంగా ఎన్ని అనర్థాలీ ఊరికి దాపురించేయో ఎరగవా? ఎన్ని ఘర్షణలు, కొట్లాటలు, ఎంతమంది హతమారిపోయారు, ఎంతమంది ఊళ్ళు పట్టుకు పోయారు, ఆఖరికి రాణీ అమ్మగారు

పూనుకుని ఆ తగూలమారిని పాతి పెట్టించి ప్రజల్ని బ్రతికించారు."

'హూ... తగూలమారట. ప్రభువులు తమ భోగలాలసకీ, దర్ప ప్రదర్శనకూ నిర్మించుకున్నారు దాన్ని ఆ అద్భుత సౌందర్యం పశువు, పక్షి అనే తేడా లేక అందర్నీ అలరించగలదని పొగిడారు. చివరకి తమ స్వార్థం కోసం, అహం కోసం జగడాలాడుకుని దానిక్కారణం నీవేనంటూ నెపాన్ని దానిమీదకు నెట్టి ఆ అపూర్వసృష్టిని సమాది చేసారు ఆ ప్రభువులే. ఎంత కిరాతకం!'

"ఎంత అందంగా ఉండేది కలువ కొలను" కళ్ళక్కట్టింది ఆ నాటి కలువ కొలను రూపం.

మూడుతరాల క్రిందట ఈ గ్రామాన్నేలిన ఒక జమిందారు అంటే ఇప్పటి చివరి రాజుగారి ముత్తాతగారు తమకమిత ఇష్టురాలైన భోగకాంత జలకాలాట కొరకు కట్టించాడట కలువకొలను.

ఆయన పోయినా ఆయన పుత్ర పౌత్రులు కూడా దాని సొగసునీ, వైభవాన్నీ కాపాడు కుంటూ వచ్చారు.

కొలనులో ఎర్ర తామరలు, తెల్లకలువలేకాక విదేశాలనుంచి తెప్పించి వేసిన బంగారు వన్నెల జలపుష్పాల జాతులతో నిండి ఎంతో మనోహరంగా ఉండేది.

నాలుగువైపులా పాలరాతి పావంచాలు, ఆ అందాన్ని కాపలా కాచే రక్షకభటుల్లా కొలనుచుట్టూరా అశోక వృక్షాలూ, మధ్యమధ్య దీపపు స్తంభాలు, మాటల్లో వర్ణించ లేనంత సుందరంగా ఎంతో గొప్పగా వెలిగిపోయిన ఆ కలువకొలను ఈనాడిలా గడ్డయినా మొలవని ఎర్ర మట్టిదిబ్బ కింద నిద్రిస్తోందన్నమాట! విధి వైపరీత్యం.

"దానికింద..." ఆసక్తిగా అడుగుతోంది గాయత్రి. "మన్ను. మనం విన్నవన్నీ పుక్కిట పురాణాలే నమ్మా. రెండు నిలువుల లోతు తవ్వించి చూశాకే పూడ్చారు దాన్ని. దాపరికమేమీలేదు. అందరం చూస్తూనే వున్నాం రాజుగారి కొడుకులతోసహా."

"మరి..."

"దొరికాయి రెండు అస్తిపంజరాలు!"

"హా..."

"ఔనమ్మా! ప్రభువుల లీలలు తెలుసుకోవడం మన వశమా? పడనివాళ్లనెవర్నో చంపించి పాతి పెట్టించి ఉంటారు. ఆ నేరం దాయడానికే ఈ కలువకొలను సృష్టి. ఇదే నిజం. మిగతావి పుకార్లు అని అప్పుడు తెరిపిళ్లు పడ్డాయి కళ్లు అందరికీ.

"ఎంత చిత్రం?" ముక్కున వేలేసుకున్నది గాయత్రి.

"సత్యమెప్పుడూ విచిత్రంగానే వుంటుంది తల్లీ" చిరునవ్వుతో అన్నాడు ఎన్నో అనుభవాల్ని జీర్ణించుకున్న రంగయ్య తాత.

"అమ్మడూ అదిగో నందనం, గుర్తుందా?"

తల్లి ప్రశ్నతో ఈ లోకంలోకివచ్చింది హేమ.

కాస్త దూరంలో నీలాకాశాన్నే బ్యాక్‌గ్రౌండ్‌గా తీసుకుని ఏ పేరు మోసిన చిత్రకారుడో చిత్రించిన ప్రకృతి చిత్రంలా కనిపిస్తోంది నందనం.

నందనరావు బాబాయిగారి ఇంటి తోటతోనే మొదలవుతుంది ఊరు. బాబాయి తన ఇంటి తోటకి పెట్టుకున్న పేరు నందనం.

అసలు నందనరావు బాబాయి అనగానే గుర్తుకొచ్చేది చిత్ర విచిత్రాలతో ఆశ్చర్య చకితుల్ని చేసే వాళ్ళపెరటి తోటే.

ఆ తోటలో గులాబీ చెట్టుకి ఒకవైపు కొమ్మకి పసుపురంగువీ, ఒకవైపు కొమ్మకి ఎరుపురంగువి పూలు పూస్తాయి. గింజలేని సీతాఫలం కాస్తుంది. నాలుగడుగుల కొబ్బరిచెట్టుకి మూడడుగుల గెల దిగుతుంది.

అంతేనా... పైన టమేటాలూ వేళ్ళకు బంగాళాదుంపలు కాయించవచ్చని, మామిడివండుకి వననతౌన వానన అబ్బించవచ్చని, మందారాలంత మల్లెపూవుల్ని పూయించవచ్చని చెప్పే నందనరావు బాబాయి ఇంద్రజాలికుడిలా అనిపించేవాడు అందరికీ.

ఏవేవో విత్తనాలు, ఏవేవో రసాయనాలలో నానేసేవాడు. ఏవేవో అంట్లు కట్టేవాడు. వాటికి ఏదో పేరు రాసిన చీటీలు దారానికి గుచ్చి కట్టేవాడు. కొన్ని అంట్లని చీకటి గదుల్లో దాచేసాడు. కొన్నిటిని ఎండలోకీ, నీడలోకీ మారుస్తుండేవాడు. ఇలా నిరంతరం మొక్కల మీద ప్రయోగాల్లోనే నిమగ్నమై వుండే నందనరావు బాబాయి ఆరోజుల్లోనే వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రుడు.

అంత చదువు చదివి హాయిగా ఏ కాలర్ మాయని ఉద్యోగమో చేసుకోక ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తానంటూ ఈ కుగ్రామానికి వచ్చేసిన నందనరావు బాబాయిని ఓ పిచ్చివాడ్ని చూసినట్లు చూసేవారు మొదట్లో.

ఆయన ఏదో యువతరం ఉత్సాహంకొద్దీ ఈ పాతతరం రైతుల్ని సంస్కరిద్దామనే ఉబలాటంతో దున్నటం గురించి, విత్తనం నాటడం గురించి వారికి సలహా ఇవ్వబోయేవాడు పావం అమాయకంగా.

"పోవయ్యా! పుస్తకంచూసి పొలం పండిద్దామని వచ్చిన ఎర్రి బ్రాహ్మడివి. ఈ

చేలల్లో తలలు పండించుకున్నవాళ్ళం. నువ్వా మాకు పాఠాలు చెప్పేది?" అని ఈసడింపుతో మొహాన్నే నవ్వేవాళ్ళు వాళ్ళు.

కానీ నవ్విన నాపచేనే పండిందన్నట్లు పుస్తకాలు చదివి ఈ వెర్రి బ్రాహ్మడు పండించిన పంట చూసి కళ్ళు చెదిరి ఔరా అని ముక్కున వేలేసుకున్నారు వాళ్ళే.

"ఒరే అబ్బాయ్! నువ్వేసిన మంత్ర మేమిటో చెబుదూ" అంటూ కాళ్ళ బేరానికి వచ్చేసారు తరువాత.

"అమ్మలూ! వసుంధర గుర్తుంది కదూ?" తల్లి ప్రశ్నతో ఆలోచనలకి కామా పెట్టి "ఆహా లేకేం?" అంది హేమ "ఆ ఎత్తరుగుల ఇల్లేకదూ వాళ్ళది."

"ఊ... ఊ!"

వసుంధర తండ్రి నాంచారయ్య గురించి ఓ కథ ప్రచారంలో వుండేది. అది కూడా జ్ఞాపకమే తనకి.

ఒక భుజాన తల్లిని పోగొట్టుకున్న మూడేళ్ళు నిండిన పసిపిల్లని ఎత్తుకుని పైమీద తుండుగుడ్డతో ఈ ఊరు వచ్చాట్ట నాంచారయ్య.

చదువు సాము లెరుగని నాంచారయ్య భుజాన కావిడేసుకుని ఊరి బావి నుంచి అందరికీ మంచి నీళ్ళు మోసుకొచ్చి పోసేవాడు. అప్పట్లో ఊరందరికీ ఒకటే బావి కాలువగట్టున ఉండేది. రాత్రిళ్ళు దర్జీబుడే సాయిబు ఇంటి వసారాలో తలదాచుకునే వాడు. మంత్రసాని మంగమ్మ పంచలో నాలుగ్గింజలు ఉడకేసుకునేవాడు.

ఏ అమ్మ వండుకున్న కూరో, ఫలహారమో చేతిలో వేయబోతే దోసిలి పట్టి అందుకునేవాడు. అట్లాంటి నాంచారయ్య దశ తిరిగింది.

పూరిల్లు ఊడదీసి డాబా వేయించాడు. కూతురుకి అరవంకీలూ, రాళ్ళహారమూ చేయించాడు. సైను గుడ్డ బనీను, నీరుగావి గావంచతో వుండే నాంచారయ్య గ్లాస్కో పంచా, సిల్కు లాల్చీతో దర్శనమివ్వసాగాడు. నీళ్ళమోత మాని పొగాకు కమిషన్ వ్యాపారం చేపట్టాడు.

ఇంత విద్దూరానికి కారణం గొప్ప నిధి ఏదో అతనికి వశమయిందని చెప్పుకునేవారు. దాని గురించి చిత్ర విచిత్ర మైన కథ కూడా ఒకటి ప్రచారంలో ఉండేది.

దర్జీ బుడే సాయిబు మరణానంతరం అతని బీవీ మస్తానమ్మ కూతురి దగ్గరికి మకాం మార్చేస్తూ రెండొందలకి పడిపోతున్న తన పాత మట్టి మిద్దె కొంపని నాంచారయ్య పరం చేసి పోయింది.

అది ఇక్ష్వాకులనాటి పాతకొంప.

సంపాదించేది పొయి మీదకీ పొయి కిందకీ సరిపోని బుడేసాయిబు ఇంటి మరమ్మత్తుకి ఏనాడూ పైసా ఖర్చు చేసింది లేదు. గట్టి గాలి విసురుకి, ఓమోస్తరు వర్షానికి కూడా పెణకలు పెణకలుగా గాలిపడుతుండే ఆ ఇంటినే మహాప్రసాదంలా తనదనిపించుకున్నాడు నాంచారయ్య.

కూలకుండా వున్న ఓ మూల పొయ్యి పెట్టుకున్నాడు. కురవని కాస్త జాగాలో పక్క వేసుకున్నాడు.

అలా విశ్రమించిన నాంచారయ్యకు ఒకరోజు అర్ధరాత్రి అటకమీంచి గలగల శబ్దమే కాకుండా 'దూకుతా... దూకుతా' అంటున్న ఒక ఆడగొంతు కూడా వినిపించి భయపడిపోయాడు.

ఆ ఇంటిని ఆశ్రయించుకున్న ఏ దెయ్యమో తను ఈ ఇంట్లో ప్రవేశించడం ఇష్టంలేక తనని బెదిరిస్తోందని భావించి 'దూకొద్దు తల్లీ అర్భకుడ్ని' అని రెండు చేతులూ ఎత్తి వణికిపోతూనే నమస్కారం చేసాట్ట.

అంతే! మరే శబ్దం ఆ వేళకు వినిపించలేదుట. దడుపుకొద్దీ తెల్లవార్లూ మేలుకుని కూర్చున్న నాంచారయ్యకు మర్నాడు అదే సమయానికి అదే బెదిరింపు 'దూకుతా... దూకుతా' అని. మళ్ళీ నాంచారయ్య చెయ్యెత్తి దణ్ణం పెట్టగానే మరే సవ్వడీ లేకపోవడం! రోజూ ఇదే తంతు. కొన్నాళ్లకు నాంచారయ్యకు వినుగెత్తి పోయింది.

ఆ దూకుతా దెయ్యం ఉత్తుత్తి బెదిరింపేతప్ప చేసిన అపకారం ఏం లేకపోయినా ప్రతి రాత్రీ వదగనీదన గడుపుతున్న అనుభూతి. భరించలేకపోయిన నాంచారయ్య ఒక రాత్రి ఏమయితే అదవుతుందని తెగించేశాట్ట. నిద్రపోతున్న కూతుర్ని బయట అరుగుమీద పడుకోబెట్టి వచ్చి "దూకితే దూకమ్మా నీ ఇష్టం" అనేశాట్ట.

అతనలా అనడమేమిటి, గలగల్లాడుతూ లక్ష్మీదేవి బంగారం కాసుల రూపంలో కుప్పగా రాలిపడ్డమేమిటి ఏకకాలంలో జరిగిపోయిందిట.

అప్పుడు తెలిసింది నాంచారయ్యకి దూకుతా అన్నది ధనలక్ష్మిగానీ దెయ్యం కాదని.

అదీ కథ.

ఈ కథని దెయ్యాలూ, భూతాలూ మీద నమ్మకంలేని వాళ్ళు ఒప్పుకోలేదు. రాలిన ఓ పెణకలోంచి పూర్వులెవరో దాచిపెట్టిన కాసులకుండ పడివుండవచ్చునంటారు. దీనికీ ఔననలేదు నాంచారయ్య.

పిల్లలులేని ఓ దూరపు చుట్టం పోతే దాయాదిగా తనక్కాస్త ముదనష్టం కలిసి వచ్చిందన్నాడు. దేవుడి దయవలన వ్యాపారం పెరిగిందన్నాడు. ఏమయినా వసుంధర అదృష్టవంతురాలు. కలిసివచ్చిన సంపదతో నాంచారయ్య ఆమెను రాజకుమార్తెలా పెంచాడు.

నాంచారయ్య ఇంటి పక్కనుండే కుమ్మరి వెంకన్నకొలిమీ, గమళ్ల గవరయ్యి నూనెగానుగా స్థానే ఇప్పుడు ఎవరివో రెండు కొత్త దాబాలు వెలిసాయి. వాటిని దాటి మలుపు తిరిగి రాజబాట ప్రవేశించింది బండి.

రాజుగారి దేవిడీవున్న వీధిని రాజబాటే అనేవారు పూర్వంమరి.

"రాజావారి తాలూకు వారంతా రాజధానికి తరలివెళ్లిపోయాక ఇంకా రాజబాటలేమిటమ్మా? ఇప్పుడు దీన్ని ఆఫీసు వీధి అంటున్నారు" అన్నాడు రామయ్య తాత.

వీధి మొదట్లో రాజాగారి రెండంతస్థుల భవనం వృద్ధాప్య భారంతో ఒరిగి పడుకున్న తెల్ల ఏనుగులా పాతబడి కళావిహీనంగా కనిపిస్తోంది.

ఒకనాడు తమకో ఉన్నత స్థానమిచ్చి కాళ్లు కడిగి నెత్తిన ప్రోక్షించుకున్న ఆ చేత్తోనే తమని అధఃపాతాళానికి తొక్కి వికటాట్ట హాసం చేసిన ఆ దివాణం కేసి తడి కళ్లతో చూసింది గాయత్రి.

ఎలా వుండే దివాణం ఎలా మారిపోయింది?

చుట్టురా కోట గోడలా ఎత్తుగా, దృఢంగా వుండే దివాణం ప్రహరీగోడ కాలప్రభావానికి లోనై అక్కడక్కడా రాళ్ళు వూడి నెర్రలిచ్చి శిధిలావస్థలో దీనంగా వుంది. ప్రహరీగోడ మధ్యలో ద్వారబంధం వుంది గానీ దానికి ఇత్తడి గుబ్బలతో వుండే పెద్ద పెద్ద చెక్క తలుపులు ఉండేవి. అవి మాత్రం అజలేవు.

ఆ పడిపోయిన దర్వాజాలోంచి దివాణం గోడలకి తాత చెప్పినట్లు ఏవేవో ఆఫీసులకి చెందిన బోర్డులు కనిపిస్తున్నాయి.

పాడుబడివున్న ఆ హవేలీ రూపు చూస్తే దాని గతకాలపు వైభవాన్ని ఈనాటి స్థితితో పోల్చి గుండెనెవరో నొక్కినట్లుగా బాధపడింది గాయత్రి.

ఏ ప్రత్యేకతాలేని ఈ చిన్ని ఊరు చుట్టుప్రక్కల గ్రామాలన్నిటికీ తలమానిక మవడానికి కారణం ఈ దివాణమే.

మారుమూలనున్న ఈ పల్లెటూరికి బ్రిటిష్‌వారి కాలంలోనే ఒక రైల్వే స్టేషన్ వేయించి ఒకనాడు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కి సైతం హాల్టు వేయించిన ఘనత ఈ దివాణానిధి.

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అని ఆనాడు ఏ పెద్ద నగరాలకో మాత్రమే పరిమితమైఉండే కరెంటు, సిమెంటు రోడ్డు వంటి సౌకర్యాలు ఈ ఊరికి అమిరాయంటే అది ఈ దివాణం మహత్యమే.

జమిందారీ వద్ద ఆ కాలంలో వారి ప్రభావ ప్రాభవాలు ఇంకెంత వెలిగి పోతుండేవో తండ్రీ, బామ్మ వర్ణిస్తుంటే విన్నమాట అలా వుంచి స్వయంగా తనకంటితోనూ చూసింది. గుర్రపు షార్బూ, రోల్స్‌రాయిస్ కారూ హంగామా, బిడ్డపోయినా పురిటి వాసన వదలనట్లు రాజ్యాలు పోయినా ఆ లోటు కనబడనీయని వారి రాజసం అట్టహాసం, అలవాట్లు తనకి కూడా పరిచితమే.

శ్రీరామనవమి, గణపతి నవరాత్రులూ, శరన్నవరాత్రులు ఎంతో ఘనంగా జరిపించేవారు రాజవారు.

హరికథ లేనా తోలుబొమ్మలాట లేనా గానసభ లేక నాటకా లేదా ఊరేగింపు లేనా చూట్టానికి రెండు కళ్ళుచాలేవికావు.

చుట్టుప్రక్కల వూర్ల జనం కూడా బళ్ళు కట్టుకుని వచ్చేవారు. వూళ్ళోవాళ్లతోపాటు వారందరికీ కూడా దివాణంలోనే భోజనాలు.

సామాన్యులకి లభ్యంకాని ఆ దివాణ ప్రవేశం ఆ పండుగరోజుల్లో సులభసాధ్య మయ్యేది అందరికీ. వెనుక భాగంలో రాణీవాసముండే అంతఃపురం తప్ప మిగతా భాగం దర్శించడానికి ఏ ఆటంకమూ వుండేదికాదు.

నిజంగా యాత్రికులకు వినోదాలూ వేడుకలంటే విపరీతంగా ఆకట్టుకునే అదనపు ఆకర్షణ అదే అయ్యేది.

పాలరాయి పరిచిన ఆ విశాలమైన చావిళ్ళు, నల్లచేవమీద నగిషీలు చెక్కిన ద్వారబంధాలూ, బంగారు నీరుపోసిరు తళతళ్లాడే ఫ్రేముల్లో బిగించబడ్డ నిలువెత్తు చిత్రపటాలు, వెలుగులు విరజిమ్మే కొవ్వొత్తులు వెలిగించిన షాండ్లియర్సు, చిత్ర విచిత్రమైన వస్తువులతో అలంకరించబడిన గదులూ, ఎంత నడిచినా తరగని వరండాలూ, ఆ వరండాల్లో తిరుగాడే నెమళ్ళు, ఇతర పక్షుల పంజరాలు, వారే ప్రభువులన్నంత ఠీవిగా యూనిఫారం వేసుకుని తిరుగుతున్న బంట్రోతులు.

మట్టిమిద్దెలు,పూరికొంపలూ, చుట్టు గుడిసెలు తప్ప మరొకటెరుగని ఆ అమాయక పల్లెవాసులకి అధునాతనమూ, కళాత్మకమూ అయిన ఆ రమ్యహర్మ్యాన్ని కళ్ళతో స్పర్శించగలగడమే ఓ మహద్భాగ్యం.

అలాంటి అపురూప భవనం కళాఖండాన్ని చిన్న పేపర్‌వెయిట్‌గా ఉపయోగించినట్టు ఆఫీసు బోర్డులు వేలాడదీసే దుర్దశకు దిగజారిపోయింది.

నిట్టూర్చింది గాయత్రి.

కాని ఈ పరిణామం ఎవ్వరూ ఊహించనిది కాదు.

రాజుగారు గతించడంతోపాటే రాజభరణాలు రద్దయ్యాయి. రాజుగారి నలుగురు కొడుకులూ ఆస్తులు పంచుకునే సమయానికి మేమూ వారసులమంటూ కొందరు, దాయాదులమంటూ ఇంకొందరు ఆ ఊళ్ళో దిగబడ్డారు. మాకూ భాగమున్న

దంటూ కూతుళ్ళు తండ్రి రాసిచ్చిన దస్తావేజులు పట్టుకు తయారయ్యారు. వారిలో వారికే ఘర్షణలు చెలరేగాయి. ఆవేశాలు ముదిరాయి. ఒకటి రెండు తలలు పగిలాయి. పేచీలు వూరు దాటి కోర్టుల కెక్కాయి. దాంతో దివాణం పరిస్థితి మూసిన గుప్పిలి తెరిచిన చందమయింది.

అప్పటివరకూ వారి తేజాన్నీ, ఘనతనీ భట్రాజుల పాత్రమోస్తూ పొగడ్డం తప్ప ఒక్క పొల్లు మాట నోట జారే ధైర్యంలేని జనం ఇప్పుడు వారి హజాన్నీ, దుష్క్రియల్నీ కథలుగా చెప్పగలిగే సాహసవంతులయ్యారు.

పూర్వం ఎన్ని అఘాయిత్యాలు జరిగినా దివాణం గోడల వెనుకే గుప్తంగా ఉండిపోయిన వారి రహస్యాలు ఇప్పుడు ఊళ్ళోనలుగురు కలిస్తే అవే చర్చాంశాలు అవుతున్నాయి.

ఏళ్ళు గడిచాయి. ఆస్తులు కరిగాయి. మిగతావారి వాటాలు చాలావరకూ పరిష్కారమయ్యాయి. కానీ కొడుకుల తగాదాలు మటుకు తెగలేదు.

ముఖ్యంగా కలువకొలను విషయంలో ఏ కొడుకూ రాజీపడదానికి ఇష్టపడడంలేదు. వారి విరోధాలు తారాస్థాయినందుకున్నాయి.

ఎవరికివారే కలువకొలను బదులుగా లక్షలూ, కోట్లూ ఖరీదుచేసే జవహరీనైనా, వందలాది ఎకరాలనైనా మినహాయించుకోవడానికి సిద్ధపడుతున్నారు తప్ప దాన్ని వదులుకోటానికి ఒప్పుకోవడంలేదు.

ఒక చిన్న చెరువులాంటి దాని కొరకు వారుపడే తాపత్రయం అందరినీ విస్తుపోయేట్టు చేసింది.

అది తమ స్టేటస్ సింబల్ కావడమే తమ పట్టుదలకు కారణమని వారు చెప్పుకుంటున్నా దాని వెనుక వారు దాస్తున్న అంశమేదో వుండే వుంటుందని అందరూ అనుమానిస్తున్నట్లుగానే ఒకరోజు ఆ గుట్టు కాస్తా రట్టవనే అయింది.

రాజుగారి వంశంలోని పూర్వుడెవరో శత్రుభయం చేతనో లేక బందిపోటు బెడదవల్లనో తన అపారమైన సిరిసంపదల్ని ఇప్పుడు కలువకొలనున్న స్థలంలో నిక్షిప్తం చేశాడుట.

తరాన్నించి తరానికి అందుతూ వచ్చిన ఆ సమాచారం ఎప్పుడో ఎక్కడో లింక్ తెగిపోయి మరుగున పడిపోయింది. మళ్ళీ రాజుగారి ముత్తాతగారి కాలంలో ఎలాగో తిరిగి బయటపడింది.

తక్షణం ఆయన తీసుకున్న చర్యే కలువకొలను నిర్మాణం. భోగకాంత వంకన ఆ పని చేసి ఎవరికీ సంశయం కలగకుండా ఆ స్థలాన్ని తన దృష్టికి దాటి పోనీకుండా, దాన్ని అన్యాక్రాంతం కానీకుండా కట్టుదిట్టంచేసి కాపాడాడట ఆయన.

అందులో ఎంత నిజముందో చెప్పేవాళ్ళకీ, వినేవాళ్ళకీ తెలీదుగానీ రాజుగారి పుత్రులకి మాత్రం పూర్తి నమ్మకమున్నదన్నదానికి నిదర్శనంగా ఈ పుకారు రేగిన కొన్నాళ్ళకి కలువ కొలను చుట్టూరా కాపలా మనుషులతో గట్టి బందోబస్తు ఏర్పడిపోయింది.

ఎప్పుడూ నిమ్మకు నీరెత్తినట్టుండే ఆ ఊళ్ళో అప్పట్నుంచే అలజడుల సృష్టి మొదలయింది.

కలువ కొలను వయిపు దృష్టి సారించిన వారి కన్నుల్లో అత్యాశల మెరుపులు వెలుగుతున్నాయి. ఆ మెరుపుల్ని పసిగట్టినవారి మనసుల్లో అనుమానపు ముసుగులు దర్శనమిస్తున్నాయి.

రోజుకో కొత్త పుకారు, పూటకో ఊహాచిత్రం.

ఒకరోజు రాత్రి ఈ కబుర్లూ, కల్పనలూ కట్టిపెట్టి పనిలోకి దిగిపోయారెవరో.

కలువ కొలను చుట్టూరా వుండే అశోక వృక్షాలు రెండూ వేళ్ళతోనహా పెకలించివేసారు. కొలనులోకి కూడా దిగి శోధించిన గుర్తుగా జలపుష్పాల తూళ్ళు తెగి రేకులు వాడి తేలుచున్నాయి. నిర్మలంగా ఉండే నీళ్ళు కెలికినట్లుగా మలినమయ్యాయి.

గ్రామ ప్రజల్లో ఈ సంఘటన రేపిన ఉత్కంఠ అంతా ఇంతా కాదు.

ఎవరు చేసారు? ఎలా చేశారు? నిధి దొరికిందా? అన్నీ ప్రశ్నలే.

ఇక దివాణంలో దీని మూలంగా గొప్ప కల్లోలమే రేగింది. రాజుగారి కొడుకులు ఈ పని నువ్వు చేయించావంటే నువ్వే చేయించి వుంటావంటూ ఆగ్రహావేశాలతో ఒకరిమీద ఒకరు అందరూ వినేలాగానే అరుచుకున్నారు. కత్తులు దూసుకున్నంత పని చేసారు. ఇలా తిట్టుకుంటే తేలేది కాదని గ్రహించి ఆ తరువాత స్థిమితపడ్డారు.

అయితే వారిలోనే ఓ ఇద్దరికి ఇలా వదిలేసి వూరుకోవడం నచ్చలేదు. స్వయంగా వూనుకుని నీటిమీద జాడ తీయగల నేర్పరులని రావించారు. కూపీ తీయించారు.

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అని వారం తిరక్కుండానే నేరస్థులు పక్క ఊళ్ళో పట్టుబడ్డారు. పట్నం నుంచి ప్రత్యేకంగా రప్పించిన గూండాలు ఆ నలుగురూ నిందితుల్ని దివాణంలోకి తన్నుకుంటూ తీసుకెళ్లడం వూరు వూరంతా కళ్లారా చుసింది. ఆ తరువాత వాళ్ళనేమి చేశారన్నది మాత్రం పిట్టపురుగుక్కూడా తెలీదు. ఇంత జరిగాక జరిగింది చూసాక మరా కొలను జోలికి మరెవరూ పోరు అని అనుకున్న వాళ్ళు వెర్రిబాగులవాళ్లు.

ఈ కలికాలంలో సిరి అనేది ఒక గొప్ప అయస్కాంత క్షేత్రం. మానవుల్లో వుండే ఆశ అనే ఇనుప ధాతువు దానివంక ఆకర్షితమవడం అతి సహజం. కాకపోతే ఆ ధాతువు స్వల్ప పరిమాణంలో వున్నవాళ్ళు ఎలాగో నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తారు. మరింత వున్న వాళ్ళు దానికి అతుక్కుపోవడానికి తహతహలాడిపోతారు.

అలాంటి అతి ఆశతో ప్రేరేపించబడ్డ అర్భకులు, లేకపోతే రాజాగారి కొడుకుల్లో ఎవరితోనైనా ప్రోత్సహించబడిన నిర్భయులు ఎవరో తెలీదుగానీ ఇంక జరిగాక కూడా అది పాతబడనివ్వకుండానే ఆ తరువాత కూడా తరచూ కలువ కొలను మీద దాడులు జరుగుతూనే వచ్చాయి.

కొంతమంది దొరికేవాళ్ళుకాదు. వాళ్ళు రాజాగారి తాలూకు అని ఊళ్ళో వాళ్ళ అనుమానం. కొంతమంది నిర్భాగ్యులు చిక్కిపోయేవాళ్ళు.

యిలా పట్టుబడేవాళ్ళని విచారించే న్యాస్థానం పాత్రని దివాణమే నిర్వహించేది. రాజాగారి ఫామిలీనే దానిలో జడ్జీలు. వాళ్ళు విధించే శిక్షలు ఇండియన్ పీనల్‌కోడ్‌లోని ఏ సెక్షన్‌కీ సంబంధించినవీ అయిఉండవు. కఠినమైన ఆ శిక్షల్ని అనుభవించిన వాళ్ళు ఆ తరువాత ప్రాణావశిష్టంగా మాత్రమే మిగిలుండే వాళ్ళు. కొందరుఊ ఆ శిక్షలకు భయపడి తాము బయటపడతామనే అనుమానం రాగానే ఊరినీ, తనవారినీ విడిచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మరి కనిపించకుండా పారిపోయేవాళ్ళు మరికొందరు. అప్పట్నుంచే వూరి వారి దృష్టిలో అందమైన కలువ కొలను మృత్యువుకు ప్రతిరూపమైపోయింది.

❁ ❁ ❁

"వచ్చేశాం గాయత్రమ్మా" అన్న రంగయ్య తాత హెచ్చరికతో ఈ లోకంలోకి వచ్చింది గాయత్రి. అప్పటికే హేమ బండి దిగి తొట్టెలో బుట్టందుకుంటున్నది. పడక్కుర్చీలో వాలి వీరి రాకోసమే వీధి వరండాలో నిరీక్షిస్తున్నారు కరణం సీతారామయ్యగారు. బండి శబ్దం విని ముందుకు వంగి వీరిని చూసి లేచారు.

"ఇదిగో ఎక్కడున్నావ్? వాళ్ళు వచ్చారు" అని లోపలున్న భార్యకు వినబడేలా కేక పెట్టి వరండా మెట్లు దిగి ఎదురువచ్చారు.

"అమ్మా గాయత్రీ! కులాసాయేనా అమ్మా. ప్రయాణం సుఖంగా జరిగిందా?" అని పరామర్శించి హేమయపు చూసు జరిపి "ఓరి ఓరి మా హేమలతే. ఎంత మారిపోయావురా? ఎంత పెద్దదాని వయ్యావురా. నేను ఆనవాలు పట్టలేదుస్మీ. ఈ తాత జ్ఞాపకమున్నాడుట్రా?" అని సంభ్రమంగా భుజం మీద చెయ్యేసి పలకరించారు.

ఇంతలో చేస్తున్న పని ఆపేసి చేతులు కొంగుకు తుడుచుకుంటూ ఆదరాబాదరా వచ్చేసింది సీతారామయ్యగారి ధర్మపత్ని మహలక్ష్మమ్మగారు.

వస్తూనే గాయత్రిని దగ్గరకు లాక్కుని కన్నీళ్ళు పెట్టుకుంది.

ఎన్నో ఏళ్ళుగా వేదన అనుభవిస్తున్న గుండెకు ఆ కౌగిలి స్వాంతన కలిగించినట్టువగా ఆవిడకు మరింతగా హత్తుకుపోయింది గాయత్రి.

"పద... పద వాళ్ళను లోపలకు తీసుకుపద. ఎప్పుడనగా ఎక్కారో బండి. అలసిపోయుంటారు." వాళ్ళ స్నానంపానం చూడు" అని హెచ్చరించి మాటలు రాని స్థితిలో వున్న వారిని ఈలోకంలోకి తీసుకువచ్చి నడిపించారు సీతారామయ్య గారు.

స్నానాలు, కాఫీ ఫలహారాలు అవుతున్నంతసేపూ మహలక్ష్మమ్మ గాయత్రిని అవీ ఇవీ అడిగి తెలుసుకుంటూనే వుంది. తానూ ఏదో ఒకటి బెబుతూనే వుంది. కానీ అసలు విషయం మాత్రం ఆవిడ మాటల్లో దొరకలేదు గాయత్రికి.

"పిన్నీ కొత్తవాళ్ళం కాదు. పంచభక్ష్యాలు వండి పెట్టాలని హైరానా పడకు. మీతోపాటు పప్పు అన్నం చాలు" అని మహలక్ష్మమ్మను సహాధానపరచి "అమ్మలూ! అమ్మమ్మకు సాయం చేయమ్మా" అని కూరల బుట్ట హేమ ముందుకు తోసి తాను వీధిగుమ్మంలోకి వచ్చింది గాయత్రి.

వరండాలో యధాస్థానంచేరి చుట్ట కాల్చుకుంటున్నారు సీతారామయ్యగారు.

గాయత్రిని చూసి చుట్ట అవతలికి విసిరేస్తూ "రామ్మా" అన్నారు.

వచ్చి పడక్కుర్చీ పక్కనే చతికిలబడింది గాయత్రి.

నోట్లో నీళ్ళు పోసి పుక్కిలించి మళ్ళీవచ్చి కూర్చున్నారు సీతారామయ్యగారు.

"సంగతేమిటి బాబాయ్" అన్నది గాయత్రి నెమ్మదిగా.

ఒక్కక్షణం ఆమెవంక సాలోచనగా చూసి తిరిగి చూపు ఎదురుకు మళ్లించుకున్నారు సీతారామయ్యగారు.

"పదిహేనురోజులనాడు రాత్రిపూట భోజనం చేసాక ఇట్లాగే చుట్ట కాల్చుకుందామని ఈ కుర్చీలోనే వాలా. గేటు ముందెవరో తారట్లాడుతున్నారు.

"ఎవరదీ?" అని కేకేశా.

"నేనే బాబాయ్" అని లోపలికొచ్చాడు.

"నేనంటే" అన్నా.

"నేను బాబాయ్. పార్వతీశాన్ని" అంటూ దగ్గరకొచ్చాడు.

ఏది చెప్పినా తూచా తప్పకుండా చెప్పడం ఆయన అలవాటు.

ఓపిగ్గా వింటోంది గాయత్రి.

"నేనెరుగున్న పార్వతీశం ఒక్కడే. సంశయమొదలక ఏ పార్వతీశం" అని అడిగి పరకాయించి చూసాను."

"నన్ను గుర్తు పట్టలేదా బాబాయ్? నేను సదాశివశర్మగారి అబ్బాయిని. సుందరరామయ్య అల్లుడ్ని" అన్నాడు.

పన్నెండేళ్లనాడు దివాణం వారికి దడిచి బావగారితో పాటు పారిపోయిన నీ తమ్ముడు పార్వతీశవే వాడు. ఆనందవో, ఆశ్చర్యవోకానీ ఆ దిగ్భ్రమలోంచి తేరుకోవడానికి కాస్సేపు పట్టింది నాకు. ఆ తరువాత పక్కన కూర్చోబెట్టుకున్నాను.

"ఎప్పుడు వచ్చావయ్యా" అనడిగాను.

గంట క్రితం వచ్చానన్నాడు. రైలు దిగి ముందస్తుగా మీ ఇంటికే వెళ్లాట్ట. తలుపు తాళం పెట్టి వుంది. పోని పక్కన అనంతాచార్యులుగారింట్లో విచారిద్దామనుకుంటే ఆ ఇంట్లోనూ కొత్త మొహాలు అవుపించి అడగాలనిపించక సరాసరి ఇటు వచ్చానన్నాడు. నరే మనిషి చూస్తే బడలిపోయున్నాడు. ఎప్పుడనగా తిన్నాడో ఏవో మిగతా విషయాలు తరువాత అడుగుదామని చెప్పి మీ పిన్నిని కేకేసి..."

"తమ్ముడు ఆయన సంగతి ఏమీ చెప్పలేదా బాబాయ్?" అని ఆయన ధోరణికి అడ్డు పడింది గాయత్రి. ఇక నిగ్రహించుకోవడం ఆవిడ తరంకాలేదు.

అప్రయత్నంగా మాట్లాడ్డం ఆపి ఆత్రంగా చూస్తున్న గాయత్రి కళ్ళల్లోకి ఆర్ద్రంగా చూసారు సీతారామయ్యగారు.

ఆయన హృదయం ద్రవించింది.

ఒకనాడు తమని కష్టాల సుడిగుండంలోకి నెట్టి తన ప్రాణ రక్షణ మాత్రం చూసుకుని నిస్సంకోచంగా పలాయనం చిత్తగించిన మనిషిని భర్తే అగుగాక ఎలా క్షమించగలిగిందో పన్నండేళ్ళు మళ్ళీ మాట్లాడితే దాదాపు పదమూడేళ్ళు తాము ఎలా వున్నామో అని అజైనా కనుక్కోని అతగాడి గురించి ఎంత ఆదుర్దా పడుతోందో! అందుకే అన్నారు కాబోలు స్త్రీని క్షమయా ధరిత్రీ అని.



"మొట్టమొదట నేను పార్వతీశా న్నడిగింది సుందరరామయ్య రాలేదేమనే గాయత్రీ" అని ఒక్క క్షణం ఆగి నిట్టూర్చి "నీ తమ్ముడికి చాలిన ధైర్యం అతగాడికి చాల్లేదటమ్మా. ముందు నువ్వు వెళ్లు. పరిస్థితులు సవ్యంగా వున్నట్టయితే నేను తరువాత వస్తాను అన్నాట్టా ధీరుడు" అన్నాడు కాస్తంత నిరసనగా.

నిట్టూర్చింది గాయత్రి.

సీతారామయ్యగారు ప్రత్యేకించి "నీ తమ్ముడు పార్వతీశం తిరిగి వచ్చాడు. వెంటనే బయలుదేరిరా" అని ఇచ్చిన టెలిగ్రాం అందుకున్నప్పుడే గ్రహించిందా సంగతి.

కానీ ఏ మూలో చిన్న ఆశ రెపరెపమంటూ ఊరించింది ఇప్పటివరకూ.

హూ... ఇలా ఆశ నిరాశల్లో కొట్టుమిట్టాడ్డం తనకి కొత్తా! ఎక్కడో అలాంటి పోలికలున్న మనుషులు కనిపించారని చూచాయగా కబురందడం ఆలస్యం తనవాళ్ళనుకుని ఎన్నిసార్లు తహతహ లాడలేదు. వాళ్ళు కాదని తెలిసాక ఎన్నిసార్లు ద్రిగ్గళ్ళి పోలేదు.

గాయత్రి వదనం మీద పేలవమైన చిరునవ్వొకటి వెలిగింది.

"ఇప్పుడు కొంతలో కొంత నయంకదా! కూతురి బ్రతుకులోనన్నా శిశిరం అంతమై వసంతం తొంగిచూస్తోంది" అని తృప్తిపడుతూ.

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నారట బాబాయ్?" అడిగింది.

మళ్ళీ ఆయన తమ్ముడి స్నానం, భోజనం దగ్గర్నుంచీ వర్ణించడం అరంభించకుండా జాగ్రత్తపడుతూ.

"అపరాధభావంతో పారిపోతున్నవాడు నిలకడగా నిలవగలడా అమ్మా? కాలు నిలిచిన మరుక్షణం ఎవరో తమనే చూస్తున్నారనిపిస్తుంది. మళ్ళీ పరుగే. కన్యాకుమారినుంచీ కాశ్మీరం వరకూ సంచారంచేస్తూనే వుండాలి. కడుపు నింపుకుందుకు ఏ పనికయినా సిద్ధపడాలి" అనుభవజ్ఞుడిలా అన్నారు సీతారామయ్య గారు. "వీళ్ళు ముందు వెళ్లింది కలకత్తాకట. ఆ తరువాత ఎన్ని వూర్లు తిరిగారో ఏమో ప్రస్తుతానికి ఢిల్లీలో వుంటున్నారట. వీడికి ఇన్నేళ్ళకి ఇంటిమీదకి గాలి మళ్లింది. తెగించి వచ్చేసాడు. మీ ఆయనకింకా వెరపు తగ్గలేదు. అదీ సంగతి" అని ఆగి–

"నువ్వు విచారించకమ్మా. ఇవ్వాళో రేపో అతను వచ్చేస్తాడు. లేదా అసలంటూ ఆచూకీ చిక్కింది కనుక బెంగలేదు. మనమే వెళ్లి తీసుకొద్దాం" అన్నారు సీతరామయ్యగారు. తను దిగులు చెందకుండా భరోసా ఇస్తూ నమ్మదా యింపజూస్తున్న ఆయన్ని అభిమానంగా చూసింది గాయత్రి.

"తమ్ముడు మా గురించేమీ అడగలేదా బాబాయ్?" అన్నది కుతూహలంగా.

"ఎందుకడగలేదు. అడిగాడడిగాడు. ఇల్లు తాళంవేసి పాడుపెట్టినట్లుగా ఉందేమిటి. మావాళ్ళంతా ఏమయ్యారు? మా అమ్మానాన్నా బాగున్నారా? మా అక్కా, హేమా మా గురించి ఏమనుకున్నారు? చంద్రం, రవి ఇప్పుడేం చేస్తున్నారు? అని ఎడతెరిపి లేకుండా పన్నెండేళ్ళ ఆత్రాన్ని వెళ్ళబోసాడు. కానీ నేనే ఏమీ చెప్పలేదు. చెప్పలేకపోయాను.

అగ్నిహోత్రంలాంటి నా స్నేహితుడి కుటుంబం ఈత్రాష్టుల మూలంగా ఎన్ని కడగండ్లు పాలయిందో, ఎలా కకావికలమ యిపోయిందో ఈ కళ్ళతో చూసిన వాణ్ని, నేను చెప్పడం ప్రారంభిస్తే ఆ కడుపు మంట నా నోటివెంట ఎలాంటి అవాచ్యాలు పలికిస్తుందో తెలీదు. అంచేత మీ అక్కకి టెలిగ్రాం ఇచ్చాను. వస్తుంది. ఆవిడే చెబుతుందిలే అని మాత్రం చెప్పి ఊరుకున్నాను."

'అవును, ఎలాంటి కుటుంబం తమది?' గోడకి జార్లబడి మౌనంగా ఉండిపోయింది గాయత్రి. ఆమె మనోయవనిక మీద గతం తాలూకు దృశ్యాలు కదలాడుతున్నాయి.

❁ ❁ ❁

నగరానికీ, నాగరికతకూ కాస్త దూరంగా వున్న ఆ గ్రామంలో సదాశివశర్మగారంటే ఎనలేని భక్తిగౌరవాలున్నాయి.

వేదాలు చదువుకున్నాడాయన. సంస్కృతాంధ్రాల్లోనిధి. అంత పండితు డయ్యుండీ తాత ముత్తాతల వారసత్వంగా లభించిన వారి అధిదైవతము కపాలేశ్వర స్వామి అర్చకత్వంకోసం, తండ్రి దగ్గర స్మార్తం నేర్చుకుని ఈ మారుమూల కుగ్రామంలో అనామకుడిలా ఉండిపోయిన ఆయనంటే అందరికీ ఎంతో అభిమానం.

స్ఫురద్రూపం, వెలిగపోయే వర్చస్సు, దయనీ, విజ్ఞానాన్ని వెలిగక్కే నేత్రాలు, నుదుట విభూతిరేఖలు తీర్చుకుని కపాలేశ్వరస్వామి ఆలయంలో ఆయన ఉచ్చైస్వరంతో శివస్తోత్రం చేస్తుంటే జమిందారు కూడా తమ రాజసాన్ని మరచి తలవంచి నమస్కరించేవారు.

ఆయన పురాణం చెబుతూ శాస్త్రాల్లోని ధర్మసూక్ష్మాల్ని విడమరచి చెబుతుంటే జనం ముగ్ధులై వినేవారు. శివశర్మగారు ఒక్క కరకు మాట నోట రానీయని మేధకుడు. కడుపు చూపిస్తే కంచంలోది తీసి పెట్టేటంత జాలిగుండె ఆయనది.

ఆయన తాతా తండ్రీ ఆయుర్వేదంలో నిధులు. వారి నుంచి సంక్రమించిన విద్యతో ఆయన వైద్యం కూడా ఉచితంగా చేసేవారు. దానినుంచి బీదాబిక్కీ ఆయన్ని సాక్షాత్తూ

భగవంతుడి ప్రతిరూపంగా ఎంచేవారు.

కాత్యాయని ఆయనకు తగ్గ ఇల్లాలు. తల చెడి పుట్టింటికి చేరిన ఆడబడుచు రాజేశ్వరమ్మగారి ఆజ్ఞలకీ, మృదుహృదయుడైన భర్త అభీష్టాలకూ అనుగుణంగా నడుచుకోవడం తప్ప స్వంత అభిప్రాయమంటూ మరిచిపోయినట్లుగా మెలిగేదావిడ.

సదాశివశర్మగారి ఇంట్లో ఎక్కువగా రాజేశ్వరమ్మగారి కంఠమే ఖంగుమంటూ మోగుతుండేది తప్ప కాత్యాయని గట్టిగా మాట్లాడడంగానీ తరచూ బయట కనబడడం కానీ ఎవ్వరూ ఎరగరు. ఊరందరూ నెత్తిన పెట్టుకునే ఆ దంపతుల్ని విమర్శించే హక్కునీ, రాపాడించే అధికారాన్నీ చేతిలో పెట్టుకున్న ఒకే ఒక వ్యక్తి రాజేశ్వరమ్మగారు.

రాజేశ్వరమ్మగారు అతి చిన్న వయసులోనే భర్తను కోల్పోయి ఏణ్ణార్ధం నిశువు సుందరరామయ్యను ఒడినుంచుకుని పుట్టింటికి చేరింది.

అప్పటికామె తల్లీదండ్రీ బ్రతికే ఉన్నారు. శివశర్మగారు వేరే ఊళ్లో వేదవిద్యా పీఠంలో సంస్కృతం చదువుకుంటూ ఉండేవారు. అప్పట్నుంచే ఆ సంసార సారధ్యాన్ని తన చేతుల్లోకి తీసుకున్నదావిడ. తన ఇష్టప్రకారంగా ఆ ఇల్లు నడవడానికి అలవాటు పడిపోయింది.

ఆ తరువాత తల్లీదండ్రీ మరణించినా శివశర్మగారి పెళ్లయి కాత్యాయని కాపురానికి వచ్చినా పగ్గాలు మాత్రం ఆవిడ చేతిలోనే వుండిపోయాయి.

రాజేశ్వరమ్మగారికి తెలివితేటలేకాదు నోటిగత్తరతనం కూడా ఉంది. శాంతస్వభావుడైన శివశర్మగారిక్కానీ, నోటిలో నాలుకలేని కాత్యాయనిగ్గానీ ఆవిడ మాటకి ఎదురాడే ధైర్యం ఎప్పుడూ ఉండేదికాదు.

సదాశివశర్మగారి తొలి సంతానం గాయత్రి.

గాయత్రి పుట్టగానే 'నాకోడలు' అంది రాజేశ్వరమ్మగారు. మందహాసం చిందించారు శివశర్మగారు.

"రోజులు గుడ్డు. దానికి పెళ్లి మాటలు, ఎప్పటి సంగతి అది."

"అంతకంటేనా వదినా! సుందరానికిస్తే నాతల్లి నా కళ్ల ఎదుటే వుంటుంది'' మనస్ఫూర్తిగా అంది కాత్యాయని పచ్చగా బొద్దుగా వున్న సుందరరామయ్యను మురిపెంగా చూస్తూ.

కానీ కాలం గడిచేకొద్దీ ఆ మాట నిలబెట్టుకోవాల్సి వస్తుందేమోనని చాలా భయపడసాగిందామె. కారణం సుందరం దుందుడుకుతనం ఆమెను విపరీతంగా కలవరపరచడమే. అయిదారేళ్ళ వయసున్నప్పుడే సుందరరామయ్య అల్లరికి ఇంట్లోవాళ్ళు తట్టుకోలేకపోయేవాళ్లు. తనను‌కున్నది సాధించడానికి అతనుచేసే ఆగం అంతా ఇంతా కాదు. చేతికి దొరికినవన్నీ విసిరేసేవాడు. కనబడినవన్నీ పగలగొట్టేవాడు. ఎదుట పడినవాళ్ళని రక్కేవాడు. కొరికేవాడు. ఏడ్చి గీపెట్టి తన పంతం నెగ్గించుకునేవాడు. అంత అల్లరి చేసినా కొడుకుమీద తమ్ముడు సైతం కళ్ళెర్ర చేయడం సహించలేకపోయేది రాజేశ్వరమ్మగారు. వాడిని సమర్థిస్తూ వెనకేసుకువచ్చేది లేదా మొహం మాడ్చుకునేది.

గంటు పెట్టుకున్న అక్కగారి మొహం చూడలేక మేనల్లుడిపట్ల ఉదాసీన వైఖరి అవలంభించాడు సదాశివశర్మగారు.

దానితో ఆదుపు పెట్టేవాళ్ళులేక ఆడింది ఆట పాడింది పాట అయింది సుందరానికి. సుందరరామయ్యకి అక్షరాభ్యాసం చేసారు. కానీ అతనొక్కనాడూ సక్రమంగా స్కూలుకు వెళ్లిందిలేదు. బలవంతాన బడిలో దింపినా గంట తిరక్కుండా ఇంటికి పారిపోయి వచ్చేవాడు.

ఏళ్ళు గడుస్తున్నాయిగానీ అతని తీరుమాత్రం మారలేదు. చదువు వంటబట్టలేదు. స్కూలు ఎగ్గొట్టి గొడ్లు కాచే పిల్లలతోచేరి గోళీలూ గోటుంబిళ్లా ఆడ్డం, చెరువులో దూకి ఈత కొట్టడం, తోటల్లోపడి దొంగతనంగా కాయలు రాలగొట్టడం పరిపాటయింది.

సదాశివశర్మగారు లోలోపల చాలా బాధపడేవారు- ఈ పిల్లవడినెలా దారిలో పెట్టడమా అని. పావం ఆయనకు సాయంత్రం పూట మేనల్లుడ్ని దగ్గర కూచోబెట్టుకుని ఏ ప్రార్ధనా శ్లోకాలో వల్లె వేయించాలనుంటుంది. కానీ సుందరానికి కుదురెక్కడా?

పైగా తన సమయాన్ని వ్యర్థం చేయ ప్రయత్నిస్తున్న మేనమామకు శాస్తిగా ఆయన పడుకునే మంచానికి నవారు కోసేసేవాడు. ఉత్తరీయాన్ని చింపి ముళ్ళువేసేవాడు. జపం చేసుకునే తావళాన్ని దాచేసేవాడు.

రాజేశ్వరమ్మగారికి మాత్రం కొడుకు చేష్టలన్నీ శ్రీకృష్ణలీలలే.

"పోన్లేరా తమ్ముడూ! చిన్నసన్నాని. ఇంగిలీషు చదువుతాడు" అనేది మురిపెంగా.

'తన కొడుకు కలెక్టర్ అవ్వాలని కలలుగనే అక్కగారికి దానికెంత కష్టపడాలో, ఎన్ని పరీక్షలు నెగ్గాలో మాత్రం తెలీదు' నిట్టూర్చి ఊరుకుంటాడు శర్మగారు.

ఈ సోదంతా సదాశివశర్మగారు కరణం సీతారామయ్యగారితో చెప్పుకునేవారు. వారిద్దరూ బాల్యం నుంచీ స్నేహితులు. వారి కుటుంబాల మధ్య కూడా ఎంతో సఖ్యత, ఆప్యాయతలు ఉండేవి. అప్పటికింకా సంతానం కలగని సీతారామయ్యగారి భార్య మహాలక్ష్మమ్మ గాయత్రిని చంక దింపేది

కాదు.

మేనల్లుడి కొరకు మదనపడుతున్న స్నేహితుడ్ని "ఏమిటోయ్ ఇప్పట్నించే అల్లుడ్ని నీ అంత పండితుడ్ని చేయాలనుకుంటున్నావా ఏమిటి?" అని వేళాకోళం చేసేవారు కరణంగారు.

ఒక్కోసారి "మీ అక్క అన్నట్లు చిన్న తనంలేద్దూ. వయసొస్తే వాడే తెలుసుకుంటాడు" అని ఉపశమనంగా మాట్లాడేవాడు.

సీతారామయ్యగారికి సుందరం అల్లరి తెలుసును. రాజేశ్వరమ్మ గారి నోటి దురుసుతనం తెలుసును.

దండోపాయం ప్రయోగించాల్సిన వాళ్లమీద సామం ఉపయోగిస్తే ఏమి ప్రయోజనముంటుంది?

కానీ తన మిత్రుడు కొట్టేవాళ్ళమీద కూడా కొమ్ము విసరని గంగిపోవాయె. వాళ్లనెలా లొంగదీయగలడు.

కొన్ని సమస్యలు పరిష్కారానికి ఇమడవు. కాలమే వాటికి జవాబు చెప్పాలి అని తనలో తనే సమాధానపడేవాడు.

కానీ సుందరం విషయంలో కాలం కూడా ఏమి పరివర్తన తేలేకపోయింది.

గాయత్రి పదేళ్ళదయి తండ్రి దేవతార్చనకు కావలసినవి సర్దిపెట్టడం, తల్లికి పనిలో సాయం చేయడం చేస్తోంది. భారత రామాయణాలు చదవడం నేర్చుకుంటోంది. ఆమె తరువాత కాత్యాయనికి రెండు కాన్పులు నష్టమై ఆలస్యంగా పుట్టిన పార్వతీశం. "శుక్లాం బరధరం..." అంటూ తండ్రి చెప్పినవి చిలకలా వల్లిస్తాడు.

సుందరరామయ్య మాత్రం ఏకు మేకయ్యాడు. ఒక దశ దాటాక ఆకతాయితనం కూడా నాయకత్వ లక్షణాన్ని కూర్చుకుంటుంది.

పదహారేళ్ళు దాటిన సుందరం వెనుక అతని చేష్టలకు సాయంగా ఒక అల్లరిమూక తయారయింది.

ఆ దండు చేసే ఆగడాలకి ఊరూ వాడా కూడా దడిచిపోయేది.

మంచినీళ్ళకని చెరువుకొచ్చే ఆడపిల్లలని అసభ్యంగా వర్ణించి ఏడిపించడం, వెంటబడి వేధించడం వారి నిత్యకృత్యం.

ఇదేమన్నవాళ్ళకి మూడిందన్నమాటే.

వాళ్ళ ఇళ్ళమీద రాళ్ళు పడి పెంకులన్నీ చితికూరుకునేవి. వారి పెరట్లో మొక్కలకి పువ్వు పిందే మిగిలేది కావు. ఆ ఇంటిముందు పల్లేరుకాయలు పరచివుండేవి. వారి పెరటి నూతిలో చచ్చిన పిల్లో, ఎలుకో, తేలేది. అర్ధరాత్రి వీధి తలుపులు దయ్యాలు తట్టినట్టుగా దబదబ మోగిపోయేవి.

పాపం... కాస్త మందలించిన నేరానికి ఇన్ని పాట్లు పడలేక లబోదిబోమంటూ సదాశివశర్మగారికి మొరపెట్టుకునేవాళ్ళు వారు.

ఆయన మాత్రం ఏం చేయగలడు? కేకలేస్తాను అనేవాడు. కానీ ఫలితం మాత్రం శూన్యం.

ఇది పనికాదని ఫిర్యాదులు నేరుగా రాజేశ్వరమ్మగారికే మనవి చేయడం ఆరంభించారు.

తన బండి ఎద్దులు రెంటి తోకలు కలిపి ముడిపెట్టాడని చెప్పవచ్చిన రంగయ్యతో రాజేశ్వరమ్మగారు "నా కొడుకొకడేనా వూళ్ళో అల్లరి పనులు చేసేది? నీకు లేరా కొడుకులు? నా కొడుకు తప్పులెన్నుతున్న? వాళ్ళకు లేరా కొడుకులు" అని నోరు చేసుకునేసరికి–

"చూడండమ్మా! మిగతా పిల్లలకి ఎప్పుడో మక్కెలిరిగాయి. మీ పిల్లవాడ్నే దైవంలాంటి మీ తమ్ముడి మొహం చూసి వదిలేని వూరుకుంటున్నాం. ఏదో గురువుల ఇంటిపిల్లవాడు చెడిపోతున్నాడే అన్న బాధకొద్దీ దార్లో పెట్టుకుంటారేమో అన్న భ్రమకొద్దీ మీదాకా వచ్చి చెప్పుకుంటున్నాం. కానీ మీరిలా అడ్డగోలుగా మాట్లాడతారని తెలిస్తే ఏనాడో మేమే ఏ వెధవపని చేస్తున్నప్పుడో దొరకబుచ్చుకుని ఏ కీలో విరిచేసి బుద్ధి చెప్పుండేవాళ్ళం. ఇందాక వచ్చేపని లేదు మాకు. మళ్లీ చెప్తున్నాను. 'తోటకూరనాడే చెప్పకపోతివే' అన్న మాట పడకుండా ముందే జాగ్రత్తపడండి. తర్వాత మీ ఇష్టం" అని నిష్కర్షగా తెలియజెప్పేసరికి–

'నానోటి కెవరుసాటి?' అనుకునే ఆమె అహం కొద్దిగా జంకింది.

మభ్యపెతుతున్న మనస్సును కాస్త వెనక్కినెట్టి ఆలోచిస్తే సుపుత్రుడు చేసే ఘనకార్యాలు, పిల్లచేష్టలూ, కృష్ణలీలలూ కావని, ముదురుతున్న దుండగాలని తెలియజెప్పింది బుద్ధి. ఆపైన రంగయ్య చేసిన హెచ్చరిక ఏమాత్రమో భయపెట్టింది కూడా.

కాని తప్పు తెలుకున్నా ఒప్పుకునే నైజం మాత్రం లేదావిడకి.

ఉట్టు ఉడియంగా తమ్ముడిమీద విరుచుకుపడి "నీకిదేవన్నా న్యాయంగా ఉందిరా తమ్ముడూ! తండ్రిలేని పిల్లాడు.

తండ్రి తరువాత బాధ్యత తీసుకోవలసిన మేనమామవని నీ చేతిలో పెడితే వాడి మంచీ చెడ్డ చూడవైతివి, గాలికొదిలేసావాయె. వాడిప్పుడు వూరందరిచేతా జులాయనిపించు కుంటున్నాడు. నువ్వు ముందే కోప్పడుతూ వుంటే ఈ మోస్తరుగా తయారయ్యే వాడా? నేనేం చేయనిప్పుడూ?" అంటూ పెద్దపెట్టున రోదినస్తూ నెపమంతా తమ్ముడిమీదకి నెట్టేసింది.

అవాక్కయ్యారు శర్మగారు.

ఊరి పెద్దల్లో ఒకరైన పైడిరెడ్డిగారు తమ పెరట్లో ఉసిరి చెట్టంతా మీ మేనల్లుడు దులిపేసాడయ్యా అని వచ్చి చెబితే భయముంటుందని చెప్పి సుందరాన్ని గట్టిగా కోప్పడి ఆ పూట అభోజనంగా వుంచమన్నందుకు ఈ అక్కగారే ఒకనాడు అలిగి రెండురోజులు తిండి మానేసింది. చచ్చిపోయిన మొగుడ్నీ, తల్లిదండ్రుల్నీ తన్నీగతికి వదిలినందుకు తిట్టిపోసుంది. నీ కొడుకైతే ఇలా చేద్దువా అని నిలేసింది. ఇంత అవమానం జరిగాక ఇక్కడుంటానా అని మూటాముల్లె సర్దుకుని ముట్టుపక్కలవాళ్ళు తొంగి చూసేలా నానా రభస చేస్తే తనదే తప్పన్నట్లు తను తల వంచుకున్నాక కాత్యాయని కన్నీళ్ళ పర్యంతమై కాళ్ళు పట్టుకున్నంత పనిచేసాక అప్పుడూ శాంతించిందీవిడ.

అప్పుడేకదూ ఇక సుందరం జోలికిపోనని లోలోపల చెంపలేసుకున్నదీ!

నోటితో చెప్పకపోయినా తమ్ముడి మొహంలో కదిలే భావాలు తెలుకుకోలేనంత తెలివి తక్కువది కాదు రాజేశ్వరమ్మగారు.

"కన్నప్రాణం ఊరుకోలేక ఎప్పుడో ఓసారి అడ్డుపడ్డానే అనుకో, అంతమాత్రాన అక్కడితో చేతులు దులుపుకు ఊరుకోవడమేనా? కొట్టేది కొడుకునీ అడ్డుపడేది మీ ఆవిడా అయితే అట్లా ఊరుకుందువా? దాన్ని కసిరి వాడి చెవి మెలి వేయడంలా? అట్లాండివాడు కాదూ వీడు. అంత వలపక్షమేం" ? అన్నదావిడ కినుకుగా. ఆవిడ నాలుక్కి రెండువైపులా పదునే.

అక్కగారి అభియోగానికి విస్తుపోతున్న తమ్ముడ్ని తేరుకోనియ కుండానే మళ్ళీ అన్నది "ఏమో నాయనా! వాడు నీ అల్లుడు. నీ ఇష్టం. ప్రయోజకుడ్ని చేశావో నీ కూతురే సుఖపడుతుంది. లేదూ వాడు అల్లరిచిల్లరవాడయి కాకిలా తిరుగుతుంటే నీ కూతురికి సమాదానం చెప్పుకోవాల్సింది నువ్వే కానీ నేను కాదు" అంటూ స్వరం మార్చి ముందరి కాళ్ళకి బంధం వేసింది.

వెలవెలబోయారు శర్మగారు.

"నరేలే. ఎప్పటి మాటలో ఇప్పుడెందుకు?" అన్నారు తుంచేస్తూ.

"పన్నెండేళ్ళువస్తున్నాయి గాయత్రికి. ఇంకా ఎప్పుడో అంటావేమిటి? ఈడేరాక చేస్తానంటావా ఏమిటీ కొంపదీసి. మన ఇంటావంటా లేవున్మీ అలాంటి అపభ్రంశప్పనులు. ఆ బంధం ఒకటి ఏర్పడితే వాడికి కూడా కుదురొస్తుంది. ఏమంటావ్?" అన్నది రాజేశ్వరమ్మగారు విషయాన్ని ఖరారు చేసుకోదలచినట్టు ఆత్రపడుతూ.

"చూద్దాం... చూద్దాం. ముందు సుందరాన్ని ఓత్రోవకి తీసుకురానీ" అన్నారు శర్మగారు విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేస్తూ.

ఇష్టంలేని ఆ మాటని తప్పించగలిగినా ఇష్టంకాని ఆ పరిస్థితిని మాత్రం తప్పించలేకపోయారు శర్మగారు.

మేనరికం పేరుతో చదువుసంధ్యా సంగతటుంచి కనీసం మంచి నడతన్నా లేనివాడి చేతిలో చూస్తూ సుగుణాల ప్రోవైన తన కూతుర్ని పెట్టడం సుతరామూ మనస్కరించడంలేదాయనకి.

కానీ రాజేశ్వరమ్మగారి వాక్చాతుర్యమనే అక్షయ తూణీరంలోంచి శోకం, ఆక్రోశం, ఆగ్రహం కలగలిసిన నిష్ఠురాస్త్రాలని ఒకటి తరువాత ఒకటి ఎడతెరపి లేకుండా సంధించి వదిలేసరికి అక్కగారి ధాటికి నిలువలేక తల వంచేశారాయన.

"శర్మా! వివాహమంటే నచ్చకపోయినా 'పోన్లే ఒకసారి కట్టి విడిచేద్దాం' అనుకుని ధరించే వస్త్రం కాదయ్యా. అవి రెండు నిండు జీవితాల భవిష్యత్తు. ముఖ్యంగా ఆడపిల్ల మెడలో పసుపుతాడు కట్టే ఆ పురుషుడు 'కా'పురుషుడయితే ఆ మాంగల్యం మూడు ముళ్ళ అనుబంధం కాదు విప్పదీయవీల్లేని కటిక ముడుల బంధనం. సరిదిద్దుకోలేని పొరపాటు. బెదిరింపుకో, బలవంతానికో లొంగి నువ్వా పసిదాని బ్రతుకుని గాలిలో పెట్టొద్దు. నా మాట విని నీ మనస్సుని దృఢం చేసుకో. మరొక్కసారి ఆలోచించి నిర్ణయానికి రా!"

నిశ్చితార్థానికి పిలవొచ్చిన సదాశివాశర్మగారికి సీతారామయ్యగారు పరిపరివిధాల బోధించారు, హెచ్చరించారు.

"అన్నీ తెలిసనవాడివి. నువ్వే అలా అంటే నేనేం చెప్పగలను రామం" అన్నారు శివశర్మగారు బేలగా.

"అక్కయ్య ఎంగ్రిన్ డబ్బా ముందు పెట్టుక్కూర్చుంది ఈ ముహూర్తాల్లో పెళ్ళి చెయ్యకపోతే తాగి చస్తానని. ఆవిడ మూర్ఖత్వం నీవెరగందా? నా కారణంగా ఆవిడ ఏదన్నా అయితే ఈ జన్మకి నన్ను నేను క్షమించుకోగలనా? ఊహూ... ఏటికెదురీదే సాహసం నాకు లేదయ్యా. కానివ్వు ఏదెలా జరగాలని ఉంటే అలాగే జరుగుతుంది. రాని పెట్టి ఉన్నదాన్ని మార్చడం మన తరమా?" ప్రతి సామాన్యుడూ చివరాఖరికి ఆశ్రయించే ఖర్మ సిద్ధాంతానికే కూకుతి భవిష్యత్తుని వదిలేస్తూ విరక్తిగా అన్నారు శివశర్మగారు.

పాండిత్యంలో మేటి అయిన తన మిత్రుడు లౌకికంలో మాత్రం పూర్తి అర్భకుడని తెలిసిన సీతారామయ్యగారు

నిట్టూర్చి ఊరుకున్నారు.

గాయత్రి వివాహం సుందరరామయ్యతో ఏ ఆటంకం లేకుండ జరిగిపోయింది. మేనల్లుడు అల్లుడు అయ్యాక కొంచెం ధైర్యం తెచ్చుకున్నారు శివశర్మగారు.

అక్కగారి అలకనీ, ఎవరేమనుకుని పోతారో అనే వెరపునీ లక్ష్యపెట్టడం మానేసారు. సుందరాన్ని పట్టుదలగా సంస్కరింపబూనుకున్నారు.

కానీ చవిటి పర్రలో చేసిన వ్యవసాయమే అయింది ఆయన ప్రయత్నం.

నాలుగేళ్ళనుంచీ దాటలేకపోతున్న ఆ టెన్త్‌క్లాసు స్కూలు చదువును తను మరిక కొనసాగించబోనని సుందరం తేల్చి చెప్పేశాడు. మరి ఇరవయ్యేళ్ళు వస్తున్న వాడికి ఇప్పుడు ఏ విద్య మొదలుపెడితే మాత్రం అది ఎప్పటికి ముగిసేను? ఏమి చెయ్యాలి అతగాడ్ని!

నీరసమొచ్చినట్టయింది శివరశర్మగారికి.

భగీరథ యత్నం చేస్తే తప్ప సంకల్పమూ, మంత్రపుష్పం నేర్పలేక పోయాడు సందరానికి.

పొలం పనులు చేయించమంటే మాత్రం ఉత్సాహంగా వేళ్ళేవాడు. పోన్లే అదీ మేలే అని తృప్తి పడబోయేంతలో కోతలకొచ్చే కూలిపిల్లలతో సరాగాలాడుతున్నాడనీ, కుప్ప వేయబోయే కట్టల్లో కొన్నికూలివాళ్ళకే అమ్మేస్తున్నాడనీ వార్తలు.

పోతే కొత్తగా అడగాడు నేర్చుకున్న దేమిటంటే ఆ డబ్బు చేతినుంచు కుని వూళ్ళోంచి మాయమయి పోవడం, చేతులు ఖాళీ అయ్యాక ఇంటికి రావడం.

వనస్తా సిగరెట్లు, పేకదస్తాలూ తీసుకొచేవాడు. వూళ్ళోకింకా ప్రవేశించని జీన్స్‌పాంట్లు, బొమ్మలబనీన్లు లాంటి వి మోసుకొచ్చేవాడు. సైనుగుడ్డ బనీన్లు కంటె వెండ చొక్కాలు, వంచల్ని మించి ఆలోచించలేని ఆ పల్లె ప్రజల్ని అబ్బురపరిచేవాడు.

పిల్లకారు వాళ్ళకదో వింత, వెనకటి తరం వాళ్ళకదే అవలక్షణం. ఇది పని కాదని తనే పొలం పనులు చూసుకుంటూ సుందరాన్ని గుళ్ళో పూజకు పంపించి చూసారు. అక్కడ్నుంచి కూడా మండపంలోనే చీట్లపేక ఆడుతున్నాడని, బీడీ కాలుస్తున్న చేతితోనే హారతి ఇస్తున్నాడనీ ఫిర్యాదులు. దక్షిణ వేసిన చిల్లర డబ్బులు గుటకాయస్వాహా. మళ్ళీ పూజ మానిపించి పొలానికి పంపించడం, అలా ఎప్పటికయినా అతనికి కుదురురాకపోతుందా అని ఆశపడుతూ అటు కాదని ఇక్కడికీ, ఇదికాదని అక్కడికీ మారుస్తుండడంలోనే ఏళ్ళు గడిచిపోయాయి. సుందరం ముగ్గురు బిడ్డల తండ్రయ్యాడు.

గాయత్రి తొలిచూలు బిడ్డ హేమలత.

ఇప్పుడాయనకి అల్లుడు బాగుపడ్డంలేదే అన్న విచారం పాతబడిపోయింది. కొడుకు చెడిపోతున్నాడే అన్న కొత్త చింత పట్టుకుంది.

తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని సుందరం పార్వతీశాన్ని తన వెంట తిప్పుకుంటున్నాడిప్పుడు. తన సరదాల్ని అతనికి కూడా కాస్త కాస్త రుచి చూపిస్తున్నాడు. ఎంతో బాధ్యతగల ఉపాధ్యాయునిలా తన విద్యలను అతనికి నేర్పుతున్నాడు.

అభం శుభం తెలియని వయసు పార్వతీశానిది ఆ పసి ప్రాణానికి బావగారో హీరో. సందరం సిగరెట్ పొగ రింగులు రింగులుగా వదులుతుంటే అద్భుత మనిపిస్తుందతనికి. కాస్తంత అశ్లీలతను మేళవించి ఎవరిని లెక్కచేయని ధోరణిలో నిర్లక్ష్యంగా, దూకుడుగా మాట్లాడే ఆ తీరూ అతన్నెంతో ఆకర్షించింది. గాయత్రి మంత్రోపదేశం చేసిన తండ్రికాదు, ఆసులూ, జాకీలు పరిచయంచేస్తున్న భావగారే గురువనిపిస్తారతనికి.

శివశర్మగారికయితే కొడుక్కి స్మార్తంతో పాటు సంస్కృత పరిచయం కూడా చెయ్యాలని అభిలాష. ఏనాటికైనా తను ప్రాణప్రదంగా పదిలం చేసిన కావ్యాలకి, గ్రంధాలకీ కొడుకుని వారసుడ్ని చేయాలని ఆయన ఆకాంక్ష. అందుచేత పార్వతీశంతో నమక చమకలు వల్లెవేయించడంతోపాటు ఇసుకలో దేవనాగర లిపి కూడా దిద్దిస్తున్నారాయన.

తండ్రి వున్నంతసేపూ పార్వతీశం ఆయన చెప్పిన వల్లా బుద్ధిగా వల్లె వేస్తాడు. కొత్త శ్లోకాలు నేర్చుకుంటాడు. సుందరరామయ్య కనబడగానే మాత్రం అదేమిటో మంత్రించిన పాములా పాఠం వదిలేసి, అతని వెంట వెళ్ళిపోయేవాడు.

అల్లుడి ప్రభావం నుంచి కొడుకునెలా తప్పించాలో తెలీక తల్లడిల్లిపోసాగారు శివశర్మగారు.

కరణంగారికప్పుడు ఇద్దరు మగపిల్లలు. వాళ్లకి అయిదేళ్లు రాగానే పక్క టౌనులో మంచి కాన్వెంటు చూసి చేర్పించారు. వాళ్ళ భోజన వసతికోసమ అక్కడే రెండు గదులు అద్దెకు తీసుకుని అత్తగారిని తోడుంచారు. తరచూ తను వెళ్ళి పర్యవేక్షించి వస్తుంటారు.

"జ్ఞానవేదో, వ్యామోహవేధో తెలుసుకోగల వయసు కాదు పార్వతీశానిది. ఇప్పుడా ప్రలోభాలకు దూరంగా వుంచి శిక్షణలో వుంచకపోతే చెడిపోతాడు. నా మాటవిని వాడ్ని నా పూచీమీద వదిలిపెట్టు, మా పిల్లలతోపాటు టౌనుకి పంపిస్తాను. చక్కగా చదువుకుంటాడు." అని మిత్రుడికి ఎంతగానో హితబోధ చేశారు

సీతారామయ్యగారు.

తల అడ్డంగా తిప్పారు శివశర్మగారు.

"వాడు కపాలేశ్వరస్వామి వరప్రసాదంరా సీతారాముడూ! మా వంశంలో మగపిల్లవాడు ఆ స్వామి కైంకర్యంకోసమే జన్మిస్తాడయ్యా. వాడికి నాగరిక విద్య నేర్పించి నా తండ్రి ఆ కపాలేశ్వరుడికి దూరం చేయనా? ఆ అపచారం నావల్లకాదు" అన్నారు లెంపలేసుకుంటూ.

"మీ ఇంటి వాతావరణంలో వాడు రోజురోజుకీ భ్రష్టు పట్టిపోతున్నాడుకదా, ఇంకా ఇక్కడే వుంటే నీ అభీష్టం నెరవేరుతుందనే నమ్మకం వుందా నీకు?" అన్నారు సీతారామయ్యగారు.

"నా ప్రయత్నం నేను చేస్తున్నాను. చేస్తాను. మిగతాది ఆ కపాలేశ్వరుడే చూసుకుంటాడు" శివశర్మగారు చేతులెత్తి నమస్కరించారు.

అన్నట్టుగానే పార్వతీశాన్ని తన కనుసన్నలు దాటిపోకుండా కాచుకుంటూ వైదిక విద్యనీ, సంస్కృతాన్నీ కూడా బోధించసాగాడు శివశర్మగారు.

అడపాదడపా తండ్రి కనుచాటు కాగానే బావ దగ్గరకు చేరుతున్నా చదువుని అశ్రద్ధ చేయలేదు పార్వతీశం.

అదే చాలన్నట్లుగా తాత్కాలిక ఉపశాంతి పొందారు శివశర్మగారు.

✿ ✿ ✿

ఉన్నట్టుండి రాజేశ్వరమ్మగారి ఆరోగ్యం చెడింది.


గుండె దడ, ఆయాసం, అడపాదడపా జ్వరం, ఆకలి లేకపోవడం, నెల్లాళ్లలో మనిషి సగం తీసిపోయింది.

శివశర్మగారు తన అనుభవాన్నంతా రంగరించి మరీ మందులు వాడుతున్నారు. అయినా ఏమాత్రం గుణం కనిపించడంలేదు.

ఆవిడకి తానిక బ్రతకననే ఆశ బొత్తిగా క్షీణించిపోయి తన ఆయుష్షు తీరిపోయిందనే నమ్మకం ప్రబలిపోయింది.

పట్నం తీసుకుపోదామనుకున్న తమ్ముడి ప్రయత్నం కూడా పడనివ్వలేదావిడ.

"నీ వైద్యం మీద నీకు నమ్మకం



లేకపోవచ్చుగానీ నాకు నమ్మకమేరా తమ్ముడూ! నీ ఔషధానికి నా రోగం లొంగలేదంటే నాకీ భూమ్మీద నూకలు నిండుకునాయని అర్థం. నువ్వారికే ఆ వూరు ఈ వూరు అని హైరానా పడకు" అని మందలించిందావిడ.

"పుట్టిన తరువాత కాపురానికంటూ ఏ రెండేళ్ళో తప్ప ఈ ఊరు వదలిందాన్నికాదు. ఈ చివరి రోజుల్లో ఈ మట్టికి నన్ను దూరం చేయకు" అని ప్రాధేయపడడంతో ఆ ప్రయత్నం విరమించారు.

వ్యాధి రోజురోజుకూ ముదురుతోంది. ఇక అందరూ ఆవిడ మీద ఆశ వదులుకున్నారు.

అప్పుడు బయటపెట్టింది రాజేశ్వరమ్మ గారు తన చివరి కోరికని 'పార్వతీశానికీ నా మనవరాల్నిచ్చి పెళ్లి చేస్తే చూసి తృప్తిగాపోతాను' అంటూ.

పైకి అనకున్నా అది నిర్ణయమయి పోయిన విషయమే అని ఆ ఇంటిల్లిపాదికీ తెలుసు.

"దానికేం వచ్చే ఏడు అనుకున్నది ఈ ఏటి లగ్నాలలోపే చేసేద్దాం" అన్నారు శివశర్మగారు అక్కగారి కోరిక నెరవేర్చడమే తన ధ్యేయమన్నట్లుగా.

ఆదరాబాదరా ముహూర్తం పెట్టారు. పసుపు కొట్టి పెళ్లిపనులు ప్రారంభించారు.

తన భవిష్యత్‌పథాన్ని తన ప్రమేయం లేకుండానే నిర్దేశిస్తున్నారని కూడా తెలుసుకోలేని పసితనపు అమాయకత్వంలో నిశ్చింతగా లక్కపిడతలతో ఆడుకుంటున్న తన కూతురు హేమలతని చూసి చాటుగానే కళ్ళు తుడుచుకున్నది గాయత్రి.

ఆ ఇంట్లో ఆ పెళ్లి జరక్కుండా ఉండాలని కోరుకుంటున్న ఒకే ఒక వ్యక్తి గాయత్రి.

'ముక్కుపచ్చలారని ప్రాయంలో మూడు ముళ్ళు వేయించుకున్న దాని ఫలితం తానునుభవిస్తూనే ఉన్నది కదా. భర్త అంటే జీవితకాలపు సహచరుడనీ, కష్టసుఖాల్లో, ఆలోచనానుభూతుల్లో ఒకరికొకరు తోడునీడగా, స్నేహానురాగాలతో మెలిగే భాగస్వాములనీ అర్థం తెలిసే వయసు వచ్చేసరికి అంతా మించిపోయింది. తన చేయి జారిపోయిందని తెలిసిపోయింది.

మగని సుందరరూపం వెనుకనున్న వికార వ్యక్తిత్వం మానసికంగా తన్నెంత చిత్రవధకు గురి చేస్తుందో ఎవరికి తెలుసు.

ఆ భర్తకి ఉపగ్రహంలాంటివాడు తన తమ్ముడు.

తన వారసత్వమే కూతురుకీ రాబోతుందని తెలిసినా ఏం చేయగలదు తను? ఏ విపరీతమో జరిగి ఈ పెళ్ళి ఆగిపోవాలని మూగగా కోరుకోడం మినహా!

కానీ ఆమె వాంఛించినట్లుగా ఏ దేవుడూ అడ్డుపడలేదు. హేమలత పార్వతీశంల వివాహం నిర్విఘ్నంగా అయిపోయింది.

భారమైన హృదయంతో అక్షింతలు వేసింది గాయత్రి.

❁ ❁ ❁

ఆ వూర్లో దివాణం వారు గౌరవం నెరపే ఏకైక కుటుంబం శివశర్మగారిది.

రాజుగారి పూర్వులు ఈ ప్రాంతాన జమీ సంపాదించినప్పుడే ఇక్కడి పాడుబడిన కపలేశ్వరస్వామి వారి ఆలయాన్ని పునరుద్ధరించారు. తాము దివాణంలో నివాసం ఏర్పరుచుకున్నందుకు తరలి వస్తూ పురోహిత కుటుంబాన్ని కూడా వెంటబెట్టుకొచ్చి స్వామి అర్చకత్వం ఒప్పజెప్పారు. భూమీ, వసతి ఇచ్చి స్థిరపరిచారు.

పండుగలకూ, పబ్బాలకూ, శుభకార్యం జరిగినా, ఉత్సవాలు జరిగినా విరివిగా కానుకలు పంపి మర్యాద చూపించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు.

అందుకు కృతజ్ఞతగా అప్పట్నించే వారి ఐశ్వర్య ఆయురారోగ్యాలు కోరుతూ కపాలేశ్వరుడి సేవతో పాటు దివాణంలోని దేవతామూర్తులక్కూడా నిత్య పూజాదికాలు నిర్వర్తించే బాధ్యతను ఆ కుటుంబం స్వయంగా మోస్తున్నది.

శివశర్మగారు కూడా తమ పెద్దల దారినే అది తమ విధిగా భావించి క్రమం తప్పకుండా ప్రతిరోజు దివాణానికి వచ్చి పూజలు జరిపించి వస్తుంటారు. ఉదయం పూట ఈ రెండు బాధ్యతలూ ఒకేమారు చేయవలసిరావడం శివశర్మగారికి హడా విడిగాను తొందరతొందరగానూ ఉండేది.

తొలిఝాములోపే నిద్ర మంచం మీద లేచిపోయి స్నానం సంధ్యా కానివ్వడం, ముందన్నుగా కపాలేశ్వరస్వామిని అభిషేకించడం, ఉరుకులు పరుగులతో దివాణం చేరడం, అక్కడి దైవానికి దీపధూప నైవేద్యాలు సమర్పించి తిరిగి అంగలు పెద్దవిగా చేసుకుంటూ ఆలయానికి చేరుకోడం ఇలా...

ఈలోపల భక్తులెవరైనా గుడికివచ్చి తనకోసం నిరీక్షిస్తున్నారేమో, లేక నిరాశతో తిరిగి వెళ్లిపోతున్నారేమో అన్న తపన ఆలయం చేరేదాకా అయన్ని కలవరపెడుతూ వుండేది.

పార్వతీశం చేతికంది వచ్చాక కాస్త వెసులుబాటుగా వుంటోంది ఆయనకు.

ఆయన దివాణానికి వెళ్లి వచ్చేంతవరకూ పార్వతీశం ఆలయంలో వుంటున్నాడు. హారతీ, అభిషేకం లాంటివి ఏమాత్రమూ తడబాటు, పొరపాటు లేకుండా శ్రద్ధగా,

తృప్తిగా చేయించడం చూస్తుంటే శివశర్మగారికి చింతతీరి చాలా సంతోషంగా వుంటోంది.

తనకి వెనక దన్నుగా నిలిచే తల్లి ఖాయిలా పడడంతో సుందరం అదిరిపాటు కూడా చాలావరకు తగ్గిపోయింది. మేనమామ ఏదన్నా చెబితే వెనుకటిలా తలాయించడంలేదు. ఇంటి అవసరాలు పట్టించుకుంటున్నాడు.

ఇన్నాళ్లకి మంచిరోజులు వచ్చాయి. అని ప్రశాంతంగా అనుకోబోయేంతలో రాజేశ్వరమ్మగారు మరణించింది.

అక్కగారి మరణం శివశర్మగారిని బాగా కృంగదీసింది. ఆధారం లాగేసిన పాదులా కుప్పకూలిపోయారాయన.

అందరూ తన చెప్పుచేతల్లో ఉండాలనీ, తన మాట ప్రకారం నడవాలనే తరహా రాజేశ్వరమ్మగారిదయితే, ఏ మాత్రం ఘర్షణ లేకుండా ఆవిడ ఇష్టానికి ఒదిగిపోయే మనస్తత్వం శివశర్మగారిది.

"గట్టితనంలేదురా తమ్ముడూ నీ దగ్గర. ఈ ఏడు కవులు నేను మాట్లాడతా. నువ్వు గమ్మునుండు" అంటే ఆడపెత్తనమను కోకుండా "సరే నువ్వే చూసుకో" అని వ్యవహారం ఆవిడకి హాయిగా వదిలేసేవాడు.

"ఒరే శివా! ఇవాళ తిథి మంచిదని క్షురకర్మకు వీరన్నధని పిలిపించానురా" అంటే నన్నడగకుండా ఎందుకు రప్పించావనే వాడుకాదు. కామ్‌గా మంగలి ముందు తలవంచీ కూర్చునేవాడు. కొన్నింటిలో ఆవిడ నిరంకుశత్వం కొంత బాధించినా ఆవిడ సారధ్యం ఒక విధమైన నిశ్చింతని కలిగించేదాయనకి.

తన మాట జవదాటని తమ్ముడిమీద ఆవిడకీ అభిమానమే.

తమ్ముడిని నిద్ర లేవడం కోసం తెల్లవారుజామున ఆయనకంటే ముందే లేచి కూర్చోవడం, ఆయన స్నానం పానం, జపం తపం, ఆహారం, విహారం... అన్నింట్లోనూ వెనకుండి జాగ్రత్తగా ఏ లోపం లేకుండా జరిపించడంలో ఎంతో అప్రమత్తంగా ఉండేదావిడ. ఆయనకి ఏమాత్రం బాధ కలిగినా సహించగలిగేదికాదు. ఆయన కాల్లో ముల్లు గుచ్చుకుంటే తన కాలు విరిగినంత విలవిల్లాడేదావిడ.

ఇట్లా తన ప్రతి పని వెనకా ఆవిడ హస్తముండడం, ఏ పనయినా ఆవిడ చెప్పిన తరువాతే చెయ్యడం అలవాటయి ఇప్పుడావిడ మరణంతో దిక్సూచి పోయిన నావలా దిక్కు తోచనట్లుగా అయిపోయారు శివశర్మగారు.

ఏదో తెలీని గుబులు ఆయన్ని హఠాత్తుగా భయపెట్టింది. బలహీన పరిచింది. ఏనాడూ కసుకందని ఆయన శరీరం తరచూ అనారోగ్యం పాలవసాగింది.

ఆయనలా జ్వరమనో, తలనొప్పి అనో పడకపెట్టిన నాడు దివాణానికి సుందరమో, పార్వతీశమో వెడుతుండేవారు.

దివాణంవారితో పరిచయం వారిద్దరికీ అలా ఏర్పడింది.

"రాజులతో వ్యవహారం. వారికి ఆగ్రహమొచ్చినా, అనుగ్రహమొచ్చినా మనబోటివారం తట్టుకోలేం. అక్కడికి వెళ్లినప్పుడు ఒళ్ళు దగ్గరుంచుకుని మసలండి" అని కొడుక్కి, అల్లుడికి హెచ్చరించి చెప్పడమే కాకుండా ఆ తరువాత తను వెళ్లినప్పుడు "అబ్బాయిదీ, అల్లుడిదీ కూడా చిన్నతనం. వారి మాటయందుగానీ, నడతయందుగానీ పొరపాటు దొర్లలేదుకదా" అని కనుక్కుంటూ ఉండేవారు శివశర్మగారు.

"అబ్బెబ్బే ఎంతమాట! మీరు రాని లోటు కనబడనీయడంలేదు మీవాళ్ళు. ముఖ్యంగా మీ కుమారుడు మంత్రోచ్చారణలో ఆ స్పష్టతా, ఆ వినయసంపత్తీ... మీ పేరు నిలబెట్టే పుత్రుడు" అన్న కితాబు వారినుంచి పొంది నిశ్చింతులయ్యారు.

ఎవరికైనా కొడుకు కలిగినప్పటి ఉత్సాహంకంటే ఆ కొడుకు పెరిగి తన పేరుకి వన్నె తెచ్చినప్పటి సంబరం మిన్నయేకదా!

రాజుగారి కుటుంబం అంతా కొడుకుని పొగుడుతుండడం, ఊళ్ళో కూడా పార్వతీశాన్ని చిన్న అయ్యవారు అంటూ తనని మన్నించినట్టే మన్నించడం శివశర్మగారికి ఏనుగెక్కించినట్టుగా వుంది. కొడుకు ప్రయోజకుడు అయ్యాడు. అల్లుడు కూడా సంసార బాధ్యతలు చుసుకుంటున్నాడు. తానిక సంపూర్ణంగా ఈశ్వరుడి సేవలో నిమగ్నమవచ్చు అనే దిలాసాలో పడిపోయారాయన.

ఆ ఆదమరపులోనే పార్వతీశం, సుందరం చీటికి పాటికీ దివాణంలోకి వెళ్లి రావడాన్ని అంతగా పట్టించుకోలేదు. ఎప్పుడైనా యధాలాపంగా అడిగినా "ఏవో పాతకాలం నాటి పత్రాలూ గట్రా గుమస్తా మీద నమ్మకం లేక నాచేత చదివించు కుంటున్నారు. మళ్ళీ తిరగరాయించు కుంటున్నారు" అనో, లేకపోతే "రాణీగారు పార్వతీకళ్యాణం చెప్పించుకుంటున్నారు" అనో కారణాలు చెబుతున్నాడు పార్వతీశం.

సుందరమయితే దివాణంవాళ్ళు ఏవో పనులు చేసుకురమ్మంటున్నారని నెలకు రెండు తడవలు పట్నం వెళ్ళి వస్తున్నాడు.

అంచేతే దివాణం నుంచి వచ్చే నజరానాలు ఎక్కువయితే అవి తనవాళ్ళు వారి అభిమానాన్ని, విశ్వాసాన్ని చూరగొన్న సూచనగా భావించాడేతప్ప

అనుమానించలేదు.

ఆడవికి దూరంగా వున్నాను కదా అని ఏమరుపాటుగా పచ్చికమేస్తున్న లేడిపిల్ల మీదికి పెద్దపులి ఉరికినట్లుగా ఆ పాలుమాలికే కొంప తీస్తుందని కల్లోకూడా ఊహించలేదు శివశర్మగారు.

ఆరోజు కపాలేశ్వరునికి మహానైవేద్యం పెట్టి వచ్చి ఆ ప్రసాదం భోంచేసి పడమటింట్లో అప్పుడే నడుంవాల్చారు శివశర్మగారు.

మూగన్నుగా నిద్ర పట్టింది:

"నాన్నా... నాన్నా" అని గాయత్రి తట్టి లేపేసరికి కళ్ళు తెరిచారు.

"దివాణం మనుషులు వచ్చారు నాన్నా. తమ్ముణ్ణీ, ఆయన్నీ అడుగుతున్నారు" అంటోంది గాయత్రి గాబరాగా. ఆమె మొహంనిండా ముచ్చెమటలు.

"ఎందుకంత కంగారు? వారికోసం దివాణం నుంచి కబురురావడం, వీళ్ళు వెళ్ళడం జరుగుతున్నదేకదా. దానికింత భయపడవలసిన అగత్యమేమిటి? అయినా పొద్దుల వాళ్ళింటికేకదా పార్వతీశం వెళ్లింది" ఆయన విస్మయపడుతూ లేవబోతుండగా ఇంట్లోకి దూసుకువచ్చారు రాజాగారి బంట్రోతులు.

వాళ్ళను చూసాక అప్పుడార్థమయింది కూతురెందుకంత హడలిపోతోందో!

వాళ్ళు ఎప్పుడూ తనని చూడగానే "దండాలు దొరా! చిన్నసామిని పెద్దొరసాని వెంటెట్టుకు రమ్మన్నారు" అని అతి వినయంగా విన్నవించే జమిందారుగారి దాసుళ్ళలాలేరు.

మొహాన కాఠిన్యపు రేఖలతో, కళ్లల్లో ఎరుపు జీరలతో కరవటానికి వస్తున్న కాలభైరవుల్లా వున్నారు.

"ఏమయింది నాయనా!" అని అదుర్దాగా అడుగుతున్న శివశర్మగారిని పట్టించుకోలేదు వాళ్ళు.

"వాళ్లిద్దరూ ఇంటికింకారాలేదు" తడబడుతూ చెబుతున్న గాయత్రి మాటల్నీ వినిపించుకోలేదు.

"ఉండకెక్కడికి పోతారు? ఊళ్ళోనూ లేరు, తోటల్లోనూ లేరు. ఇంట్లోనే దాక్కుంటారు. వెతకండిరా" అని గర్జిస్తూ శర్మగారినీ, గాయత్రినీ నెట్టుకుంటూ ముందుకు ఉరికారు.

ఆ తరువాత అక్కడ జరిగిన భీబత్సం చెప్పనలవికానిది.

సావిట్లో పేర్చివున్న బస్తాలన్నిట్నీ తిరగబోశారు. నడిమింట్లో భోషాణంలోని వస్తువులన్నీ చిందరవందర చేసారు. అటకమీద సామాన్లన్నీ కిందకి విసిరేసారు. వంటిల్లనీ, పూజగది అనీ మినహాయింపు లేకుండా. ఇల్లు మొత్తం ప్రతి అంగుళాన్నీ అస్తవ్యస్తం చేసారు.

వాళ్ళు అంత నాశనం చేస్తున్నా అడ్డం పడాలన్న ఆలోచన కూడా తట్టని నిశ్చేష్టతలో ఉండిపోయారా కుటుంబ సభ్యులు.

ఈలోగా ఈ గొడవకు ఒక్కొరొక్కరుగా వూరిజనం వారి ఇంటిముందు గుమిగూడసాగారు.

ఆ మూగిన వారందరికీ శివశర్మగారంటే చెదరని భక్తి విశ్వాసాలున్నాయి. ఇప్పటి ఆయన అవస్థకు వారికెంతో సానుభూతీ, బాధా కలుగుతున్నాయి. కానీ వారిలో ఏ ఒక్కరికీ సింహపుబంట్లలాంటి జమిందారు గారి మనుష్యుల్ని ఆగమని వారించే ధైర్యంలేదు. కనీసం ఎందుకిలా చేస్తున్నారని అడిగే సాహసం కూడా లేదు.

గునగునగా ఏదో వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలూ చేస్తు నిలబడిపోయారంతే.

ఇందరి ముందు, ఇంతటి పరాభవాన్ని ఏనాడు ఎదుర్కోని ఆ కుటుంబం అదంతా ఎందుకు జరుగుతున్నదో తెలియకపోయినా సిగ్గుతో తల వంచుకున్నది.

ఆ అవమానానికి పరాకాష్ట ఇల్లంతా ధ్వంసం చేసింది కాక వెళ్తూ వెళ్తూ "మీవాళ్ళు చేసిన పనికి జవాబుదారీ నువ్వే. దొరిగారికి సమాధానం నువ్వె చెప్పుకుందువుగానీ పద పద" అంటూ శివశర్మగారిని కూడా బలవంతంగా లాక్కెళ్లారూ దొరగారి నౌకర్లు.

కొంతసేపు రాజాగారి దౌర్జన్యాన్ని విమర్శించారు, దుయ్యబట్టారు. గుండె గాయపడిన ఆ కుటుంబానికి కొన్ని ఓదార్పే మాటలు చెప్పారు. చెదిరిపోయారు.

ఆ తరువాత తీరుబాటుగా జరిగిన సంఘటనకు మూలమేమిటా అని గాలిచి కెలకసాగారు.

నిజమనేది ఒక్కటే వుంటుంది. అది బహిర్గతం కానప్పుడు ఊహించేదాని అబద్ధపు ప్రతికృతులెన్నో.

"దివాణంలో పూజ చేసేందుకు వెడుతున్నారుగా అక్కడివన్నీ బంగారపు విగ్రహాలే అవడం కన్ను కుట్టి వుంటుంది. సమయం చూసి ఎత్తుకు వచ్చుంటారు" ఒకరు తన అంచనా వివరించాడు.

"కాదు. రాణీగారి రవ్వలహారం జారిపోతే కామ్‌గా దాచేసి గుట్టు చప్పుడు కాకుండా స్వయంపాకంతో మూటకట్టుకు చక్కా వచ్చేశారట. మా బావమరిది వదినగారు దివాణంలో పని జేస్తుందిలే. ఆవిడ అందించింది ఉప్పు" వేరొకరు తనకు మాత్రమే నిజం తెలిసే ఆస్కారం వున్నదన్న భరోసాతో ధీమాగా చెప్పాడు.

"అదేం కాదులేవయ్యా. అప్పుడు పనులు

చేనుకురమ్మని అప్పుడప్పుడూ ఆ సుందరమయ్యను పట్నంకి పంపుస్తున్నారట. ఎక్కువ మొత్తం వసూలయిన సమయం చూసి బావమరుదులిద్దరూ అది పట్టుకు ఉడాయించారట. సాక్షాత్తూ ఆ దివాణం గుమాస్తాయే బయటపెట్టాడు" అని తను ఆరాతీసిన విషయాన్ని బయటపెట్టారు ఇంకొకరు.

"ఒరి పిచ్చివాళ్ళల్లారా! అసలు విషయం మీకు తెలియదు. ఆ సుందరమయ్య రాణీగారి మనవరాలి వరనున్న ఒక పడుచుని ముగ్గులోకి దింపాట్ట. ఆ పాపం ఈరోజు బద్దలయింది. కనిపిస్తే చంపి పాతేస్తారని పరారయిపోయారిద్దరూ. అదీ సంగతి. అది బయటకొస్తే పరువుపోతుందని ఈ దొంగతనం రంగుపులిమి వాళ్ళకోసం గాలిస్తున్నారట. ఎవరు చెప్పారని అడక్కుగానీ నిర్ధారణగా తెలిసింది నాకు. నమ్మితే నమ్ము లేకపోతే లేదు."

"నమ్మకపోవడానికేముందిలే. ఆ సుందరయ్య గుణం మనమెరగందా. దొంగతనమేమిటి, రంకుతనమేమిటి. రెండూ చేశాడన్నా ఆశ్చర్యంలేదు. కానీ తను దిగింది కాక ఆ చిన్నసామిని కూడా రొంపిలోకి లాగాడుకదా అని."

"ఆ... ఒకరు లాగేదేమిటి. ఇద్దరూ తోడుదొంగలే లెద్దూ!"

"హు... తులసీవనంలో గంజాయి మొక్కలు. ఇంతకీ ఆ మహానుభావుడి కొచ్చాయి తిప్పలు."

ఇలా ఎన్నెన్నో...

వీటన్నిటి సంగతీ అలా వుంచితే ఎక్కడ పుట్టిందో గానీ వీటిని తోసిరాజనగల ఒక వార్త గుప్పుమంటూ వ్యాపించి అందరి మతుల్నీ పోగొట్టింది.

కలువ. కొలనులో నిధి ఎక్కడ పాతిపెట్టబడిందీ తెలిపే రాగిరేకు వీళ్లిద్దరి కళ్లబడగా అది చేజిక్కించుకుని ఉడాయించారనీ, లేదా ఆ రహస్యం తెలిసిన వాళ్ళని రాజుగారి కుటుంబం బతకనివ్వదు కనుక పారిపోయి వుంటారని దాని సారాంశం.

ఈ పిడుగురాయిలాంటి కబురు బయటపడ్డాక ఊకపొల్లులాంటి మిగతా పుకార్ల ప్రాముఖ్యత పూర్తిగా తగ్గిపోయింది. దేన్నయినా 'నమ్మశక్యం కావడంలేదు సుమా' అన్నవాళ్ళున్నారుగానీ దీన్ని అంత తేలిగ్గా అబద్ధమని కొట్టి పడేసినవాళ్ళు లేరు.

రుజువులూ, సాక్ష్యాలూ లేకపోయినా చివరికి ఇదే నిజమని నిర్ధారించేశారు జనం.

ముందే సుందరమన్నా, పార్వతీశమన్నా వూరివారికి సదభిప్రాయంలేదు. ఈ మధ్యన కొద్దికొద్దిగా కూడుకుంటున్న సద్భావం కూడా ఈ సంఘటనతో ఉఫ్ న ఊదినట్లు గాలికెరిగిపోయి ఇష్టమొచ్చినట్టు తలా ఒక రకంగా నిరసించసాగారు. అయితే శివశర్మగారి మీద మాత్రం వారికెలాటి వ్యతిరేకతా లేదు. ఊరు ఊరంతా దివాణంవాళ్ళు అయన్నేం చేస్తారో అని భయపడింది. అయనకే హానీ జరగక్కూడదని కోరుకుంది. ఆయనకోసం ఎదురుచూసింది.

రెండురోజుల అనంతరం ఆ నిరీక్షణ ముగిసింది. శివశర్మగారు తిరిగి వచ్చారు. ఎలాగ? బ్రహ్మాండమైన ప్రభంజనమేదో ముంచెత్తిపోగా దస్సిపోయిన సామాన్య నౌకలా.

అలా వాలిపోతూ వాలిపోతూ దివాణం నుంచి బయటపడ్డక సరాసరి ఇంటికైనా వెళ్ళలేదు. తిన్నగా కపాలేశ్వరస్వామి ఆలయానికి నడిచెళ్లి గర్భగుడిలో ప్రవేశించబోతూ నర్పదర్శ నమయినట్టయిపోయారు.

మండిగం అవతల కొత్త అర్చకుడు చెయ్యడ్డుపెట్టి "క్షమించండి. మీకు లోపలికి అనుమతిలేదు" అంటున్నాడు.

అతని వెనకాల నేతి దీపాల వెలుగులో స్వామి "నా ఉత్తరువూ అదే" అన్నట్లు నిర్లక్ష్యంగా నవ్వుతున్నట్లు తోచి ఒక్కసారి కాలికింద భూమి కదిలినట్లు కాగా–

"ఈశ్వరా! నువ్వూ నన్ను బహిష్కరించావా స్వామి!" అంటూ కుప్పకూలిపోయారు శివశర్మగారు.

ఆలా పడిపోయిన మనిషి తిరిగి లేచి తిరగడం ఎవరూ చూడలేదు. తెలివిలేని స్థితిలో అలా మంచంమీద పడి వుండేవారు. ఎప్పుడైనా స్పృహలోకొచ్చినా తనవారి స్మరణ వుండేదికాదు. "తండ్రీ! నన్ను నీకు దూరం చేశావా నాయనా!" అని కపాలేశ్వరుణ్ణి తలచుకుని వలవలా విలపిస్తూ ఉండేవారు. మళ్లీ తెలివి తప్పిపోయేది.

"కొడుకూ, అల్లుడి ఎడబాటుకంటే, బజారుపాలయిన ఇంటి పరువు ప్రతిష్ఠలకంటే కూడా కపాలేశ్వరుడి సేవకి దూరమవడాన్ని ఆయన భరించలేక పోయారు. ఆయన ఆవేదన చూసిన ప్రతి ఒక్కరూ కంట తడి పెట్టకుండా ఉండలేక పోయేవారు. అలా కూడా నెలకి మించి బ్రతకలేదు శివశర్మగారు.

శివశర్మగారు పోయాక ఆరునెలల అనంతరం కాల్లోముల్లు గుచ్చుకుని ధనుర్వాతంతో కాత్యాయని కూడా భర్తను చేరుకున్నది.

ఇంటకి పెద్ద దిక్కయిన ఇద్దరూ ఒకేసారి గతించిపోయారు. వారి తరువాత బాధ్యత వహించాల్సిన ఇద్దరూ ప్రాణభయంతో పరారయిపోయారు. మిగిలినవాళ్ళు ఇల్లు తప్ప ప్రపంచమెరుగని అబలలూ, అభం శుభం ఎరుగని పసివాళ్లూను.

తుపాను తాకిడికి గూడు కూలిపోగా దిక్కుతోచక కొట్టుమిట్టాడే వక్షుల్లా అల్లాడిపోతున్న స్నేహితుని కుటుంబాన్ని కరణం సీతారామయ్యగారే ఆదుకున్నారు. ధైర్యం చెప్పారు. వారిని పట్నం చేర్చితే బావుంటుందన్న ఆలోచన కూడా ఆయనకొచ్చిందే.

ఎందుకంటే శివశర్మగారు, కాత్యాయని ఈ లోకంనుంచి నిష్క్రమించాక ఆ వూరివారిలో ఆ కుటుంబంపట్ల పూర్వపు మన్నన కొరవడడం ఆయన గమనించారు.

నిజమే! వారి దృష్టిలో వీరిప్పుడు మహోన్నతుడైన శివశర్మగారి కుటుంబస్థులు కారు. తప్పుడు పనిచేసి తప్పించుకుని తిరుగుతున్న నేరస్థుల భార్యాపిల్లలు మాత్రమే.

ఆ తేలిక భావం వారి వైఖరిలో, మాట విరుపులో, నొసలు చిట్లింపులో వ్యక్తమవుతూ ఉండేది. దానితో బయట వారికి మొహం చూపించడానికి బిడియపడుతూ ఇంట్లోనే ద్రిగ్గుల్లిపోతున్నారా తల్లీకూతుళ్లు.

వారినా సంకట స్థితినుంచి తప్పించాలంటే స్థలం మార్చడమొక్కటే మంచి మార్గంగా తోచిందాయనకి.

ఇంకో కారణమేమిటంటే రాజుల చూపు సోకితే రాళ్లు కూడా బద్దలవుతాయని సామెత. ఆ రాజుల అనుగ్రహం తప్పిన ఈ బడుగు మనుషులు వారికి కాస్త కనుమరుగుగానే వుండడం మేలనిపించి వారిని పట్నం చేర్చారాయన.

ఆయన చేసిన ఇంకో మంచి పని మగపిల్లలతో పాటు హేమని కూడా మళ్లీ స్కూల్లో చేర్చడం.

"ఆ పసిదానికి జరిగిన అన్యాయాన్ని ఎలాగూ పూడ్చలేం. చదువులో పడేస్తే ఆ చేదుగతాన్ని మరిపించినట్టన్నా వుంటుంది" అన్న ఆయన ప్రస్తావనని ఏ సంశయమూ పెట్టుకోకుండా అంగీకరించింది గాయత్రి.

"అందరితోపాటు భగవంతుడు కూడా మాకు మొహం చాటు చేసుకున్న ఈ దుస్సమయంలో నేనున్నానంటూ మమ్మల్ని అక్కున చేర్చుకున్నవాడివి. నీకంటే మాకు ఆప్తులెవరున్నారు బాబాయ్. నీకేది మంచిదని తోస్తే అదే చేయి'' అన్నది మారు ఆలోచించకుండా.

తన్నంత గాఢంగా నమ్మినవారి చేయి ఆయన ఇక విడువలేదు. తన పిల్లలతోపాటే వారికీ అన్ని సదుపాయాలూ చూసారు.

తమ పొలంతోపాటు వారి భూమినీ సాగుచేయించి డబ్బుకి ఇబ్బంది లేకుండా చూసేవారు. ఎప్పుడయినా చేతిది ఖర్చు పెట్టాల్సివచ్చినా వెనుకాడేవారు కాదు. అవసరమొచ్చినప్పుడు హితాభిలాషిగా సలహాలు చెప్పేవారు.

కాలచక్రం సంవత్సరాలనధిగమిస్తూ ముందుకు తిరిగింది. గాయత్రి పిల్లలందరూ పెద్దవాళ్ళయ్యారు. చదువుల్లోకూడా అంతా పైకివచ్చారు. పెద్దవాడు చంద్రం ఉద్యోగం కారణంగా పుట్టిన వూరికీ, రాష్ట్రానికి కూడా దూరంగా వెళ్లిపోతూ తల్లినీ, తోబుట్టువుల్నివెంట తీసుకువెళ్లాడు. ఆ కంపెనీ బ్రాంచీలు అటువైపునే ఉండడంతో దాదాపు అక్కడే సెటిలైపోయినట్టే!

ఇక సీతారామయ్యగారి పిల్లలిద్దరూ ఎక్కడెక్కడో వుంటున్నా అలవాటయిన వూరినీ, స్థిరాస్థుల్నీ వదులుకోలేక వృద్ధ దంపతులిద్దరూ స్వంత వూర్లోనే ఉండిపోయారు.

మనుషులు దూరంగా వుంటున్నా రాకపోకలు సాధ్యం కాకపోయినా ఈ రెండు కుటుంబాల మధ్య వున్న ఆత్మీయతా అనుబంధం మాత్రం చెక్కుచెదరలేదు.

అపట్నుంచీ ఇప్పటివరకూ వారి భూముల్నీ బీడుకానివ్వక పండించి అయివేజు పైసా బీరుపోనివ్వక పంపిస్తూ అడిగినప్పుడు తోచిన సలహాలిస్తూ మరణించిన తన స్నేహితుడి కుటుంబానికి చేయదగ్గ సాయం చేస్తూనే వున్నారు సీతారామయ్యగారు.

గాయత్రి కూడా ఇప్పటికీ తండ్రికి ఇచ్చినంత గౌరవం సీతారామయ్య గారికిస్తుంది. అంతదూరంలో వుంటున్నా తమ విషయాలన్నీ క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు పూస గుచ్చినట్టు ఆయనకు రాస్తూవుంటుంది. ఆయనిచ్చిన సలహాల్ని పాటిస్తూవుంటుంది.

ఇలా ఉండగా హఠాత్తుగా ఆయన దగ్గర్నుంచి టెలిగ్రాం 'పార్వతీశం ఇంటికి వచ్చాడు. వెంటనె బయలుదేరిరా' అని.

ఆ కారణంగానే ఇన్నేళ్ళ తరువాత ఈ ఊరికి తమ ఈ ఆకస్మిక రాక!

* * *

"అక్కా!"

పన్నెండేళ్ళ తరువాత అప్యాయతతో కూడిన ఆ పిలుపు ఎండి ఎండి బీటలు వారిన ధరణిపై నీటిబొట్టయి పులకింపజేస్తూ గాయత్రిని ప్రాకృతంలోకి తీసుకువచ్చింది.

మెట్లకింద ఎదురుగా ముప్పయి ఏళ్లు దాటిన యువకుడు చిరునవ్వుతో నిలబడి వున్నాడు.

చెవికి తల్లి పురుడు వెళ్లగానే కుట్టించిన రాగి బిచ్చవుకాడ, చెంప పొడవునా చిన్నప్పుడు ఎద్దు కొమ్ము విసిరితే చీరుకుపోయిన గాయపు మచ్చ, గడ్డం కిందుగా సెనగబద్దంత నల్లని పుట్టుమచ్చ...

అతడు తన తమ్ముడు పార్వతీశం.

ఉప్పొంగిన హృదయంతో "ఈశా" అన్నది గాయత్రి ఆర్ద్రంగా.

వచ్చి పాదాలు తాకి దగ్గరగా కూర్చున్నాడు పార్వతీశం.

"పాదధూళి" నవ్వుతున్నారు సీతారామయ్యగారు.

"కలకత్తాలో ఉండగా అలవాటయింది" సిగ్గుపడ్డాడు పార్వతీశం."

"అదినరే. నేను కబురంపించి చాలాసేపయింది కదా. ఏం చేస్తున్నావు ఇంతసేపు? ఇంటి దగ్గర లేవా? ఎక్కడికెళ్లావ్? మాజీ కరణంగారు విచారణ ఆరంభించారు. ఏదో జవాబిస్తున్నాడు పార్వతీశం.


ఇవేవీ వినిపించడంలేదు గాయత్రికి. తడిబారిన కళ్ళు చూపును మసకబారుస్తుంటే పన్నెండేళ్ళ నాటి తమ్ముడి రూపంతో అతన్ని పోల్చుకోసాగింది.

వచ్చగా దబ్బపండు ఛాయతో ఉండేవాడల్లా కాని రంగుకు తేలాడు. తల్లి పోలికన సన్నగా రివటలా ఉంటాడనుకునే వారు. ఇప్పుడు తండ్రిలా ఆజాను బాహుడయ్యాడు. పెన్సిల్ గీతలా వచ్చీరానట్టు ఉండే మీసకట్టు దట్టమయింది. విశాలమైన నుదుటున విభూతిరేఖలకు బదులు కుంకుమ బొట్టు పెట్టాడు. కంఠస్వరం కూడా గంభీరమయింది.

'ఒకనాడు వెన్న మీగడ తింటూ నీడపట్టున పెరిగి నిగనిగలాడుతూ సుకుమారంగా ఉండేవాడు. ఇప్పుడు రోజులు నెలలు కాదు, పన్నెండేళ్ల దీర్ఘకాలం ఏమి తిన్నాడో, ఎన్ని పాట్లు పడ్డాడో మొరటుబారడా' భారీగా రాటుతేలినవాడిలా అవుపిస్తున్న పార్వతీశాన్ని చూస్తూ భారంగా అనుకున్నది గాయత్రీ.

"వింటున్నావా గాయత్రీ! ఇన్నేళ్ళూలేని కంగారు ఈ వేళ ముంచుకొచ్చేసింది మీ తమ్ముడికి. ఇప్పటికిప్పుడు మిమ్మల్ని ఇంటికి తీసుకుపోతాట్ట పెద్దమనిషి. వాళ్ళు రారు. నువ్వూ వెళ్లద్దు అంటున్నాను. ఏమంటావ్" అంటున్నారు సీతారామయ్యగారు.

"వుండము అని ఆనడానికి ఇదేం పరాయి ఇల్లా బాబాయ్! ఒకవేళ వెళితే మాత్రం ఆ ఇల్లు ఈ ఇంటికేమంత దూరమనీ, నాలుగిళ్ళవతలేకదా! ఇక్కడున్నట్టే వుంటాం. వస్తూంటాం" నిండుగా నవ్వుతూ



అంది గాయత్రి.

"గడుసుదానివే. వెడతాననకుండా వెళ్ళే దూరం అంచనా వేస్తున్నావు. సరే. అలాగే వెడుదువుగానీ. కానీ మీ పిన్ని వంట చేసింది. ఈ పూట అందరూ ఇక్కడే భోజనం చేసి వెళ్లండి" అని వాళ్ళు వెళ్లడానికి అనుమతించారు సీతారామయ్యగారు.

ఎంతోకాలానికి కలుసుకున్నారు ఆ తోబుట్టువులు. ఎన్నో చెప్పు కోవాలనుంటుంది. వారి మధ్యన ఎంత స్నేహితమున్నా ఉండనీ వేరొకరు ఉండకపోవడమే నయమంజనమని అనిపించిందిదాయనకి.

ఆ సాయంత్రమే వాళ్ళు తమ ఇంటికి వెళ్లిపోయారు.

● ● ●

ప్రత్యూష పవనాల మృదు మధుర స్పర్శలతోపాటు చిరుమువ్వల గలగలలూ, చిన్నారి నవ్వుల కిలకిలలతో మెలకువ వచ్చింది హేమకి.

ఇక్కడికి వచ్చిన దగ్గర్నుంచి ఈ మేలుకొపులతో లేవడం అలవాటయింది ఆమెకు.

చేతులమీద సగంబడిలేచి మంచంపక్క కీటికీలోంచి వెలపలకు చూసింది హేమ. మెడలో కట్టిన మువ్వలు గలగల్లాడించు కుంటూ చెంగనాలు తీసే తువ్వాయి వెంట పకపకలాడుతూ పరుగులు తీస్తున్నారు ముద్దులొలికే పిల్లలిద్దరు.

సరిహద్దు కంచె మీంచీ పక్కింటి పెరట్లో కనిపించే ఈ మనోహర దృశ్యం ఎప్పటిలాగే ఆమెనెంతో అలరించింది.

కాళ్లమీదున్న దుప్పటిని పక్కకి తొలగించి పూర్తిగా లేచి కూర్చుంది హేమ."

అదేమిటో సిటీలో వున్నప్పుడు సూర్యకిరణాలు సూటిగావచ్చి మొహాన గిచ్చితే తప్ప మెలకువ వచ్చేదికాదు. ఈలోపల ఎవరైనా లేపాలని చూస్తే కరవాలన్నంత కోపమొచ్చేది కూడా.

ఇక్కడ చిత్రంగా వేకువ తొలి వెలుగులు భూతలాన్ని తాకీ తాకకమునుపే నిద్ర తేలిపోతోంది. గమ్మత్తేమిటంటే అంత తొందరగా లేవడం విసుగనిపించడం లేదు సరికదా మంచంమీద అలాగే పడుకుని ఎదురింట్లో కాళిదాసు వర్ణించినట్టు పువ్వులనే ఆభరణాలుగా అలంకరించుకు నిలబడ్డ శకుంతలలా, పూలతో నిండిన పున్నాగ చెట్టునీ, ఇంకో పక్కగా ఏ అజ్ఞాత ప్రియుని పొందుకోసమో సుమపానుపు పరుస్తున్న వాసవసజ్జికలా పూలు రాలుస్తున్న పారిజాత వృక్షాన్నీ, పక్కింటి ఆచార్యులవారి కోడలు క్షేత్రయ్య పదం సన్నగా ఆలపిస్తూ వాకిట్లో దిద్దుతున్న రంగవల్లికని చూస్తూ-

ఆవిడ అత్తగారు గోవింద నామాలు పాడుతూ మజ్జిగ చిలికే కవ్వం చప్పుడూ, బాదం చెట్టు గుబుర్లలో నుంచీ రూపం కనబడనీయకుండా గానం వినిపిస్తున్న కోకిలమ్మ కూతనీ, అదొకరకం వాద్య సంగీతంలా ఒక లయలో వినిపించే నీళ్ళు మోసుకుపోయేవారి కావిళ్ళ శబ్దమూ వింటూ... ఓహ్... ఎంత అద్భుతమైన అనుభూతి అది. ఇంకా నిద్రపోయుంటే ఇవన్నీ మిస్సయి ఉండేదాన్నికదా అనిపిస్తుంది.

చిన్నగా నవ్వుకున్నది హేమ.

"అమ్మలూ లేచా వా?" వంటింట్లోంచి గాయత్రి కేకేసింది.

వలక్కుండా గమ్మునుండిపోయి ఇంకాస్సేపు మంచంమీద దొర్లుదామను కున్నది గానీ వంటిల్లు దాటి గదిని చుట్టేస్తున్న కాఫీ పరిమళం నోరూరిస్తూ లేలెమ్మని తొందర చేయడంతో బద్ధకానికి స్వస్తిచెప్పి "ఇదిగో వస్తున్నా" అంటూ లేచిపోయింది హేమ.

నూతిగట్టుమీద ముఖ ప్రక్షాళనం అయిందనిపించి తల్లిచ్చిన కాఫీ కప్పు అందుకుని మొన్న పాతిన బంతిపూలమొక్కలు ఎలా ఉన్నాయో పర్యవేక్షిద్దామని వాకిలివైపుగా వెళ్లబోయి రక్కున ఆగింది.

వీధిగేటు తెరుచుకుని పార్వతీశం వస్తున్నాడు.

అడుగుల దిశ మార్చి పెరట్లో పాదుల దగ్గరకు వెళ్లిపోయింది హేమ.

గలగల కబుర్లు చెబుతున్న కూతురు ఉన్నట్టుండి మౌనముద్ర పట్టి వెనక్కి తిరిగేసరికి ఏమయిందా అని తలెత్తిచూసింది గాయత్రి.

ఎదురుగా పరమ భాగవతోత్తమునిలా తమ్ముడు, పెద్ద కుంకుమ బొట్టు, చేతిలో వున్న అరివేణంలో కుంకుమా, మందార పువ్వులు, కళ్ళు అరవోడ్చి శబ్దం వినరాకుండా పెదవులు మాత్రం కదుపుతూ ఏదో జపిస్తూ వచ్చి సరాసరి పూజగదిలోకి వెళ్లిపోయాడు.

'ప్చ్... రోజురోజుకూ వీడి వైఖరి అయోమయమైపోతోంది ఏం చేయడం' ఆందోళనగా నిట్టూర్చింది గాయత్రి.

● ● ●

వచ్చిన కొత్తలోనే గ్రహించింది ఆమె. పూర్వంలో చురుగ్గా దుడుగ్గా ఒక్కొక్కప్పుడు అల్లరిగా, తుళ్లిగింతలు పెట్టే సెలయేరులా వుండే తమ్ముడు ఇప్పుడు లోతుల్ని లోన దాచుకున్న సాగరుడిలా గంభీరుడయ్యాడు.

పెద్దతరహా వచ్చిందని మురిసి పోయింది.

కానీ ఆత్మీయులైన తమ దగ్గర కూడా మాటల పొదుపు, ముక్తసరితనం పాటిస్తుంటే మాత్రం బాధనిపించింది.

'పదమూడేళ్ళ తరువాత కలుసుకున్న తోడబుట్టిన దాన్ని నేను. తాళి కట్టిన భార్య అది. మా దగ్గర కూడా మనసు విప్పడేం' అని మదనపడింది.

మొదట ఒకసారి మాత్రం లాంఛనంగా తమ అదృశ్యం తరువాత ఏమయిందని ప్రశ్నించాడు.

అడిగిందే చాలన్నట్లు గాయత్రి అంత బ్రతుకు బ్రతికిన తమ తల్లిదండ్రులెలాంటి హృదయ విదారక పరిస్థితుల్లో కళ్ళు మూసారో, తాము ఇన్నేళ్ళు ఎన్ని ఇక్కట్ల పాలయ్యారో ఎంతో దుఃఖావేశంతో వివరించింది.

ఎంతో కదలిపోతాడనుకున్న పార్వతీశం ఎవరి కథో వింటున్నట్లు నిర్లప్తంగా విన్నాడు. నామకహా విచారం ప్రకటించాడు. సానుభూతి చూపించాడు.

ఎంత తరచి తరచి అడిగినా, మళ్లీ మళ్లీ రెట్టించి అడిగినా కరణంగారికి చెప్పిందానికంటే సమాచారమేమీ రాబట్టిందిలేదు.

కాకపోతే అక్కగారి ఆత్రానికీ, ఆక్రోశానికీ తొణికి కొత్తగా బయటపెట్టిన విషయమొకటే... బావగారు ఎవరో సాధువుతో కలసి హిమాలయాలవైపు వెళ్లిపోయాడని.

ఆ సాధువుకు సువర్ణం చేసే విద్య తెలుసని అనుమానం. అతని దగ్గర ముద్దలు ముద్దలుగా బంగారు ఉండేదిట.

ఎన్ని ఏళ్ళయినా పట్టనీ ఆ రహస్యం చేజిక్కించుకునిగానీ వెనక్కి మళ్ళేదిలేదని ప్రతిజ్ఞ చేసి హిమవన్నగంకేసి సాగిపోతున్న ఆ సాధువుకి శుశ్రూష చేసుకుంటూ వెంటబడి వెళ్లాట్ట సుందరరామయ్య.

"నీ మార్గం అటుకాదు ఇటు" అని దేవి నిర్దేశించడంతో తన మాత్రం ఇలా వచ్చేశాడట.

"నువ్వు బాధపడకు అక్కయ్యా! బావ తొందరలోనే ఇటు వచ్చేస్తాడని నా విశ్వాసం. ఇంతకాలంగా ఒకరికొకరం జతగా వున్నాం కాబట్టే ఆ పరాయి ప్రాంతాల్లో మసగలిగాం. ఇప్పుడు బావ వంటరివాడు. నాకు బావ మనస్సు తెలుసు. నేను తోడు లేకుండా ఎక్కువ రోజులు అక్కడ ఉండలేడు. సాధుబాబా అనుగ్రహించేదాకా ఓపిక పట్టడం ఆయనకు అసాధ్యమే. తొందరగానే వచ్చేస్తాడు" పార్వతీశం అక్కగారితో నాలుగు మాటలు మాట్లాడి స్వాంతర పరిచిందావొక్క సారే.

"అవును. ఎండమావులవెంట పరుగులు తీసే వాళ్ళు ఎప్పటికైనా అది నయవంచన అని తెలుసుకోకపోరు. వెనక్కి మరలకపోరు" అని భర్త విషయంలో సమాధానపడగలిగింది గాయత్రి.

కానీ తమ్ముడయినా తిరిగివచ్చాడని తృప్తిపడ్డానికి లేకుండా అతని తీరు ఆమెని కలవరపెడుతోంది.

వచ్చి నెల దాటింది. తమ్ముడి వాలకం అంతుచిక్కడంలేదు. రోజూ ఎప్పుడు లేస్తాడో, ఎప్పుడు స్నానం సంధ్యా ముగిస్తాడో తెలియదు. వాళ్ళు లేచేసరికి దేవుడి ముందర ధ్యానంలో వుంటున్నాడు.

ఆ జపమేమిటో గంటల తరబడి అలా సాగుతూనే వుంటుంది. సాగి సాగి ఎప్పటికో ఆమె సహనం అడుగంటేవేళకు కళ్ళు విప్పుతాడు. ఇన్ని టీ నీళ్ళు తాగుతాడు.

ఆ తరువాతయినా మాటా పలుకు వుండదు. వెళ్లి వీధి అరుగుమీద పద్మాసనం వేసుకుని కూర్చుంటాడు. పెదవులు నిరంతరం కదులుతూ వుంటాయి. అప్పుడప్పుడూ కళ్ళు విశాలమవుతాయి. తరచూ తప్పిపోయిన తల్లిని వెతుక్కుంటున్న పసిపిల్లాడిలా జననీ' అనో, 'అంబా" అనో పెద్దగా తలుస్తుంటాడు.

గాయత్రికి మతిపోతోంది.

'తను పురోహితుల వంశంలో పుట్టింది, పెరిగింది. భగవంతునియందు భక్తివిశ్వాసాలూ నిష్ఠానుష్ఠానాలు తనకు అపరిచితలుకావు. స్వయంగా తండ్రి ఆ ఈశ్వరుని వియోగం భరించలేక ప్రాణాలొదిన వ్యక్తి. అంతటి భక్తిపరుడు కూడా ఎప్పుడూ ఐహిక విషయాన్ని కాదనలేదే. ఇదెక్కడి విపరీతం?' అని లో లోపల తల్లడిల్లుతోంది.

ఈమధ్య ఈ ధోరణి మరీ ప్రకోపించడం తెలుస్తోంది ఆమెకు.

"ఏం చేయడం" మరోసారి దిగులుగా అనుకుంది గాయత్రి.

పార్వతీశం పూజకి కామా పెట్టిన గుర్తుగా దేవుడి గదిలోంచి గంట మ్రోగింది.

టీ టైమ్!

ఒడిలోకి కోసుకొచ్చిన బచ్చలాకు స్టౌ గట్టుమీద కుప్పగా పోస్తూ అల్లరిగా నవ్వింది హేమ.

'ఎంతటి హృదయక్లేశాన్నయినా చిరునవ్వుల వెనుక చిలిపితనం వెనుక దాచిపెట్టగలదు తన బిడ్డ!'

హేమ వంక ప్రియంగా చూసింది.

పార్వతీశం పూజ గదిలోంచి ఇవతలికి వచ్చాడు. గాయత్రి అతనికి టీ అందించింది.

టీ గొంతులో దిగిందోలేదో మళ్లీ చెప్పుల్లో కాళ్ళు పెట్టాడు పార్వతీశం.

"ఈశా!"

గడప దాటబోతున్న పార్వతీశం అక్కగారి పిలుపుతో ఆగి తలెత్తాడు.

"ఆలయానికేనా?"

"అవును"

"అమ్మవారి గర్భగుడిలోకి వెళ్లి కూర్చుంటానని పేచీ పెడుతున్నావట? గర్భగుడి ప్రవేశానికి కేవలం అర్చకులు మాత్రమే అర్హులు. ఇది ఇక్కడి సాంప్రదాయమని నీకు తెలీదా? నలుగురూ పాటించే కట్టుబాటుని అతిక్రమించడం తప్పుకదూ?" మందలింపుగా అన్నది గాయత్రి.

వెనుకనుంచి వీపు చరిచిన వాడిలా తుళ్లిపడ్డాడు పార్వతీశం. కాసేపు ఆవేశాన్ని అణచుకున్నవాడిలా మాట్లాడకుండా నిలబడ్డాడు.

ఆ తరువాత "నువ్వూ అదే మాటంటున్నావా?" అన్నాడు నెమ్మదిగా. "కన్నతల్లి ఆలింగనం కోరుకునే బిడ్డకు అర్హత, అనుమతీ ఉండలా అక్కా! తల్లి సాన్నిహిత్యం కొరకు తహతహలాడుతూ పరుగుపెటుతున్న బిడ్డకూ ఆ తల్లికీ నడుమన ఇన్ని ప్రాకారాలూ, ఇన్ని ద్వారాలూ ఇన్ని ఆచారాలూ అడ్డుంచడం... అందులోనూ కొన్నిటిని అధిగమించరాదనడం న్యాయమా? తన సంతానానికి ఎడంగా వుంచే ఆ ఆంక్షల్ని ఆ జనని మాత్రం హర్షిస్తుందంటావా? చెప్పక్కా చెప్పు."

ఎంతో ఉద్వేగంతో మరెంతో ఆవేదనతో అంటున్న తమ్ముణ్ణి ఆశ్చర్యంగా చూస్తూ "ఈశా" అంటూ మరేదో చెప్పబోతున్న గాయత్రిని అడ్డుకుంటూ" ఊహూ... నువ్వెన్ని చెప్పు నా తల్లికి పరాయివాడిలా గుమ్మం ఇవతలే ఉండడం నావల్లకాదు! చూస్తాను. ఎంతకాలం నన్నాపగలరో? ప్రాయోపవేశం చేసయినా నా తల్లివడి చేరే తీరుతాను" పంతం సాగించే కుర్రాడిలా తలాడిస్తూ పట్టుదలగా చెప్పి అంతలోనే మరో లోకంలోకి జారిపోయినట్టు "జననీ" అని తలుస్తూ స్వప్నావశిష్టునిలా అడుగులు తేల్చివేస్తూ నడిచి వెళ్లిపోయాడు పార్వతీశం. గుమ్మానికివతల తల్లీ, లోపల కూతురూ కళ్లప్పగించి అలాగే నిలబడిపోయారు.

హేమకి మేనమామ ఆలా తన్మయంత్వంలో మాతా, జననీ' అని తలచినప్పుడల్లా ఎంతో చిత్రంగా అనిపిస్తుంది.

ఇప్పుడు విగ్రహాలను తాకవద్దన్నందుకే ఇంతగా ఆక్రోశిస్తున్న ఇతడు ఒకప్పుడు ఆ దేవుళ్లకే అర్చన చేయాల్సొచ్చిన రోజుల్లో ఎంత ఆలక్ష్యంగా, అనాచారంగా, శ్రద్ధారహితంగా పూర్తి చేసేవాడో ఆమెకు బాగా తెలుసు.

గర్భగుడి శుభ్రం చేయకుండానే దైవపీఠం దగ్గర దీపారాధన చేయడాన్ని ఎన్నిమార్లో ఎరిగున్నదామె.

అందరూ ఎంతో పవిత్రమైనవిగా ఎంచే దేవుని నిర్మాల్యాన్ని ఎవరన్నా చూస్తుంటే ఏ చెట్టు మొదట్లోనో వేసేవాడు. ఎవరూ చూడకపోతే చెత్తగోతిలోకి విసిరేవాడు.

తాతగారు గమనించేటప్పుడు ఎంతో శ్రద్ధగా, అక్షరం పొల్లుపోకుండా చిన్న అంశం బీరుపోనివ్వకుండా జరిపించే అభిషేకాన్ని ఆయన పరోక్షంలో కొన్ని నామాల్ని మింగేసి కొన్ని మంత్రాల్ని దాటవేసి అయిదు నిముషాల్లో అష్టోత్తరాన్నీ పావుగంటలో సహస్రాన్నీ అయిందనిపించేవాడు.

వీటన్నిటకీ హేమ మూగసాక్షి.

"ఈ మేనమామ నీ మొగుడు. భర్త అంటే దిగివచ్చిన దేవుడితో సమానం. అతనితో వాదించకూడదు. జగడానికి దిగకూడదు. చాడీలు చెప్పకూడదు" ఆటలాడుకునే ఆ ప్రాయంలో కట్టించుకున్న తాళికి అర్థం తెలీక ఎప్పట్లాగే మేనమామతో ఆట్లాడుతూ గొడవ పెట్టుకుంటున్న హేమకి తల్లీ, అమ్మమ్మ ఈ సూక్తుల్ని బోధించి బోధించి తలకెక్కించారు. అందువల్ల భర్తచేసే ఈ అవకతవకల్ని చూసినా చూడనట్టే ఉండిపోయింది. ఒకే ఒక్క తడవనోరువిప్పి "అపచారంకదూ! అమ్మవారికి కోపం రాదూ!" అన్నది భయం భయంగా.

ఆ అమాయకత్వానికి మొగుడుగా మారిన మేనమామ నవ్వాడు. అక్కడే వున్న ఆమె తండ్రీ నవ్వాడు.

"అమ్మవారంటే ఆ రాతి బొమ్మేగా, మనవేం చేస్తున్నావెూ ఆ బొమ్మ చూడొచ్చిందా? అయినా ప్రాణాయస్వాహా... అని చెయ్యి చూపించి అది మనం తినేదేగా!" అన్నాడు పార్వతీశం నిర్లక్ష్యంగా బాగా మాట్లాడానుకదూ అన్నట్లుగా బావగారివంక గొప్పకోసం చూస్తూ.

"ఆ మునలాయనకి అచ్చమైన మనవరాలుగదూ. ఆ చాదస్తం దీనిక్కూడా బాగా అబ్బిందిలే" అని ఎగతాళిగా నవ్వాడు తండ్రి తను తీర్చిదిద్దిన బొమ్మలాంటి అల్లుడికేసి మురిపెంగా చూస్తూ.

అది దేవీ నవరాత్రుల పర్వదినాలు. ఆలయంలో విశేష పూజలు జరుగుతున్నాయి. దైవ నివేదన కొరకు వండిన వంటకాలన్నీ గుళ్ళోకి తీసుకువెళుతూ మధ్యలో ఎవరూ చూట్టంలేదుకదా అని అటూ ఇటు చూసి ఆకులోకి ఇంతతీసి బావగారికి అందించేయడం బాదంకాయలు ఏరుకుంటున్న హేమ చూసింది. ఉగ్గబట్టుకోడం అసాధ్యమయి ఆమె అడిగినదానికి వారి దగ్గరనుంచి వచ్చిన సమాధానమది.

''అమ్మా! ఇతను మన మామయ్యేనంటావా?'' అయోమయం లోంచి అన్నది హేమ.

"పిచ్చివాగుడు వాగకు" కూతుర్ని ఒక కసురు కసిరింది గాయత్రి మనసులో ఓ చిన్న సంశయ కెరటం ఉధృతంగా ఎగిసిపడుతూ నాలుగురోజుల క్రితవేం జరిగిన ఓ సంఘటనని అనుకోకుండా నెమరువేసింది.

ఆ రోజు ఏ పనీ తోచక పాత భోషాణం పెట్లో సామానంతా బయటకుతీస్తోంది. ఎప్పుడో తాము వట్నానికి బన మార్చేముందర అక్కర్లేదనుకున్న సామాన్లు కొన్ని ఆ పెట్టెలో పెట్టి ఇంట్లోనే ఉంచేసి వెళ్ళారు.

తండ్రి పావుకోళ్ళు, తల్లి ఇత్తడి బొట్టుపెట్టి. అందులో చెక్క దువ్వెన, అద్దం, రాగి కాటుక్కాయ, వెండి కుంకుమభరిణ, తను ఆడుకున్న వామన గంటల పీట, కిరోసిన్ లాంతరు... ఇలాంటివే. ఏదో జ్ఞాపకాలను తట్టిలేపుతున్న వస్తువులు.

ఆఖర్న అట్టడుగున తల్లి మడి పట్టుచీరలో చుట్టబెట్టిన పటాలని పైకి తీసింది.

ఒకటి రెండుతప్ప అన్నీ దేవుళ్ళ పటాలే. అన్నిటికి రంగులు మారి అడుగు అట్టలు చిమ్మెటలు తినేసి, చట్రాలు వూడిపోయి శిథిలావస్థలో... గట్టిగా తుడిస్తే చేతిలోకి ఊడివచ్చేలా వున్నాయి.

ఒక్కొక్కటీ జాగ్రత్తగా గుడ్డతో దులుపుతుండగా బయటనుంచి వచ్చాడు పార్వతీశం.

"ఏమిటక్కా చుస్తున్నావు?" అనడిగాడు దగ్గరకు వచ్చి.

వచ్చిన లగాయితు ధ్యానంపట్ల తప్ప దేన్లోనూ ఆసక్తి కనబరచడం ఎరుగని తమ్ముడు అలా దగ్గరకు రావడంతో ఉబ్బితబ్బిబ్బయింది.

"అబ్బే ఏంలేదురా ఏవో పాత సామాన్లు" అంటూనే చేతిలో వున్న ఫోటోని ఎత్తి చూపిస్తూ" ఇది ఎవరి ఫోటో చెప్పుకో చూద్దాం" అన్నది.

నిజానికి తనంతతానుగా మాట్లాడించిన తమ్ముడిని ఇంకాస్సేపు నిలువరించి మాటలు పొడిగించాలనే తవన తప్ప అతన్ని పరీక్షించాలనే ఉద్దేశ్యమేలేదు ఆ క్షణంలో.

కానీ "ఇంకెవరిదీ! అమ్మానాన్నలదే కదా" అన్న జవాబు అతన్నించి విని బిత్తరపోయింది. వాళ్ళకసలు ఫోటోనేలేదు.

ఆ ఫోటోలో వున్నది తన మేనత్త రాజేశ్వరమ్మగారు, ఆమె భర్త అయిన తన మామగారూనూ.

'తమ్ముడు ఆ మాత్రం పోల్చుకోలేకపోయాడా?' తను తేరుకుని "అదేమిట్రా" అనేలోగానే పార్వతీశం లోపలకు వెళ్ళిపోయాడు.

అప్పట్నుంచీ మధనం. తమ్ముడు పోల్చుకోలేకపోతే అదోరకం. అమ్మానాన్నా అని చెప్పడమేమిటి?

ఎన్ని సంవత్సరాల ఎడబాటు అనంతరమయితే మటుకు తల్లిదండ్రుల రూపాలకీ ఇతరుల ఆకారాలకీ వ్యత్యాసం గుర్తించలేని ప్రబుద్ధులుంటారా?

ఆమెకు తన తమ్ముడిమీద అనుమానం వచ్చింది. ఇరవై ఏళ్ళు అమ్మాఆన్నల ప్రాపకంలో పెరిగి ఇల్లు వదిలిన తన తమ్ముడేనా ఇతను?

ఫోటో మరీ పాతదయి ఆకారాలు చాలా అస్పష్టంగా వున్నమాట నిజం. అనలే పరధ్యానస్థుడు పొరపాటు పడేందుకు ఆస్కారముండదా? అని సర్దుబాటు చేసుకుంది.

కానీ మళ్లీ అదే అనుమానం కూతురు నోటంట విన వచ్చేనరికి తిరిగి డోలాయమానస్థితిలో వడిపోయింది మనస్సు.

ఆ సాయంత్రవేం గాయత్రి సీతారామయ్యగార్ని కలవడానికి వెళ్లింది.

88 888 88

గాయత్రి వెళ్ళేసరికి సీతారామయ్యగారు ఇంట్లో లేరు.

"మీ బాబాయ్ నీకోసం కలవరిస్తున్నారే అమ్మాయ్ రారా..." అంటూ నోరారా ఆహ్వానించారు మహాలక్ష్మమ్మగారు. ఆడపిల్లలులేని లోటు గాయత్రిని చూస్తే తీరినట్లుగా ఉండేదావిడకు అప్పట్లో.

"ఆటు పొలంకేసి వెళ్లారు. వచ్చేస్తార్లే కూర్చో" చాపపరచి ఇన్ని సన్నజాజులు ముందుపోసి దారంకోసం లోపలకు వెళ్లింది మహాలక్ష్మమ్మగారు.

గాయత్రి చాపమీద చతికిలబడింది. కాసిన్ని సన్న జాజులు దోసిట్లోకి తీసుకుని గాఢంగా ఆఘ్రాణించింది.

బాల్యంలోనే వివాహం, అంతలోనే మాతృత్వం, యవ్వనం చొరబడిన సవ్వడి వినినీకుండా ముసిరిన చేదు అనుభవాలు, విధి కర్కశపు హస్తాలు వేసిన వేట్లు గతకాలపు విషాదానికి గుర్తుగా మోడులా, రాయిలా మిగిలిన తను, వెనక్కి తిరిగి చుసుకుంటే మిగిలినదేమిటే? సన్నజాజుల సువాసనలు ఆస్వాదించగలిగే సున్నితత్వం మిగిల్చిందా జీవితం తనకు?

వెలితిగా నవ్వుకున్నది గాయత్రి.

చిన్న పిట్ట ఒకటి గూటికి తిరిగిరాని చెలికానికొరకు కీచుకీచున అరుస్తు గిరికీలు కొడుతోంది. అరటిబోదెల చుట్టూరా నిలిచిన

నీళ్లలో కాంతి తగ్గుతున్న ఆకాశం మొహం చూసుకుంటోంది. బాదం చెట్టుకింద నీడలు దట్టమవుతున్నాయి.

"మీ ఇంటికేసి వెళ్ళే వస్తున్నాను గాయత్రీ. నువ్విక్కడికి వచ్చావని చెప్పింది హేమ" అంటూ వచ్చారు సీతారామయ్యగారు.

ఆయన వెనుకే వచ్చిన మహాలక్ష్మమ్మగారు గాయత్రి ముందర దారపు రీలు పడేసి భర్తకు చెంబుతో నీళ్లిచ్చింది.

మళ్లీ లోపలకు వెళ్లి పడక్కుర్చీ మోసుక వచ్చి నూతుగట్టు వరండా వద్ద వాల్చింది.

కాళ్ళు కడుక్కుని వచ్చి కూర్చున్నారు సీతారామయ్యగారు.

"ఇదిగో వింటున్నావా? ఇందాక హేమని దాహమిమ్మంటే అదేదో తాగడానికిచ్చింది. రానిపేరు... ఏమిటబ్బా అది... ఆ లస్సీ అట. ఎంత రుచిగా వుందో తెలుసా? నువ్వూ ఉన్నావు? ఆ పుల్ల మజ్జిగలో ఇంత ఉప్పేసి ఇస్తావు తప్ప పెరుగుతో అంత రుచిగల పానీయం చేయవచ్చని తెలుసా నీకు? మళ్లీ మాటకోసారి నలభయ్యేళ్ళు కాపురం చేసానని గొప్పలు చెబుతావు?" గాయత్రికి పూలు అందిస్తు కుర్చున్న భార్యకేసి ఎకసెక్కెంగాచూస్తూ కవ్వింతగా అన్నారు సీతారామయ్యగారు. చిన్నగా నవ్వింది గాయత్రి " చాల్లే బాబాయ్! మా పిన్ని పనికి వంక పెట్టడం ఇప్పటికీ మానలేదన్నమాట నువ్వు" అంది.

"అబ్బే... ఆయన కాలక్షేపమే అదికదా. అనసియ్య అననియ్యి. ఆ సాధింపు లేకపోతే నాకూ తోచదు" తేలిగ్గా నవ్వేసింది మహాలక్ష్మమ్మ!.

ముసిముసిగా నవ్వారు సీతారామయ్య గారు.

కాసేపు సంభాషణ ఉత్తరాది వంటకాల గురించి సాగింది.

హఠాత్తుగా అడిగారు సీతారామయ్య గారు "ఎందుకని పారిపోవాల్సి వచ్చిందో ఏమిటో ఏమన్నా చెప్పాడా నీ తమ్ముడు" అని.

వాతావరణంలోని చల్లదనం ఒక్కమాటుగా తగ్గినట్టనిపించింది గాయత్రికి.

"ఆయన చాపల్యమే కారణం. అంతః పురంలో ఎవరో రాణిగారి మనవరాలి వరన బాల వితంతువట. రాజుగారికి తెలిసేసరికి భయపడి కిందిటిరోజు వసూలు చేసిన పైకం తీసుకు.." పూర్తి చేయలేక అర్థోక్తిలోనే బిడియంగా తల వంచుకున్నది గాయత్రి.

"తప్పుచేసింది చాలక వెంట తీసుకుపోయి పాపాన్ని వీడికి కూడా పంచి పెట్టాడన్నమాట. మహానుభావుడు" అమాయకుడైన పార్వతీశాన్ని తలచుకుని నిట్టూర్చాడు సీతారామయ్యగారు.

గాయత్రి వదనం మ్లానమయింది.

భర్త ఎంత నికృష్టుడైనా అవనీ, కళ్లెదుటే అతన్ని దుషించడాన్ని ఏ మాత్రమూ సహించలేని హైందవనారి ఆమె.

చిన్నబోయిన ఆమె మొహం చూసాక తన తొందరపాటు తెలిసివచ్చింది.

ఆ వెంటనే పొరపాటు దిద్దుకుంటూ "సరె... సరె ఆ విషయం వదిలేయ్. ఇంతకీ పార్వతీశం ఏమంటున్నాడు. ఇక్కడ స్థిరపడినట్టేనా?" అన్నారు మాట మారుస్తూ.

"అది చెప్పుకుందామనే వచ్చాను బాబాయ్" చెమ్మగిల్లిన కళ్లను దాచుకుంటూ భారంగా అంది గాయత్రి.

ఆమె మొహంలోకి చెప్పమన్నట్టుగా చూసారు సీతారామయ్యగారు. పువ్వులు అందించడం ఆపింది మహాలక్ష్మమ్మ.

"తమ్ముడి విషయం నాకేమీ మింగుడు పడడం లేదు బాబాయ్. తమ్ముడు తమ్ముడేనా అనిపిస్తోంది. ఆ పూజా పునస్కారాలేమిటో, ఆ జపతపాలేమిటో! ఇరవై నాలుగుగంటలూ వాటిల్లోనే మునిగిపోయి వుంటున్నాడు. బాహ్యలోక స్మృతే ఉండడంలేదు వాడికి. ఏమిటో అంత అల్లరి చిల్లర వాడనుకున్న వాడికి దేవుడిమీద ఇంతటి భక్తి తత్పరత కుదిరినందుకు సంతోషించాలో, దగ్గరగా వచ్చాడనుకుంటున్న వాడు మాకిలా దూరంగా వుండిపోతున్నందుకు విచారించాలో తెలియకుండా వుంది."

డీలా పడిపోతున్న గాయత్రికి అసరా ఆన్నట్టుగా భుజంమీద చేయి వేసింది మహాలక్ష్మమ్మ "అన్నీ సర్దుకుంటాయ్ బాదపడకే అమ్మాయ్" అంటూ.

"ఏం సర్దుకోవడమో ఏమో! నా సంగతి అలా ఉంచండి. హేమను చూస్తుంటే కడుపులో దేవేస్తోంది. పిన్నీ మీకు తెలుసుగా! అది అక్కడ చక్కగా చదువుకుంటోంది. కంప్యూటర్స్, డ్రెస్ డిజైనింగ్ ఏవేవో వ్యాపకాలు పెట్టుకుని హాయిగా కాలక్షేపం చేస్తోంది. దాదాపు అది ఈ వూరినీ, ఇక్కడ జరిగిన చేదు సంఘటనల్నీ గుండెలోంచి చెరిపేసింది. తమ్ముడొచ్చాడని తెలిసేదాకా నేను కూడా అది అలా మరచిపోవాలనీ, నలుగుర్లో కలసిపోవాలని కోరుకున్నాను. నీ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చాక మళ్లా నా అంతట నేనే దానికి మరుగున పడిపోయిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసాను. బంధాన్ని, ధర్మాన్ని, సాంప్రదాయాన్నీ కాదనకూడదమ్మా అని బోధించాను. కాదనలేదు అది. తలదించుకుని వెంట వచ్చింది. ఇంత చేస్తే ఇక్కడ వీడిధోరణి ఇదీ. ఇప్పటివరకూ హేమని తమ్ముడు కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలుకరించలేదు. పైకి తేలలేదు గానీ

మానసికంగా నా బిడ్డ ఎంత చిన్నబుచ్చుకుంటున్నదో నాకు తెలుసు. నా మటుకు నాకు ఆయన రాకపోవడం కొరతగానే వుంది. ఇక్కడుండాలని అనిపించడంలేదు. వెంటనే పిల్లల దగ్గరకు వెళ్లిపోవాలనివుంది. కానీ చూస్తూ ఈ జడ భరతుడి చేతికి హేమనెలా అప్పగించి వెళ్లను!

అసలు 'ఏమిట్రా నాయనా ఇలా తయారయ్యావు. అని అడుగుదామంటే పదినిముషాలపాటన్నా ఆ అమ్మవారినీ, ఆ పట్టుపంచనీ వదలి ఉండడాయె ఏం చేయడం? అంతా అగమ్యగోచరంగా వుంది."

వ్యాకుల స్వరంతో తన గోడు వెళ్ళబోసుకున్నది గాయత్రి.

పదినిముషాలు భారంగా గడిచాయి.


"బావుందమ్మా. ముక్కు మూసుకుని తపస్సు చేనుకోవాలనుకునేవాడు బావగాతోపాటు హిమాలయాలవైపే వెళ్లక మళ్ళీ ఇంటికి తిరిగెందుకొచ్చినట్టో! పిలిచి మీరన్నా గట్టిగా అడగండి" అక్కడలేని పార్వతీశం మీద కోపం తెచ్చుకుంటూ భర్తవైపు చూసింది మహలక్ష్మమ్మ.

"అది అంబ ఆదేశమట" తాఫీగా అన్నారు సీతారామయ్యగారు.

"నాతోనూ అలాగే అన్నాడు. ఏమిటి బాబాయ్ దాని అర్థం?" నుదురు చిట్లించి అడిగింది గాయత్రి.

"ఏమిటో?" క్షణం జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆగారు సీతారామయ్యగారు.

"వచ్చిన మొదటిరోజున రాగానే నేను పార్వతీశాన్ని అన్నాడు. చూశాను. మనిషి చాలా మారాడు. దాదాపు పదమూడేళ్ళ ఎడం. సహజమే. ఆనవాళ్ళకోసం చూసాను. ఆ గడ్డం కింద పెద్ద పుట్టుమచ్చ. ఎద్దు



కొమ్ము విసిరిన గాటు. కంసాలి బసవలింగం స్వయంగా కుట్టిన రాగి బిచ్చపుకాడ. అన్నీ కనిపించాయి. రంగయ్యనీ, చాకలి వీరయ్యనీ గుర్తుపట్టాడు. ముఖ్యంగా మనకు చెరువునీళ్ళు తెచ్చిపోసేదే ఆ నాగమ్మని నీ ముక్కు నత్తు తీసేసావా నాగమామ్మా అని పలకరించాడు. నీకు తెలుసుగా నాగమ్మని వాడు నాగమామ్మా అని పిలిచేవాడు. ఆవిడ ముక్కు నత్తు భర్త పోయాక ఈమధ్యనే తీసేసింది. పార్వతీశమేనా అన్న అనుమానం వదిలిపోయింది. అప్పుడు కూర్చోమన్నాను."

వెలుపలకు వెలువరించలేకపోయిన గాయత్రి సంశయానికి అనుకోకుండా ఆయన ఇచ్చిన వివరణ సమాధానం కాగా తేలికపడిందామె మనసు.

ఆపిన దగ్గర్నుంచి తిరిగి ఎత్తుకున్నారు సీతారామయ్యగారు.

"పక్కన సుందర్రామయ్య లేడు. కలసి వెళ్లినవాళ్ళు కలసి ఎందుకు రాలేదురా అని అడిగాను. ఏదో ఆషామాషీగా చెప్పి దాటవేయబోయాడు. రెట్టించి అడిగాను. అప్పుడు చెప్పాడు. ఎవరో సన్నాసి బంగారం చేసే విద్య నేర్పుతానంటే అతని వెంట రుషికేష్ దాకా వెళ్లారుట. అక్కడ వీడికి ఇంకొక సాదువుతో పరిచయం ఏర్పడిందిట. ఆయన మామూలు సాధువు కాదు. గొప్ప తపస్వి, దేవీ ఉపాసకుడు. యోగి పుంగవుడు. మహా మహిమాన్వితుడు అంటాడు. ఆయనే చెప్పాట్ట 'అబ్బాయ్! నీ త్రోవ వేరే వుంది' అని. ఆ స్వర్ణయోగంమీదా, ఆ స్వర్ణ యోగి మీదా మీ తమ్ముడికి ముందన్నుగానే పిసరంత అపనమ్మకం. ఆయన మాటతో కాలు మరి ముందుకు సాగలేదు. 'ఆ దారి ఏదో మీరే సెలవీయండి స్వామీ' అని ఆయన ముందు సాగిలపడ్డాడట. 'నేను కాదు జగజ్జనని ఆ పార్వతీదేవే నీ వద నిర్దేశకురాలు' అని చెప్పి దేవీ మంత్రం ఉపదేశించాట్టాయన వీడికి. నిద్రాహారాలు మాని నియమంగా ఏకదీక్షగా లక్షసార్లు ఆ మంత్రం పునశ్చరణ చేశాట్ట. తల్లి కరుణించింది. స్వప్నంలో సాక్షాత్కరించింది. 'వెర్రివాడా! నీ జన్మస్థానంలోనే వున్న నన్ను మరచిపోయి ఇంతదూరం వచ్చి నాకోసం తపస్సు చేస్తున్నావా? రా వచ్చేయ్. వచ్చి నన్ను ఆరాధించు. నిన్ను నేను అనుగ్రహిస్తాను" అని ఆదేశించిందిట. దేవి ఆజ్ఞ తలదాల్చి తన మార్గం ఇటు మళ్లించుకున్నాడు వీడు. ఎంత నచ్చచెప్పినా పుత్తడి మీద భ్రాంతి చావని నీ భర్త ముందుకెళ్లాడు. అదీ జరిగింది."

నిటారుగా కూర్చుని చెబుతున్న సీతారామయ్యగారు చెప్పడం ముగించి వడక్కుర్చీలో వెనక్కి వాలారు. రెప్పవాల్చకుండా వింటున్న శ్రోతలిద్దరూ ఒక్కసారిగా వూపిరి పీల్చి వదిలారు.

"నుదుటన విభూతిరేఖలకు బదులు కుంకంబొట్టు పెట్టి రోజల్లా అమ్మవారి గుడి చుట్టూరా ప్రదక్షిణాలు చేస్తున్నాడంటే ఏమో అనుకున్నానుగానీ ఇదన్నమాట కారణం. ఇది సరే ఇవన్నీ ముందే తెలుసుండీ మాట వరసకైనా మాతో ఎప్పుడూ అన్నారు గారేం?" గాయత్రి మనస్సులో వేసుకున్న ప్రశ్నను మహాలక్ష్మమ్మ బయటకు వెళ్లగక్కింది.

"ఎలా చెప్పను? అప్పుడు వాడి మాటా, చేతా, కట్టూబొట్టూ కూడా నాకు చాలా విపరీతంగా అనిపించాయి. మీకు తెలీదు. పోయిన వాళ్లు పోగా మిగిలున్న వీళ్లిద్దరినీ కలవటానికన్నాడా అంత సుముఖత చూపించలేదువాడు. ఎక్కడో ఓ చోట క్షేమంగా వున్నారుకదా బాబాయ్. ఉండనీలే. అంత అత్యవసరంగా పిలిపించాల్సిన అగత్యమేమిటి అన్నాడు గాయత్రికి టెలిగ్రామ్ ఇస్తానని నేనప్పుడు. 'అదేమిట్రా ఇన్నేళ్ళు దివారాత్రులు కళ్ళల్లో వత్తులు వేసుకుని మీకోసం ఎదురుచూస్తున్న అక్కగారు, నీ రాకతో బ్రతుకు పండించుకుందామని కాంక్షించే నీ భార్య, వాళ్ళకన్నా నీ రాక తెలియనీయవద్దా! భలేవాడివే. అయినా వాళ్ళు రాకపోతే ఇక్కడ నీ ఆలనా పాలనా చూసుకునేవాళ్లెవరు? అని నేనంటే వాడేమన్నాడో తెలుసా? 'సంసారమూ అనుబంధమూ లాంటి లంపటాలని తగుల్చుకుందామని నేనిక్కడకు రాలేదు బాబాయ్. ఇక ఆలనపాలనా అంటావా నా తల్లి ఆ మహేశ్వరి వున్నది. ఆ తల్లి వుండే మందిరంలోనే నేనూ వుంటాను. ఆ అమ్మకు నైవేద్యం పెట్టిన ప్రసాదమే నాకో రెండు పిడికిళ్లు దొరక్కపోదు. అది నా పొట్టకు చాలు. నా తల్లి ఆజ్ఞగా ఆమెను సేవించుకుంటూ ఆలయంలోనే నిశ్చింతగా గడిపేయగలను' అన్నాడు. 'వెర్రి కుదిరింది, రోకలి తలకి చుట్టమన్నంట్ట' అలా వుంది వాడి ధోరణి. ఏదో ఇన్నేళ్లకన్నా వచ్చాడుకదా అనుకుంటుంటే మళ్లీ ఇదేమి పైత్యం? అనిపించిందిగానీ ఆ మాటల్నంతగా పరిగణనలోకి తీసుకోలేదు నేను. ఈ వైరాగ్యానికేమిలే తన వాళ్ళ మధ్యన తిరుగుతుంటే అందునా వయసులో వున్న భార్య కళ్లకెదురుగా కనబడుతూ చేరువగా మసలుతుంటే ఆ విరక్తి దానంతట అదే తేలిపోతుంది. అప్పుడీ ప్రపంచంలోకి వాడే దిగి వస్తాడు అనుకున్నాను. పైకి మాత్రం 'అదికాదురా నాయనా! నువ్వు తెంచుకున్నావనుకున్నా వాళ్లింకా నీమీద ఆపేక్ష వదులుకోలేదు. రానియ్ వాళ్ళు నీ జపతపాలకేమీ ఆటంకం కాదులే. వాళ్ళ దారిన వాళ్లుంటారు' అని అన్నాను. మౌనంగా ఊరుకున్నాడుగానీ వాడి అయిష్టం తెలుస్తూనే ఉంది."

చెబుతూ చెబుతూ గాయత్రివంక

తిరిగారాయన.

"మీరు కొండంత ఆశ పెట్టుకుని వచ్చారా! రాగానే ఇవన్నీ చెప్పి వెల్లువలా పొంగుతున్న మీ ఆనందం మీద నీళ్ళు చల్లలేకపోయానమ్మా గాయత్రీ!" అన్నారాయన అభిమానంగా.

"మరి ఇప్పుడేమిటి చేయడం బాబాయ్ బేలగా అడిగింది గాయత్రి.

"చూద్దాం! వీడింత తీవ్రోపాసకుడని నేనూహించలేదు. ఆలోచిద్దాం" అన్నారు సీతారామయ్యగారు సాలోచనగా.

తన గుండెను సలుపుతున్న బాధా నివారణకి ఇక్కడ పూర్తిగా కాకపోయినా కనీసం చిన్నదో చితకదో ఓ పరిష్కార సూచన లభించగలదనే ఆశతో వచ్చింది ఇక్కడకు. కానీ... ప్చ్!

గాయత్రి లేచి నిలబడింది.

ఇందాక దృశ్యాదృశ్యంగా గోచరించిన పరిసరాలిప్పుడు పూర్తి అంధకారంలో ఒరిగిపోతున్నాయి.

"నేనిక వెళ్తాను పిన్నీ! హేమ ఒక్కతే ఉంది ఇంట్లో."

పళ్లెంలో నన్నుజాజుల మా అలాగే వుంది.

ఒకదాని వెనుక ఒకటిగా వచ్చి ముంచిపోతున్న కష్టాల కడలి కెరటాల తాకిడికి డస్సిపోయి నిలబడ్డ ఆమెను సిగలో పువ్వులను అలంకరించుకోమనడానికి నోరు రాలేదు మహలక్ష్మికి.

ముగ్గురూ తలవాకిలిదాకా వచ్చారు.

"మరిచిపోయానమ్మడూ! డొంకలో ఈతచెట్టుకి పాకి ఆగాకరతీగ అవుపిస్తేనూ కాసిని కాయలు వెతికి కోసుకొచ్చాడు మా పాలేరు. నీకు గుర్తేనా పార్వతీశం అవంటే చెవి కోసుకుంటాడనీ, రెండోవాళ్ళకి ముక్క మిగల్చడని మీ అమ్మ అంటుండేది. ఉండు పట్టుకొస్తాను" మహలక్ష్మమ్మ మళ్లీ వెనక్కి వెళ్లింది.

సీతారామయ్యగారు గాయత్రికి ధైర్యవచనాలు చెబుతున్నారు.

"గుండె నిబ్బరం దిగజారనివ్వకు, అన్నిటికీ ఆ పరమేశ్వరుడే ఉన్నాడు. వాడయినా అదే... ఈశుడు మంచి మార్గంలోనే ఉన్నాడుగానీ దుష్టమార్గాన లేడుగదా! అదో శుభసూచకం" అంటున్నారు.

చటుక్కున గుర్తుకొచ్చింది గాయత్రికి.

"ఇంతకీ ఇప్పుడు పీకలమీదకొచ్చిన ప్రమాదం మాకు చెప్పనేలేదు బాబాయ్! తమ్ముడు దాక్షాయణీ అమ్మవారి గర్భగుడిలోకి నేనెందుకు ప్రవేశించకూడదు అని అర్చకులతో వాదన పెట్టుకుంటున్నాడట. నిన్న ఆ పూజారి దత్తాత్రేయులుగారి అబ్బాయి వచ్చి 'కాస్త మీ తమ్ముడితో అది తగదని చెప్పండి' అని ఒకటే గొడవ. ఎవరి మాటయినా వాడు వినిపించు కునేటట్లయితే నాకీ విచారమెందుకూ, ఈ గండమెలా దాటడమో నాకేటూ పాలుపోవడంలేదు బాబాయ్" అణచుకుందామన్నా అణగని దైన్యత కొట్టొచ్చినట్టు వినబడుతోంది ఆమె స్వరంలో.

"అవును నిన్న సాయంత్రం దత్తాత్రేయులుగారొచ్చి లబోదిబోమన్నాడు నా దగ్గర. 'సాక్షాత్తూ శివశర్మగారి కుమారుడు కదా అని ఊరుకుంటున్నాంగానీ అతగాడు పెడ్తున్న చికాకుకి మెడపెట్టి గెంటాల్సిన పని' అంటూ విసుక్కున్నాడు. అది నీదాకా వచ్చిందో లేదో అని తెలుసుకుందామనే సాయంత్రం మీ ఇంటికి వెళ్లాను" అన్నారు చల్లగా.

"హరి భగవంతుడా" రెండు చేతులతోనూ తల పట్టుకుని నేలమీద కూలబడింది గాయత్రి.

"అదిగో అలాగే బెంబేలు పడవద్దంటాను. ఎంత కఠిన సమస్యకయినా ఏదో ఎక్కడో పరిష్కారమార్గం ఉండి తీరుతుంది. కాకపోతే సమస్య మీదకొచ్చి పడిన సమయంలో మనకు ఉండాల్సిందల్లా వెదికే శ్రద్ధ, దొరికేదాకా తల్లక్రిందులు కాకుండా నిలబడగల ఓపిక, తగిన ఆలోచన, అంతే. ఆ మార్గం దొరికి తీరుతుంది. నీకెందుకు నేనున్నాకదా, ప్రస్తుతానికి దత్తాత్రేయులుగార్ని శాంతపరిచాను. అంతేకాదు, మీ తమ్ముడ్ని గర్భగుళ్ళో కూర్చోడానికి ఒప్పించాను."

"బాబాయ్!" విస్మయంతో తలెత్తింది గాయత్రి.

"అవును. ఆయనతో చెప్పాను. 'పార్వతీశం పరాయివాడు కాదుకదయ్యా! మీ పురోహిత కుటుంబంలోని వాడేకదా. అదివరకటి అలవాటు చొప్పున అమ్మవారి దగ్గరగా కూర్చోవాలని వెంపర్లాడుతున్నాడు. మీ అర్చన కార్యక్రమాలకేమీ అంతరాయం కలిగించవద్దని చెబుతాను. కొన్నాళ్లపాటు అతన్ని గర్భగుళ్ళో ఓ పక్కగా కూర్చోనివ్వండి. ఈలోపల ఏదో ఒక ప్రత్యామ్నాయం నేను చూస్తాను' ఇక రేపు పార్వతీశంతో మాట్లాడతాను. వాడు చేస్తున్న తపస్సు లక్ష్యమేమిటి? నియమనిష్ఠలేమిటి? గడువంటూ వున్నదా, ఉంటే ఎప్పటివరకో కనుక్కుంటాను. ఇవేమీ కాక మోక్షసాధనే గమ్యమయినట్టయితే గృహస్థాశ్రమం దానికి అడ్డంకి కాదే. ఎక్కడో కోటికొక్కరు కారణజన్ములైన మహాజ్ఞానులు మాటేమోగానీ మొదటి మెట్టుమీద కాలాన్చకుండానే చివరి మెట్టు అధిరోహించ పూనుకున్నట్లుగా చిన్న వయసులోనే సన్యాసాశ్రమ స్వీకారం మనబోటి వారికి సాధ్యంకాదు. అసలు మిడిమిడిజ్ఞానంతో కర్మత్యాగ చేసేకంటే

కర్మఫలం పరిత్యాగం చేయడమే సామాన్యులకు అనుసరణీయమని గీతకారుడేకాదు, ఇంకెంతోమంది మహానుభావులు చెప్పిన ఉదాహరణున్నాయి. ఇవన్నీ నీకు కాదు, వాడి తలకెక్కించే ప్రయత్నం చేస్తాను. ఆ తరువాత దైవాధీనం.

గుండె నిండిన కృతజ్ఞతతో చేతులెత్తి నమస్కరించింది గాయత్రి.

అంతకుముందే చేతిలో కాయితం సంచీతో వచ్చి నిలుచుంది మహాలక్ష్మమ్మ.

"ఈమాత్రం దానికి దణ్ణాలెందుకే పిచ్చిమొహమా! మా ఒళ్ళో పెరిగినదానవు నువ్వొకటీ ఆ పిల్లలొకటీ కాదు మాకు. నీ కష్టం మాది కాదూ" తలమీద చెయ్యివేసి నిమురుతూ అంది.

తెప్పరిల్లినట్లుగా నిట్టూర్చి లేచింది గాయత్రి.

బరువైపోయిన వాతావరణాన్ని తేలిక పరచదలచి "అన్నట్లు పగలంతా హేమ ఏం చేస్తుంది" అని సంభాషణని మరల్చారు సీతారామయ్యగారు.

"అదో వెర్రిది. పెరట్లో ఏదో విత్తనాలూ, మొక్కలు నాటింది. ప్రొద్దున్న లేచిన దగ్గర్నుంచీ పెరట్లోకీ, వాకిట్లోకీ పరుగులు పెడుతుంది. చిన్న మొలక తొంగిచూసినా, ఒక్క చిగురుటాకు పైకి లేచినా పొంగిపోతుంది. లెక్కపెట్టుకుంటుంది. కనబడినవారందరికీ చెప్పుకుని మురిసిపోతుంది. దానికదే ధ్యాస."

"రేపు సాయంత్రం ఇంటికేసి వస్తాను. తయారుగా ఉండమను. దానికో మంచి కాలక్షేపం చూపెడతానని చెప్పు. "అలాగేలెండి" నిర్లిప్తంగా అని ముందుకు నడిచింది గాయత్రి.

ఆరాత్రి ఆగాకరకాయలు వేయించి తమ్ముడి కంచంలో వడ్డించింది. రోజూ రొట్టెలుతినే పార్వతీశం "ఈవేళ అన్నం పెట్టక్కా" అన్నాడు. వద్దనకుండా మారువేయించుకున్నాడు. ముక్క మిగలకుండా తినేసాడు.

ఎక్కడో మిగులున్న అనుమానం కరిగిపోయి మొహం వికసించింది గాయత్రికి.

* * *

ఆ సాయంత్రం వాహ్యాళికి తనతోపాటు హేమని కూడా బయలుదేరదీసారు సీతారామయ్యగారు.

ఇద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ నింపాదిగా నడుచుకుంటూ ఎదురుపడి పలకరించినవాళ్ళకు బదులిచ్చుకుంటూ కొందరి దగ్గర ఆగి మరీ పరామర్శించు కుంటూ క్రమంగా దివాణం వెనుకవైపుకి చేరుకున్నారు.

"ఇదే నేను చెప్పిన ఆశ్రమం. ఇది చూపిద్దామనే నిన్ను తీసుకువచ్చాను."

వింతగా పరిసరాలను గమనించింది హేమ.

అదివరలో ఇటువైపున జనాల్ని తిరుగాడ నిషేధించారు. అంచేత నిర్మానుష్యంగా ఉండేది. ఇప్పుడక్కడ దివాణం ప్రహరీగోడ సరిహద్దుగా అర ఎకరం మేర నలుచదరంగా తీగలతో ఫెన్సింగ్ వేసారు. దానికో చిన్న రేకుల గేటు. విశాలమైన ఆవరణకు మధ్యన ఇటుకల గోడలమీద జమ్ముతో వేసిన పైకప్పులతో నాలుగు పొడుగాటి పూరిళ్ళు కనబడుతున్నాయి.

"లోపలకు వెలదాం పద."

గేటుతీసి లోనికి వెళ్లారు.

రావి చెట్టు చుట్టూరా కట్టిన అరుగుమీద కూర్చుని ఎదురుగావున్న పది పదిహేనుమంది వృద్ధులకు గీతాసారాంశాన్ని మృదువుగా సరళమైన పదజాలంతో అర్ధమయ్యేలా చెబుతున్నాడొక మధ్య వయస్సు వ్యక్తి.

వెళ్లంగానే ఎదురుగా కనబడిన ఆ దృశ్యం హేమకు ఆ ఆశ్రమంపట్ల సదభిప్రాయాన్ని కలుగచేసింది.

వెళ్లి ఏ పక్కగా కూర్చున్నారు ఇద్దరూ.

పది నిముషాల తరువాత ఆ అధ్యాయం పూర్తిచేసి వీరివంక తిరిగి మందహాసం చేసాడాయన.

శ్రోతలు ఒక్కరొక్కరూ లేచి కుటీరాలవైపు వెళ్లిపోతున్నారు.

వీరికి దగ్గరగా వచ్చాడాయన.

"ఈయనే కుమారస్వామిగారనీ... ఈ ఆశ్రమ స్థాపకులు" హేమకి పరిచయం చేసారు సీతారామయ్యగారు.

నమస్కరిస్తున్న హేమకు తిరిగి నమస్కరిస్తూ "ఆశ్రమం, స్థాపన... అంత పెద్ద పదాలెందుకు సీతారామయ్యగారూ! నిరాదరణకు గురి అవుతున్న పదిమంది వయసు మళ్ళిన వాళ్లకు, అనాథలైన నలుగురు పసివాళ్ళకూ కాస్తంత నీడనిచ్చే నాలుగు పూరి పాకలివి. అంతే" నిష్కపటంగా నవ్వుతూ అన్నారు స్వామిగారు.

"సరే మీరన్నట్టే లెండి. ఆశ్రమంకాదు ఆశ్రయమే. సరేనా. ఈ అమ్మాయి నా మనమరాలు హేమలత. డిగ్రీ పూర్తి చేసింది. బోడి ఊళ్ళో బొమ్మరాయి తీర్థమనీ... పేడా మన్నూ పిసుక్కునే ఈ సుద్ద పల్లెటూర్లో చదువుకున్నవాళ్ళకి కాలక్షేపమేమవుతుంది. మీ ఆశ్రమం చూపించి మిమ్మల్ని పరిచయం చేద్దామని ఇటు తీసుకువచ్చాను" అన్నారు సీతారామయ్యగారు.

"మంచి పనిచేసారు. నా దగ్గరకొస్తే కాలక్షేపానికేమీ కొదవ చేయను. కూర్చోండి. ఇప్పుడే వస్తాను" కుమారస్వామిగారు చకచకా అడుగువేస్తూ కుటీరాలవైపుగా వెళ్లారు. అప్పుడు క్లుప్తంగా చెప్పుకొచ్చారు సీతారామయ్యగారు స్వామిగారి చరిత్రను.

"సిసలైన మానవతావాది అంటే ఇతనేనమ్మా. నా అనిగానీ, నాకోసమనిగానీ ఒక్కనాడు కూడా అనుకోనయినా అనుకోని నిస్వార్థపరత్వాన్ని ఇతని దగ్గరే చూశాను నేను. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన కుమారస్వామి మదర్ థెరిసా సేవా దృక్పథం తనకు ఆదర్శమంటాడు.

చిన్నతనాన్నే తండ్రి గతించాడు. అష్టకష్టాలువడి తమ నలుగురు అన్నదమ్ముల్నీ పెంచి పెద్ద చేసిన తల్లి వయసు ఉడిగి మంచాన వడగానే రెక్కలొచ్చిన అన్నగార్లూ పై ఇంటినించొచ్చిన వదినగార్లూ ఈసడిస్తూ చిన్నచూపు చూడడాన్ని కడగొట్టువాడయిన ఈయన భరించలేకపోయేవాడు. పోరాడే మనస్తత్వం కాదు. ఇది తగదు అని సానునయంగానే చెప్పబోతే ఇంతకన్నా నెత్తికెక్కించుకోవడం మావల్లకాదు నాయనా చేతనైతే తీసుకెళ్లి పూజించుకో" అని షెడీల్మని సమాధానమొచ్చింది.

అప్పుడే ఓ గట్టి నిర్ణయానికొచ్చాడాయన. చెప్పడం కాదు, ఆచరించి చూపాలని.

చెయ్యాలనుకుంటున్న రిసెర్చ్‌ని మానుకున్నాడు. చిన్న ఉద్యోగం వెతుక్కున్నాడు. తల్లిని తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. వదినలు వెటకరించినట్టు తల్లిని పువ్వుల్లో పొర్లాడించకపోయినా ఆమె మానసికంగాగానీ, శారీరకంగాగానీ నొచ్చుకోవలసిన క్షణం రాకుండా ఏ లోటు లేకుండా చుసుకున్నాడు. వీరికి తోడుగా పెదతండ్రి వరుసయ్యే ఒకాయన పిల్లలులేని కారణంగా వీరి పంచన చేరాడు. ఆ వయసువ్సులోని వారు అభిలషించే ఆప్యాయతనీ, గౌరవాన్నీ స్వామి వారిద్దరికీ పుష్కలంగా అందించాడు. ప్రశాంతంగా గడవడానికి అవసరమైన వసతులు ఏర్పరిచాడు. ఇవన్నీ తప్పనిసరి కర్తవ్య నిర్వహణగా కాక మనస్ఫూర్తిగా చేశాడు.

ఆ ఇరువురు వృద్ధులు తమ జీవితపు అఖరి దినాలు అతని పోషణలో మనశ్శాంతిగా సంతృప్తిగా వెళ్ళ మారుతున్నందుకు సంతోషిస్తే వారి సేవలో, సంరక్షణలో అవ్యక్తమైన అలౌకికమైన ఆత్మానందానుభూతిని పొందగలిగాడు. వారి మరణానంతరం కూడా సంసారం మీదకి మనసుపోలేదు స్వామికి. తల్లీ పెత్తండ్రీ పోవడంతో ఏర్పడిన సూన్యాన్ని మరి ఇద్దరు నిస్సహాయ వృద్ధులను అక్కున చేర్చుకుని పూరించుకున్నాడు.

ఆ ఇద్దరు నలుగురయ్యారు.

సామాన్యంగా ఈ దేశంలోనైనా మరే దేశంలోనైనా ప్రతి ఇంట్లోనూ వాడేసి అరిగిపోయి మార్చడానికిక్కూడా పనికిరాని పనిముట్లులాంటి వయస్సు ఉడిగిన వాళ్ళు, అయినవాళ్ళే తప్పనిసరి తద్దినంగా భరిస్తూ అంతరాంతరాలలో వారికే తెలీకుండా వారి అంతాన్ని కోరుకోబడుతున్న దురదృష్ట దౌర్భాగ్య జరాపీడితులకు కొదవేముంది?

ఆ నలుగురు పదిమందయ్యేసరికి ఇల్లు చాలలేదు. స్వామి పదేళ్ళక్రితం ఈ ఊరు వచ్చారు. రాజాగారిని అర్థించి ఈ అరవెకరం స్థలంలో షెడ్‌లువేసి ఆ వృద్ధులకి ఆవాసమేర్పరిచాడు. పెత్తండ్రి పోతూ పోతూ రాసిచ్చిన ఆస్తిమీదా, తన ఆస్తిమీదా వచ్చే ఆదాయం వీరి తిండికి, బట్టకీ బొటాబొటీ సరిపోతుంది. చాలనప్పుడు నాలుగు వూళ్ళు తిరిగి విరాళాలు వసూలుచేసి తెస్తాడు. వారి ఆరోగ్య విషయంలో అత్యంత శ్రద్ధ వహిస్తాడు. జరాభారంలోని విషాదాన్ని మరిపించేలా ఉదయమూ, సాయంత్రమూ ఆధ్యాత్మిక బోధనలు వినిపించుతుంటాడు. ఆహారమూ వారికోసం ఏమీ చేయగలనా అనే ఆలోచిస్తాడు, శ్రమిస్తాడు. ఇక్కడున్న ఈ బలహీన వృద్ధులందరికీ అతడు దేవుడు తమకోసం పంపిన బిడ్డ. అతనికి వారందరూ తల్లులూ పెత్తండ్రులే."

వివరించి చెబుతున్న సీతారామయ్యగారి కంఠస్వరం కుమారస్వామిగారిపట్ల ఎనలేని అభిమానాన్ని ధ్వనించింది.

ఇంతలో రెండు గ్లాసులతో నిమ్మరసం, ఒక ప్లేటులో బొప్పాయిపండు ముక్కలు పట్టుకుని వచ్చారు కుమారస్వామిగారు.

"మీకు అనవసర శ్రమ" మొహమాటంగా అన్నది హేమ.

"శ్రమేమున్నది కాస్త షర్బత్. మా తోటలో కాసిన బొప్పాయిపండ్లు. అంతే" చిరునవ్వుతో తేల్చి వేసారు కుమారస్వామిగారు.

కాసేపు ఇష్టాగోష్టి అనంతరం.

"ఇక్కడున్న పెద్దవాళ్ళకు ఏదోవిధంగా కాలక్షేపం కలగజేయగలుగుతున్నాను.ఏదో ఒకటి చదివి వినిపిస్తుంటాను. కాస్త ఓపిక వున్నవాళ్ళు తోటపనిలోనో, వంటపనిలోనో అతనికి సాయపడుతుంటారు. రేడియో వుంది. పేపరు వస్తుంది. ఫర్వాలేదు. వాళ్ళవరకు తోచుబాటవుతుంది. ఇకపోతే నా అంటూలేని పదిమంది అనాథ పిల్లకాయలు ఉన్నారు. వాళ్ళని వేదాంతం వినమనడం సబబుకాదుకదా. వాళ్ళకు నాలుగక్షరం ముక్కలునేర్పి సెవెంత్ క్లాస్ పరీక్షకు కూర్చోబెట్టాలని నా సంకల్పం."

"ఈ విషయంగానే ఇతనికి సాయపడగలనని నిన్నిక్కడకు తిసుకొచ్చాను హేమా" మధ్యలో జోక్యం చేసుకుంటూ

చెప్పారు సీతారామయ్యగారు.

ప్రశ్నార్థకంగా చుసింది హేమ.

"అవును హేమగారూ! సిలబస్ ప్రకారం పుస్తకాలు అప్పగించానేగానీ ధ్యాస పూర్తిగా వాళ్ళమీద ఉంచడానికి నాకు సమయం చాలడంలేదు. మీకు వీలయితే, ఆసక్తి ఉంటే దయచేసి మీ సమయాన్ని కొంత వాళ్ళకోసం కేటాయించగలరేమోననీ..." ఆగారు కుమారస్వామిగారు.

"ఒక మంచి కార్యంలో పాలుపంచు కొమ్మనడానికి సందేహిస్తారెందుకు అంకుల్. సంతోషంగా ఒప్పుకుంటున్నాను మీ ప్రపోజల్ను. రోజూ సాయంత్రం పూట వస్తాను. వాళ్ళకు నా చేతనైనంతగా చదువుచెప్పే ప్రయత్నం చేస్తాను." అన్నది హేమ ఉత్సాహంగా.

సీతారామయ్యగారు సంతృప్తిగా నవ్వారు.

"నే చెప్పలేదూ. మా హేమ పనికొచ్చే పని చేయమంటే కాదనే ప్రసక్తేలేదని" హేమకేసి మురిపెంగా చూస్తూ అన్నారు సీతారామయ్యగారు.

చీకటిపడింది. "మరి మేము వెళ్లిరామా" లేచి నిలబడుతూ అన్నారు సీతారామయ్య గారు.

గేటుదాకా వచ్చి సాగనంపుతూ, "మరి రేపు వస్తారుగా" అన్నారు కుమారస్వామి గారు హేమనుద్దేశించి.

"తప్పకుండా" నమస్కరిస్తూ అన్నది హేమ.

ఇద్దరూ ముందుకు కదిలారు.

దివాణం వెనకతట్టు ప్రాంతమవటంవల్ల ముందే అక్కడ మనుషులు అంతగా తిరగరు. అందునా మునిమాపువేళ దాటిన సమయం. చుట్టుపక్కల మనిషిపొడ అవుపించటంలేదు. కీచురాళ్ల మోత హెచ్చవుతోంది.

దివాణం ప్రహరీ వెనక గుమ్మం దగ్గరికొచ్చేసరికి సీతారామయ్యగారు ఆగారు.

"ఇక్కడ కొంచెం పని వుంది- అది కుడా అవజేసుకుని వెళదాం." అన్నారు.

'ఆఫీసులు వీధివైపుగదా- ఈవెనకవైపు ఏంపని? పైగా ఈ సమయంలో.'

"లోపల అవరణలో సర్వమంగళాదేవి మందిరం వుంది చూసొద్దాం" ఆమె సందేహాత్మక ఆలోచనలకు సమాధాన మిచ్చారు సీతారామయ్యగారు.

"సర్వమంగళాదేవా?" జ్ఞాపకం తెచ్చుకుంటూ, అకస్మాత్తుగా ఈ మజిలీ ఏమిటో ఎందుకో అర్థం అవకపోయినా దైవదర్శనమనగానే మాట్లాడకుండా అనుసరించింది హేమ.

ముందువైపు ప్రహారీ ద్వారం మాదిరిగానే వెనక ద్వారం కూడా శిథిలావస్థలోనే వుంది.

గుమ్మానికి బిగించిన పిడచలు తప్ప తలుపులు రెండూ మిగలలేదు.

గుమ్మందాటి లోపలికి అడుగుపెట్టారు.

కాలికింద చెత్త నలిగి చిరచ్చిలాడింది. అనుకోని అతిథుల రాకకు నిరసనగా నాలుగయిదు చిన్న జీవాలేవో కీచు కీచుమంటూ అటూ ఇటూ పరుగులూపట్టాయి.

కాలికింద ఏదో మెత్తగా... భయంతో ఒళ్లు జలదరించగా చిన్నగా పక్కకు గెంతికిందికి చూసింది హేమ.

గుడ్లపీలిక. నవ్వుకున్నది.

"ముందువైపు చావిట్లో పంచాయితీ ఆఫీసుపెట్టారు. ఇంకొంత భాగం ఎగ్రికల్చర్ వారి గొడౌన్లకీ ఇంక ఏదో ఆఫీసులకీ ఇచ్చేశారు. అంచేత అటువైపంతా శుభ్రంగా వుంటోంది. ఈ వెనక గదుల్లో పూర్వం రాణివాస స్త్రీలు వుండేవారు. ఇప్పుడు వాటిల్లో పాత సామాన్లు పడేసి తాళాలు బిగించుకుపోయారు వాళ్ళు. మనుషులు మసలని కారణంగా ఇటువైపు ఇదిగో ఇలా దుమ్మూ దూగర చేరిపోయింది" కరణంగారు చెబుతున్నారు.

ఎదురుగా జమీందారుల హవేలీ తాలూకు వెనుక భాగం విధివశాత్తూ అభరణాలు కోల్పోయినా స్థైర్యం చెదరనివ్వని రాచపడుచులా గంభీరంగా కనబడుతోంది.

వెడల్పయిన వరండా, పనితనాన్నంతా గుప్పించి చెక్కిన దర్వాజాలు, రంగుటద్దాలు బిగించిన గవాక్షాలు- ఇంగువ కట్టిన గుడ్డలా పరిమళిస్తోన్న ఆ గతకాలపు వైభవ చిహ్నాలను కళ్ళు విప్పార్చి చూడసాగింది హేమ.

భవనం ముందు కంటే వెనకవైపు రెట్టింపు స్థలం వున్నట్టుగా ఉంది. ఆ ఖాళీ ప్రదేశంలో ఒకవైపున దాసీ జనం నివేశనం కొరకు కట్టిన గదులు గావును జీర్ణావస్థలో వెలవెలబోతూ ఒదిగి వున్నాయి. ఇంకొక వైపున సీతారామయ్యగారు చెప్పిన మందిరం తూర్పువైపుగా కనిపిస్తోంది.

"ఇక్కడో గుడి వున్నదన్న సంగతే నాకు గుర్తులేదు సుమా తాతయ్యా" గుడివైపుగా వెడుతున్న సీతారామయ్యగారితోపాటు తనూ కదులుతూ అన్నది హేమ.

"ఇది జమీందారుగారికి సంబంధించిన మందిరం. బయటవారెవరికీ ప్రవేశార్హత ఉండేది కాదు. రాణీవాస స్త్రీలు దైవదర్శనానికిక్కూడా ఇల్లు కదిలి బయటకు రాకుండా చేసిన ఏర్పాటు ఇది" ఆగి చూసారు సీతారామయ్యగారు.

మందిరం తలుపులకు తాళం వేళాడుతోంది. అందుకు ముందే సిద్ధపడి వచ్చినట్టుగా జేబులు తడిమి తాళం చెవి బయటకు తీసారు ఆయన.

దశాబ్దాల క్రితం బిగించిన తాళం ఓ పట్టాన వూడిరాలేదు. ఇనపవా అనిపించేలా దృఢంగా, మందంగా వున్న తలుపుల్ని ఇద్దరూ కలిపితోయాల్సి వచ్చింది.

కిర్రుమంటూ తలుపులు బరువుగా తెరుచుకున్నాయి. అదోరకమైన పాత వాసన గుప్పుమంటూ ఇద్దరి ముక్కుపుటాల్ని అదరగొట్టింది.

రెండు నిముషాలు ఆ వాసన పలచబడనిచ్చి ఆ తరువాత లోపలికి ప్రవేశించారు.


అసలే పొద్దు గుంకుతున్న వేళ. బయట వెలుతురే అంతంత మాత్రంగా ఉంది. అలాంటప్పుడు ప్రవేశద్వారం తప్ప చిన్న రంధ్రమైనా లేని ఆ మందిరంలో వుండే వెలుగు ఏపాటిదని?

హేమ కళ్ళు చికిలించి చూడ్డం గమనించి అగ్గిపుల్ల వెలిగించారు సీతారామయ్యగారు.

ఆ కాంతిలో ఎత్తయిన పీఠంమీద అధివసించిన సర్వమంగళాదేవి సుస్పష్టంగా దృగ్గోచరమయింది.

ఒక కాలు పాద పీఠం మీద మోపి రెండోది మడిచి మందహాస వదనమై అభయ ముద్రలో ఉన్నతాసనం మీద ఆసీనురాలై వున్న ఆ దేవిని కన్నులారా తిలకిస్తూ భక్తితో చేతులు మోడ్చింది హేమ.

"ఫరవాలేదు. అనుకూలంగానే వుంది. శుభ్రం చేయిస్తే సరిపోతుంది" తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నారు సీతారామయ్యగారు. మరో అగ్గిపుల్ల వెలిగించి వేలాడుతోన్న బూజును. అంగుళం మందాన పేరుకుపోయిన దుమ్మునీ విమర్శగా చూసూ-



"ఎందుకు తాతయ్యా!"

"చెబుతా పద!"

ఇద్దరూ బయటకు వచ్చి మళ్ళీ తాళం బిగించారు.

త్రోవలో ఆ దేవి గత చరిత్రని వివరించారు సీతారామయ్యగారు.

పూర్వపు రాణీ ఒకరు పుట్టింటి అరణాలతోపాటు తన ఇష్ట దైవమైన ఇ సర్వమంగళాదేవిని కూడా మెట్టినింటికి తెచ్చుకున్నదట.

మొదట ఆ విగ్రహాన్ని కపాలేశ్వరస్వామి వారి ఆలయంలో ఇప్పుడు విఘ్నేశ్వరుని విగ్రహమున్న మందిరంలో ప్రతిష్ఠించారు. ఆ దేవిని కొలుచుకునే నిమిత్తం ఆ రాణిగారి తదనంతరం కూడా రాణివాస స్త్రీలు ఘోషాలోనే అగుగాక అంతఃపురం వదలి తరచూ బయటకు వచ్చేవారు, ఇతర స్త్రీలతో కలిసేవారు.

ఆ పేరుమీద కొన్ని అవకతవకలూ, అవాంఛనీయ సంఘటనలూ కూడా జరిగేవి. ఆ అరాచకాల్ని అరికట్టేందుకు ఆ విగ్రహాన్ని అక్కడ్నించి పెకిలించి దివాణం ఆవరణలో పునఃప్రతిష్ఠించారు.

ఆ సమయంలోనే అప్పటి జమీందారుగారి అభిలాష మేరకు కలువకొలను నిర్మాణం జరుగుతోంది. పనిలో పనిగా ఆ శిల్పులతోనే ఈ ఆలయం కూడా కట్టించబడిందట.

"అలాగ స్వమంగళాదేవి దర్శనం దివాణం వరకే పరిమితమయిపోయింది" కాస్త ఆగి గొంతు సరిచేసుకుని అన్నారు" వారి మూల పరుషులు కొలచిన దైవతాలుగా వంశానుగతంగా వారికి సంక్రమించిన సాలిగ్రామాలతోపాటు ఈ అమ్మవారికి కూడా పూజాది పునస్కారాలు మీ తాతగారే నిర్వహించేవారు. ఆ తరువాత మీ తండ్రీ, నీ భర్తా కూడా ఈ వంకనే దివాణానికి దగ్గరయ్యారు."

గతకాలపు ప్రస్తావన తింటున్న ముద్దలో గులకరాయి వచ్చినట్లుకాగా మూగబోయింది హేమ.

నిట్టూర్చారు సీతారామయ్యగారు.

"ప్చ్! దేనికైనా కాలం కలిసిరావాలి. వెయ్యిగొడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకి కూలిందని సామెత. ఎదురు ప్రశ్నించే వాళ్ళు లేక తామే సర్వంసహాధికార్లమని విర్రవీగుతూ ఎందరినో తినే తిండికి కాకుండా, వున్న వూరికి లేకుండా వెళ్లగొట్టిన రాజాలు ప్రభుత్వంవారి ఒక్క కలంపోటుతో శాశ్వతమనుకున్నదంతా వదలుకుని దేశాలు పట్టుకుపోయారు. అలా వెళ్లిన వాళ్ళు మళ్ళా ఇటుకేసిగానీ, ఈ దైవంకేసిగానీ తిరిగి చూసిన పాపాన పోలేదు. ప్చ్! వాళ్ళ తిప్పలు వాళ్ళవి. ప్రాధాన్యత తగ్గిపోతున్న తమ ఉనికిని భద్రం చేకుకోవడానికే ఎంత సమయమూ ఆ రాజులకి చాలడం లేదు. ఇక ఈ వేలుపుల సంగతి పట్టించుకునే తీరికెక్కడిది?"

"తాళం మీకెలా వచ్చింది?" కుతూహలంగా వింటూ ప్రశ్నించింది హేమ.

దారిలో పడుకున్న కుక్కను అదిలించి తిరిగి కొనసాగించారు సీతారామయ్యగారు.

"తాళం దత్తాత్రేయులుగారికిచ్చారు. దీపారాధన ఖర్చన్నా వంవకపోతే ఈయనమాత్రం ఏం చేస్తాడు? తాళం తీయడమే మానుకున్నాడు. బంగారు పళ్ళాని కన్నా గోడ చేరిక కావాలట. ఈ కలికాలంలో వేలుపులు కూడా ఏలినవారి ప్రాపకం ఉంటేనే మహిమలు వెళ్లార్చేది. అది లేకనే ఈ సర్వమంగళాదేవి ఇలా మూలన ఉండిపోయింది. పార్వతీశం సమస్యకి తరుణోపాయం ఏమిటా అని వెదుకుతూంటే దివాణంలో ఈ దేవి మందిరం వున్న వైనం గమనానికొచ్చింది.

ఇక్కడయితే అతన్ని లోపలికి రావద్దనే వాళ్లూ, అతని ధ్యానానికి అంతరాయం కలిగించేవాళ్ళూ ఉండరు. అటు ఎవరికీ ఇతనివల్ల పేచీ ఉండదు అని ఆలోచించి నిన్ననే దత్తాత్రేయులుగారినడిగి తాళం చెవి తీసుకున్నాను."

అందర్నీ తనవాళ్ళనుకునే మంచితనం పాతతరం వాళ్ళ రక్తంలో ఎక్కువపాళ్ళు వుంటుందేమో! లేకపోతే తమ సమస్యలు గురించి అంత శ్రద్ధ వహించదానికి తమకూ ఆయనకూ ఏమీ బంధుత్వమున్నదనీ!

హేమ మననులోనే నమస్కారాల ర్పించిందాయనకు.

సందె దీపం వెలిగిన కాస్సేపటికే సద్దుమణిగిపోయి నిద్రకొరిగే ప్రయత్నంలో వుంది ఊరు.

హేమని ఇంటి దగ్గర దిగబెట్టి "రేపు పాలేర్ని పంపుతాను. ఆ గుడి శుభ్రం సంగతి చూస్తావుకదూ" అని హెచ్చరించి తమ ఇంటివైపుగా సాగిపోయారు సీతారామయ్య గారు.

● ● ●

సీతారామయ్యగారికి అనుమానమే-

అప్పుచేసి ఇంటికి సున్నాలు వేయించి అరిసెలు, సున్నుండలూ వండాక అల్లుడు పండక్కి రానని కబురు పింపినట్టుగా ఇన్ని ఏర్పాట్లూ చేసాక పార్వతీశం 'ససేమిరా ఆ శివుడి గుళ్లో దాక్షాయణీదేవినే ప్రార్థించు కుంటానుగానీ ఈ దివాణంలో సర్వమంగళా దేవిని సేవించను' అని రలాయిస్తేనో అని.

కానీ ఆయన ఊహను అపోహ చేసాడు పార్వతీశం.

సర్వమంగళాదేవిని చూస్తూనే ఆనందంతో తలమునకలయ్యాడు అతగాడు. "నా కల్లో దర్శనమిచ్చింది ఈ దేవతే బాబాయ్" అంటూ పరవశించిపోయాడు. "అసలు ఎంత మందభాగ్యుడ్ని కాకపోతేనే పూజించిన దైవాన్ని నేనే ఎలా విస్మరించానిన్నాళ్ళూ" అని విస్తుపోయాడు, వాపోయాడు.

సీతారామయ్యగారి ముందు సాష్టాంగపడిపోయి "నా తల్లిని నాకు చూపించావు. నీ రుణం తీర్చుకోలేనిది బాబాయ్" అన్నాడు తడిచేరిన కంఠంతో.

"రక్షించావ్" అనుకున్నారాయన తేలికపడి.

ఆ సర్వమంగళాదేవి మహత్యమో ఏమోగానీ ఆమె సన్నిధి చేరుకున్నాక పార్వతీశంలో ఆనూహ్యమైన మార్పు వచ్చింది.

ఎడారిలో నీటి చెలమలు అన్వేషించే దాహార్తునిలా ఎల్లప్పుడూ అస్తిమితంగా ఆరాటంగా జననీ అనో, మాతా అనో పలవరించేవాడు. ఇప్పుడు జనసముద్రంలో ఈదుతున్నా తల్లి వేలువదలని పసిబాబులా నిర్భీతిగా ధీమాగా కనబడుతున్నాడు, కుదుటపడినట్లుగా తెరపిగా ఉంటున్నాడు.

అవిరామంగా కొనసాగిస్తుండే పూజలకీ, ధ్యానానికి ఓ హద్దూ పద్దతీ ఓ సమయమూ ఏర్పడ్డాయి.

సదా అరమూసి ఏ దివ్యలోకాల అవలోకనంలోనో వున్నట్టుండే నేత్రాలు ఇప్పుడు విప్పారి ఇహలోక వీక్షణం గావిస్తున్నాయి.

"తమ్ముడీమధ్య నన్ను రోజూ పలకరిస్తున్నాడు బాబాయ్. భోజనం చేశావా లేదా అని అడుగుతున్నాడు. మునుపు కంచం ముందు కూర్చున్నా, అన్నం పెట్టినా, పరిమాన్నం పెట్టినా కడుపునింపుకోవడానికి ఏదయినా ఒకటే అన్న ధోరణిలో నిర్లిప్తంగా తినేవాడు. ఇప్పుడలా కాదు, నచ్చిన వంటకాన్ని బావుందని మెచ్చుకుంటున్నాడు. అడిగి మరీ వేయించుకుంటున్నాడు. తమ్ముడు మనుష్యుల్లో పడుతున్నాడు బాబాయ్" పరమానందంగా సీతారామయ్యగారితో చెప్పింది గాయత్రి.

దివారాత్రులు బాధిస్తూ శస్త్రచికిత్సకుగాని లొంగదనుకున్న వ్యాధి పెరటిమొక్క వైద్యంతోనే గుణం కనిపించినట్లుగా సీతారామయ్యగారు కూడా సంతోషించారు.

"పొలం పనులేమన్నా వుంటే నాతో చెబుతుండు బాబాయ్. చూస్తాను అని నాతోనూ అడుగుతున్నడు అమ్మాయ్" చెప్పారాయన.

"నేననుకోవడం ఏమిటంటే బాల్యం విడిచి వయస్సులో ఆ సర్వమంగళాదేవిని ఉపాసించాడు పార్వతీశం. ఆ కారణంగా ఆ తల్లిమీద భక్తిభావం వాడి మనస్సులో గాఢంగా పాదుకుపోయి వుంటుంది. ఈ ఊరు వదిలినా ఎక్కడెక్కడో తిరిగినా ఆ అమ్మవారిమీద నాటుకున్న ఆ పవిత్రభావన మాత్రం అతనిలో కరిగిపోలేదు సరికదా సాధు సన్యాసుల సంపర్కంలో అతర్లీనంగా వున్న ఆరాధన అంతకంతకూ అధికమై ఉండాలి. అందుకు నిదర్శనమే స్వప్నంలో ఆ దేవే రూపం ప్రత్యక్షమై తిరిగి తన వద్దకు రమ్మని ప్రేరేపించడం. వచ్చిన చిక్కేమిటంటే ఈ వూరొచ్చి కపాలేశ్వరుని గుళ్ళో దాక్షాయని ఎదురుగా పద్మాసనం వేసుక్కుర్చున్నాడు గానీ వాడికక్కడ చిత్తశాంతి లభించలేదు.

కారణం ఎడతెగకుండా వచ్చిపోయే జన సందోహం, వాళ్ళు సృష్టించే కోలాహలం, వద్దువద్దంటున్న జాతి శత్రువుల తిరస్కారం, వీటన్నిటిమధ్యనా వాడి ధ్యానానికి ఏకాగ్రత కుదిరి ఉండదు. చెదిరిన మనస్సుని ఎన్ని సందేహాలు కలవరపెట్టాయో పాపం! బహుశా తనకి కల్లో కనిపించిన రూపానికీ, ఈ దాక్షాయణీదేవి ఆకృతికీ పోలికలు వెతుక్కుని వుంటాడు. తనని రారమ్మని పిలిచిన తల్లి ఈమేనా అని అనుమానపడి కూడా ఉంటాడు. ఆ యాతనలో మిగతా లోకాన్ని పట్టించుకోనిచ్చుండదు వాడి మనసు. మనం సర్వమంగళాదేవిని చూపించడం వాడి ప్రాణానికి కిక్కిరిసిన బండిలో ఎటు వెడుతున్నదీ కూడా తెలీని పరిస్థితిలో ప్రయాణిస్తున్న వాడ్ని హఠాత్తుగా బండాపి ఏసి కారులో బదలా యించినట్లుగా ఉంది. గమ్యానికి చేరిన పాంథునిలా ప్రశాంతిగా, విశ్రాంతిగా ఉన్నాడిప్పుడందుకే. తల్లి కనిపించనంతవరకూ ఏడ్చిన పసివాడు అమ్మ వడి చేరుకున్నాక చిరునవ్వులు ఒలకబోస్తూ గిలక్కాయలకేసి, లక్కపిడతలకేసి చూపు తిప్పినట్లుగా సమస్య తొలగింది కాబట్టి ఇక దృష్టి మిగతావాటిమీదకి మరలుతోంది నీ తమ్ముడికి" పార్వతీశం ప్రవర్తనమీద సుదీర్ఘమైన వ్యాఖ్యానం చేసారు సీతారామయ్యగారు. "నీ బెంగ తీరినట్టే కదా గాయత్రీ! ఇక అమ్మమ్మ అవడమే ఆలస్యం" సీతారామయ్యగారి చివరి మాటకు దరహాసంతో విచ్చుకోబోతున్న గాయత్రి పెదవులు తిరిగి ముడుచుకున్నాయి.

"అయ్యో రామా! పెళ్లాం దగ్గర ప్రవరాఖ్యుడే నా తమ్ముడు. ఇంకెక్కడ మనవడు బాబాయ్" నిట్టూర్చింది. ఇప్పటికీ హేమ దగ్గర మునుపటి పంథా విడువలేదు ఈశుడు. అదేమిటో భార్య అన్న జీవపదార్థం ఒకటి ఇంట్లో తిరుగుతున్నదన్న స్పృహే ఉన్నట్టుండదు వాడికి. ప్చ్. వాళ్ళ మధ్య సయోధ్య ఎప్పటికి కుదిరేను? మీ దీవెన ఎప్పటికి ఫలించేను" ఇంకో నిట్టూర్పు విడిచింది గాయత్రి.

"పొయ్యిమీద కుండ పెట్టగానే ఆకు వేసుకుని ఆకలంటే ఎలాగ ! బియ్యం పొయ్యాలి, ఉడకాలి, వార్చాలి, ఉమ్మగిల్లాలి. అద్దద్దా అంటే విస్తట్లోకి అన్నమెలా వస్తుంది? సమయం పడుతుంది. ఓపిక పట్టాలి" అన్నారు సీతారామయ్యగారు.

వీరి ఆలోచనాభిప్రాయల్నిగానీ, అతని ఉపేక్ష అనాదణాల్నిగానీ పట్టించుకునే తీరిక ఉంచుకోవడంలేదు హేమ.

భవిష్యత్ అగమ్మగోచరంగా అగుపిస్తున్న ఆ సమయంలో ఆశ్రమవాసుల సహవాసం ఆమె కల్లోలిత హృదయాన్ని చల్లబరిచి సేదదీర్చే వటవృక్ష ఛాయ అయింది.

స్వామిగారి అభ్యర్ధన మేరకు ఆ ఆశ్రమంలోని పిల్లలకు ఓ గంట చదువు చెప్పడంతో ప్రరంభించి నెమ్మది నెమ్మదిగా ఆశ్రమం తాలూకు అన్ని పనుల్లోనూ జొరబడిపోయి ఆశ్రమ నిర్వహణలో కుమార స్వామిగారికి కుడిచెయ్యి అయిపోయింది హేమ.

ఇప్పుడు హేమకి క్షణం తీరుబాటు ఉంటంలేదు. మునిమాపు వయసులో వున్న అక్కడి ముదునలులకి ఉదయాన్నే ఉషాబాలలా వెళ్లి సుప్రభాతం చెబుతుంది.

వారు చేసుకునే పనుల్లో చేదోడువాదోడవుది. వారి ఆహార విహారాల్లో తగు జాగ్రత్త తీసుకుంటుంది. చెణుకులు, ఛలోక్తులూ విసురుతూ కబుర్లు చెబుతూ స్తబ్దత పేరుకున్న వారి మొహాల్లో చిరునవ్వులు మొలకెత్తిస్తుంది

ఇక పిల్లల దగ్గరకొచ్చిందంటే సర్వం మరచిపోతుంది హేమ.

తాము విధివంచితులమన్న విషయాన్ని కూడా గుర్తించలేని అమాయత్వంలో ఉరకలు వేసే ఉత్సాహానికి చాలా అభిమానం.

పన్నెండేళ్ళలోపునించి పధ్నాలుగేళ్ల వయసున్నవరకూ వున్న ఆ పదిమంది పిల్లపకూ ఒక్కొక్కదీ ఒక్కో చరిత్ర.

అందరిలోకీ పెద్దవాడయిన అభిలాష్ తాత కూడా ఈ వృద్ధాశ్రమంలోనే ఉంటున్నాడు.

కోటయ్య పుట్టంధుడు. భార్యపోయాక ఉన్న ఒక్క ఎకరాన్నీ కూతురుకిచ్చి కలోగంజో ఆమె పోసింది తాగుతూ కాలం గడిపేవాడు.

దురదృష్టవశాత్తు ఆ గొడుగు నీడ కూడా కరువు చేసాడా భగవంతుడు.

కాన్పు కష్టమై కూతురు కన్ను మూసింది. మూడు వారాలు తిరక్కుండా మరొకామె మెళ్ళో తాళి కట్టాడు అల్లుడు. పుట్టిన పసిగుడ్డతోసహా మామని పక్కవూర్లో వున్న ఈ ఆశ్రమంలో దింపేసి చేతులు దులిపేసుకున్నాడు.

ఆశ్రమంలో మొదట చేరిన పసివాతనే. అభిలాష్ అన్న పేరు పెట్టింది స్వామిగారే.

రెండోవాడు ఆకాష్.

సోగకళ్ళు, రాగిజుట్టు, పెద్ద బుగ్గలు, వెడల్పు మొహం, తెల్లని ఛాయ. చూడంగానే విదేశీయులు బిడ్డగా తోచే ఆకాష్ ఢిల్లీనుంచి వస్తున్న రైల్లో స్వామి వారికి దొరికాడు.

"ఉంచి వెళ్లండి ఎంక్వయిరీ చేస్తాం" నిర్లక్ష్యంగా అంటున్న పోలీసుల చేతికి ముద్దుల మూటకడుతున్న ఆ బాలుడ్ని అప్పగించలేకపోయారాయన. అతని పేరెంట్స్ వస్తే తనవద్దకు పంపమని చెప్పి అడ్రస్ ఇచ్చి బాబుని ఆశ్రమానికి తెచ్చుకున్నారు. ఆ తరువాత ఎన్నోసార్లు వెళ్లి వాకబు చేస్తూనే ఉన్నారు. కానీ అప్పటికీ అతను మావాడంటూ వచ్చి నవాళ్ళే లేరు.

'కుప్పతొట్టెలో కళ్ళు తెరవని పపిపాప' అనో, 'కుక్కలు పీకుతున్న బొడ్డూడని పసికందు' అనో పేపర్లో పెడ్డింగులు వస్తే విడ్డూరంగా చదువుతాం. నిజంగా కుప్పతొట్టెలో, పట్నంలో ధర్మాసుపత్రి పక్కన డస్టబిన్లో బ్రతికుండగానే పారేయబడ్డ నిర్భాగ్యపు బిడ్డలు ఈశ్వర్, ఉదయ్లు.

అదే సమయానికి ఆశ్రమంలోని ఒక వృద్ధునికి వైద్య సౌకర్యం నిమిత్తం వెళ్లిన స్వామిగారు కక్కటిల్లిపోతున్న వాళ్లిద్దర్నీ కౌగిట్లోకి తీసుకుని చోద్యం చూస్తున్న జనం మధ్యనుంచీ ఆశ్రమానికి తీసుకువచ్చారు.

ఇక రమణ, రజాక్లు స్నేహితులేకాదు, జేబుదొంగతనాల్లో తోడుదొంగలు కూడా.

ఓసారి ఆశ్రమం కోసం పట్నంలో పరుకులు కొనివస్తున్న స్వామివారి కాళ్లకు చుట్టుకున్నాడో పిల్లాడు.

కారిపోతున్న కన్నీళ్ళు, వెక్కిళ్ళు పెడుతున్న గళం, వళ్లంతా దుమ్ము, నెత్తురు... వాడే రమణ!

రద్దీగా వున్న బస్టాండ్లో ఎవరిదో పర్స్ కట్టేస్తూ పట్టుబడిపోయాట్ట!

"చావగొట్టేస్తున్నారు బాబూ రక్షించండి. మరింకెప్పుడూ అలాంటి పని చేయను" బావురుమంటూ కాళ్ళు పట్టుకుని వేడుకున్నాడు వాడు.

హింస అన్న పదం విన్నా మొహం అదోలా పెట్టే సామాన్య మానవుల్లో సైతం నిగూఢంగ ఉండి సాకు దొరికితే చాలు వికృతంగా బయటకురికే శాడిజానికి నిదర్శనంగా ఉంది వాడి ఒళ్ళు.

చూసి కరిగి నీరయ్యారు స్వామిగారు.

తరుముకుని వచ్చిన జనానికి "మీదు నా మేనల్లుడు. చెడు స్నేహాలు పట్టి ఈ విధంగా తయారయ్యాడు. దయుంచి వదిలేయండి బాబూ. నేను దారిలో పెడతాను" అని ప్రాధేయపడి వారిని పంపించివేసారు.

ఆ తరువాత రమణని సరాసరి గుళ్ళోకి

తీసుకువెళ్లి దేవుడి ఎదుట మళ్లీ ఇట్లా దొంగతనాలు చేయనని ప్రమాణం చేయించారు.

'ఇక ఇంటికి వెళ్ళు' అని వాడ్ని వదిలి వచ్చేస్తుంటే రెండోసారి కాళ్ళకడ్డం పడ్డాడు రమణ.

''నేను ఏ వెధవ పని చేసినా ఫర్వాలేదుగానీ రోజుకు వందో ఏభయ్యో తీసుకెళ్లి ఇవ్వకపోతే మా అమ్మా నాన్నా నా చర్మం వలిచేస్తారు బాబా. దేవుడి ముందర మీరు చేయించిన వాగ్దానం నేను మారకుండా ఉండాలంటే నన్ను వాళ్ళకు దొరక్కుండా తీసుకుపొండి బాబా" అన్నాడు.

నిర్ఘాంతపోయాడు స్వామిగారు 'లోకంలో ఎలాంటి తల్లిదండ్రులున్నారు' అని.

రమణని ఆశ్రమానికి తీసుకువచ్చేసారు. రెండురోజుల తరువాత వాడి తండ్రి తుఫానులా వచ్చి పడ్డాడు.


"నా కొడుకుని నా క్కాకుండా చేస్తారా" నా కడుపు కొడతారా?" అని ఒకటే గొడవ "ఏం చేస్తానో చూడండి. అల్లరి చేస్తాను, బజార్నపెడతాను" అని అరుపులు.

అతనికి శతవిధాల నచ్చచెప్పి సముదాయించి, బెదిరించి, ఆశపెట్టి చివరికి కొంత సొమ్ము చేతిలో పెట్టి పంపించేసరికి తల్లో ప్రాణం బొటనవేలి చివరికి చేరుకుంది స్వామిగారికి.

ఇప్పుడప్పుడు వచ్చి పీడించో, కొడుకుని తీసుకుపోతూనే వుంటాడు రమణ తండ్రి.

స్నేహితుడ్ని చూడ్డానికి రచూ వచ్చి పోతుండే రజాక్ కూడా ఒక సముహూర్తాన ఆశ్రమంలో సెటిలైపోయాడు.

రజాక్ నా అన్నవాళ్ళులేని అనాధ.



గాలికి పుట్టి ధూళికి పెరిగాడన్న సామెతలా పేవ్ మెంట్ మీద కళ్ళు తెరిచాడు రజాక్. ముష్టివాళ్ళు విదిలించి ముష్టితో ఎదిగాడు. రెక్కలొచ్చాక కష్టపడకుండా కడుపు నింపే వృత్తిగా దొంగతనమొక్కటే కనిపించింది. రమణకి చెదోడువాదోడుగా ఉండి భాగం పంచుకుని బ్రతికేసేవాడు.

రమణ వెళ్ళిపోయాక వంటరితనం గిలగిల్లాడించింది వాడ్ని. చీటికీ మాటికీ మాజీ పార్టనర్ కోసం ఆశ్రమానికి పరుగెత్తుకువచ్చేవాడు. వెనక్కివచ్చేయమని వాడ్ని బలవంతపెట్టేవాడు.

కానీ మెల్లమెల్లగా అతనిలోనే మార్పొచ్చింది.

ఆవేశకావేషాలకు అతీతంగా క్రమబద్ధంగా సాగే ఆశ్రమ జీవితం, ఎటువంటి కాలుష్యానికీ తావీయని అక్కడి ఆరోగ్యకరమైన వాతావరణం, నీతినియమాలు, అవసరమైన కట్టుబాట్లు మనిషి మనుగడకెంత అవసరమో, సుఖప్రదమో మనసుకు హత్తుకునేలా మంచివైపుకు మరలించేలా విపులీకరించి చెప్పే స్వామిగారి బోధనలు, వాడ్ని చాలా ఆకర్షించాయి. ఆశ్రమానికి కట్టిపడవేసాయి.

మిగిలి ఇద్దరిలో ఒకరు స్వామిగారి దగ్గర బంధువుల పిల్లవాడే.

సవతి తల్లి అసహనానికి నిర్దాక్షిణ్యంగా బలి అవుతుంటే చంద్రం ఆమె కౌర్యం మితిమీరిన ఒకవేళ ఇంట్లోనుంచి పారిపోయి ఆశ్రమానికి వచ్చేసాడు.

లోకం తమని కొడుకుని ఇంటికి పంపించేయమని ఎన్నో సార్లు స్వామిగారిమీద వత్తిడి తీసుకువచ్చారు.

'దయామయుడనే పేరుకోసం స్వామిగారు తమ బిడ్డని తమకి వ్యతిరేకం చేసి నాటకమాడుతున్నాడు అని నిందలు వేసారు.

స్వామిగారు చలించలేదు. చెడ్డపేరు వస్తుందేమోనని బెదరనూలేదు. పైపెచ్చు నవ్వుకున్నారు.

"ఎందుకయ్యా రభస చేసి మిమ్మల్ని మీరే బయటపడేనుకుంటారు. వాడు నా స్వాధీనంలో వున్నంత మాత్రన మీ కొడుకు కాకుండా పోతాడా? వాడు అల్లరిపిల్లవాడని మీరే కదా అంటున్నారు. నేను వాడ్ని మారుస్తాను. యోగ్యుడిలా తయారుచేస్తాను. అప్పుడు పంపిస్తాను. తీసుకెళ్లండి. మీ కొడుకును మీ దగ్గరే వుంచుకోండప్పుడు. ఇప్పుడు మాత్రం మీరేమన్నా పంపించేదిలేదు" మృదువుగానే అయిన దృఢంగా చెప్పేసి వాళ్ళని ఒప్పించి పంపేసారు.

ప్రస్తుతానికి ఆశ్రమంలో ఆఖర్న చేరినవాడు రవి. క్రితంసారి వచ్చిన ఉప్పెనలో కన్నవాళ్లతోనహా సర్వం పోగొట్టుకున్న అభాగ్యుడు. విపరీతమైన నత్తి. అందువల్ల అట్టే మాట్లాడడు. మృదుస్వభావి. స్వామిగారితోనహా వాడంటే అందరికీ ప్రత్యేకమైన అభిమానం.

ఈ పిల్లలందరికీ స్వామివారు తల్లిదండ్రీ, గురువూ, దైవం.

ఇక ఆయనకైతే ఈ పిల్లలు పంచప్రాణాలు, వారి భావి జీవితం ఉన్నతంగా ఉండాలనీ, వాళ్ళకొక స్థానం తేవాలనీ ఆయన తపన. అందుకోసం బాధ్య తీర్చుకోవడం అన్నట్లుగా కాక ఆప్తుడిలా, శ్రేయోభిలాషిగా అహరహమూ శ్రమిస్తారాయన.

సూర్యుడు పశ్చిమానికి వాలేటందుకు సన్నద్ధమవుతున్నాడు.

వెళ్తూ వెళ్తూ జారిపోతున్న ప్రతాపాన్నంతటినీ కూడ దీసుకుని కళ్ళెర్రచేసి ఎర్రగా చూసే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ సాయం సంధ్యతోపాటు వచ్చిన శీతల పవనాలు తీక్షణతని తగ్గించి నులివెచ్చన చేసేస్తున్నాయి.

ఆశ్రమంలో రావిచెట్టు చుట్టూరా వున్న తిన్నమీద కూర్చుని పిల్లలకు పాఠాలు చెబుతూ నోట్స్ ప్రిపేర్ చేస్తున్నది హేమ.

ఈశాన్యంవైపు బావి దగ్గర స్వామి గారు నీళ్ళు తోడి పోస్తుంటే ఓపిక వృద్ధులు కొందరు తూముల్లోంచి వస్తున్న ఆ నీళ్లని చెట్లపాదుల్లోకి మలుపుతున్నారు.

ఇద్దరు ఆడవాళ్ళు ఆవరణంతా చిమ్ముతుంటే మరిద్దరు దుమ్ము అణిగేలా నీళ్ళ చల్లుతున్నారు.

అరగంట గడిచేలోపల చెట్లమీద పక్షుల కలకలం ఎక్కువవడంతో "ఈ వేళకి చాలుగానీ వెళ్ళి ఆడుకోండి. రాత్రికి చెప్పినంతవరకూ నోట్సు బాగా చదివితే రేపందులో క్వశ్చన్స్ వేస్తాను" అంటూ పిల్లల్ని ఆటకు పంపేసింది హేమ.

దక్షిణంవైపు వీళ్ల ఆటలకోసం విశాలమైన స్థలం ఖాళీగా వుంచి శుభ్రం చేయించారు స్వామిగారు. బ్యాట్మింటన్ వేయించారు. పిల్లలు ఆ స్థలం వైపు గోలగా పరుగెత్తారు.

హేమ వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతూ స్వామిగారికి చెప్పాలనుకున్నంతలో ఆయన కూడా పని ముగించి అక్కడికే వచ్చారు.

"వెళ్తున్నావా హేమ? ఒక్క నిముషం వచ్చేస్తున్నాను" అన్నారు.

లేచిన హేమ తిరిగి కూర్చున్నది.

పంక్తి భోజనాల్లో వడ్డించిన ఆకుల ముదు కూర్చున్నవాళ్ళల్లే కుదుళ్ళనిండా నీళ్లతో మొక్కలు తృప్తిగా తలలూపుతున్నాయి.

ఆగ్రహంతో రేగుతున్న నేల తల్లి చల్లిన నీళ్లతో చల్లబడి సువాసన లీనుతోంది.

చేతులు కడుక్కుని వచ్చి కూర్చుంటూ సంభాషణకు ఉపక్రమించారు స్వామిగారు.

కాస్సేపు ఆ మాటా మాట్లాడాక "అన్నట్లు ఈ మధ్య మీ మామయ్య గుళ్ళోనేకాక బయట కూడా కనిపిస్తున్నాడు సుమా! నిన్న ఊరి బయట ఎవరితో మాట్లాడుతుంటే చూసాను" అన్నారు స్వామిగారు ఏదో వెదుకుతున్నట్లుగా ఆమె మొహంలోకి చూస్తూ.

కాలక్షేపం కోసం వ్యక్తిగత విషయాల జోలికి పోవడం, అనవసరపు కబుర్లాడడం స్వామిగారి తరహా కాదు. అది హేమకు బాగా తెలుసు.

ఓ క్షణం వింతగా చూసి "అవును. కరణం తాత పొలం పనులేవో చెబుతోంటే ఎప్పుడేనా అటు వెడుతున్నారట" ముభావంగా సమాధానం చెప్పింది హేమ.

"ఊహూ...వాళ్ళ పొలం దగ్గరా, మీ పొలం దగ్గర కూడా కాదు. వాగు దగ్గర. వెంట ఇంకో ఇద్దరున్నారు."

"కూలివాళ్ళేమో!"

"అయ్యుండదు. అలాలేరు. అసలీ ప్రాంతం వాళ్ళలా లేరు వాళ్ళు."

'ఏమిటాయన అనుమానం? ఎందుకోసమీ ప్రస్తావన?'

"ఏమో మరి?" నిరానక్తంగా తుంచేసింది హేమ. అయిదు నిముషాలు ఇతర విషయాలేవో మాట్లాడుకున్నారుగానీ ఆయన తటపటాయిస్తున్న విషయాన్ని బయట పెట్టనేలేకపోయారు స్వామిగారు. లేచింది హేమ "అమ్మ ఎదురుచూస్తుంటుంది" అంటూ.

ఆశ్రమం వదిలి దివాణం పక్కంటే వచ్చేటప్పుడు ఆమెకి తెలీకుండానే చెవులు ఒరగిల చేసింది హేమ. ఏ విధమైన సవ్వడీ వినరాలేదు. నిట్టూర్చి అడుగు ముందుకేసింది. 'స్వామిగారు అడగాలనుకున్నది ఏమిటి? లేక ఆ అపరిచితులు ఎవరనా? ఇంతకీ ఆగంతకులు ఎవరు?

తను తిగిగొచ్చిన వూళ్లల్లోని పూర్వపు పరిచయస్తులా?

వాళ్ళనయితే ఊరి బయట కలుసుకునే అగత్యమేమిటి? ఇంటికి తీసుకురావచ్చును గదా!

వాళ్లొచ్చి వెళ్లిన సమాచారాన్ని కనీసం అమ్మ దగ్గర కూడా గోప్యంగా ఎందుకు ఉంచినట్టు?'

ప్రశ్నలు! ఎన్నో ప్రశ్నలు హేమ బుర్రని గజిబిజి చేసేశాయి.

సందెవాకిట్లో ముగ్గువేస్తోంది గాయత్రి.

పరధ్యానంగా ఆలోచిన్తూ వస్తున్న కూతుర్ని చూసి "నీ కోసం చూసి చూసి ఇప్పుడే వెళ్ళాడే కరణం బాబాయ్!" అన్నది.

"అరెరే..." నొచ్చుకున్నది హేమ.

జోళ్ళు విడిచి అరుగుమీద కూర్చుని గోడకి జార్లబడుతూ "ఇందాకే బయలుదేరానమ్మా! స్వామిగారు మామయ్య సంగతి ఏదో మాట్లాడుతుంటే ఆలస్యమయిపోయింది" అన్నది.

"మామయ్య విషయమా?" ముగ్గు వేయడానికి ఒంగి వున్న గాయత్రి లేచి నిలబడుతూ నొసలు చిట్లించింది.

"అమ్మా! మామయ్యలో హఠాత్తుగా కలిగిన మార్పు అందరికీ ఆశ్చర్యంగానే కాదు, అవాస్తవికంగా కూడా అనిపిస్తోందనుకుంటాను."

"ఎందుకనుకుంటున్నావలాగ! ఏమన్నారు స్వామిగారు?" దగ్గరగా వచ్చి నిలబడుతూ ప్రశ్నించింది గాయత్రి.

ఆమె గుండె గుబగుబలాడింది కూతురేమి చెబుతుందోనని.

స్వామిగారు మొహమాటపడుతూ స్పష్టంగా వెలిబుచ్చలేక సంశయించిన వైనాన్ని చెబుతూ "ఈయనే కాదమ్మా! రామతారకంగారనీ... ఆశ్రమంలో ఓ మునలాయన రెండురోజుల క్రితం మామయ్యలాంటి వ్యక్తిని స్టేషన్లో చూసానన్నాడు."

"లాంటి మనిషినా... అంటే?" విస్తుపోయింది గాయత్రి.

"అంటేనా... అంటే రూపానికి అతను అచ్చు మామయ్యలానే ఉన్నాడట. కానీ వేషం మాత్రం పూర్తి విరుద్ధం. జీన్స్ ఫాంటూ, పువ్వుల షర్టు వేసుకున్నాడట. పైగా నోట్లో బీడీ కూడా..."

"ఛ... ఛ... వాడెవరో..." అసంకల్పితంగా చీత్కరించింది గాయత్రి.

'అహోర్నిశలూ దేవీ మంత్రం పునఃశ్చరణ చేసే తమ్ముడి నోటిలో బీడీముక్క ఆ మాటే ముల్లు గుచ్చుకున్నట్లుగా భరించలేక "ఊహూ వాడు కాదు. వాడయి ఉండడు" ఖచ్చితమైన నమ్మకంతో అంటూకూతురివంక చూసింది గాయత్రి.

అవునూ కాదూ అనలేదు హేమ. స్తబ్ధుగా ఉండిపోయింది.

కూతురి మౌనం గాయత్రిని చికాకు పరిచింది.

విసురుగా వచ్చి కూతురి దగ్గరగా చతికిలబడుతూ "అయినా ప్రొద్దున్న మధ్యాహ్నం సాయంత్రం మూడుపొద్దులా మనకళ్లెదురుగుండానే పట్టుపంచ కట్టుకుని దేవాలయానికి వెళ్లడం, రావడం చూస్తూనే వున్నాం. అవునా. ఇహ వాడెప్పుడు మన కళ్ళు కప్పి ఏర్లంటా స్టేషన్లవెంట షికార్లు చేస్తున్నాడంటావు. మాట్లాడవేమే!" అంటూ గదిమింది.

"బావుంది. నన్ను కసురుకుంటావేం. వాళ్ళన్నవేవో నీకు చెప్పాను. అంతే. నాకేం తెలుసు" చిరుకోపంతో లేచిపోబోయింది హేమ.

చప్పున చల్లబడిపోయింది గాయత్రి. చెయ్యి పట్టి కూతుర్ని ఆపుతూ "అది కాదే హేమా! కోపం తెచుకోకే. నన్నర్థం చేసుకో. వాడు నిన్న మొన్నటివరకు మన మధ్యకి ఎప్పుడు దిగి వస్తాడా అని మధనపడిచచ్చానా. అమ్మయ్య ఇన్నాళ్లకి బెంగ తీరిందీ అని గట్టిగా ఊపిరన్నా తీసానో లేదో మళ్లీ మొదలు వాడిమీద పితూరీలు. మొన్న దాసు కనబడి ఏదో అన్నాడు. ఇందాక బాబాయి, ఇప్పుడు నువ్వు. భయంతో మతి పోతోందే" ఒయాసిస్సు చేరామనుకుంటూనే "కాదు ఎండమావి". అని ఎవరో హెచ్చరించినట్టయి ధైర్యం దిగజారిపోయి తల పట్టుకున్నది గాయత్రి.

"తన కంప్లయింట్ మొదటిది కాదన్నమాట. అందుకేనా తల్లి అంత కటకటపడుతోంది."

"ఏం చెప్పాడమ్మా తాతయ్యా!" నింపాదిగా అడిగింది హేమ.

ఒక్కక్షణం తన్ని తాను సంభాళించుకుని చెప్పింది గాయత్రి. "పోస్ట్‌మేన్ రామ్మూర్తి తెలుసుగా. ఈశుడు అతనితో చెప్పాట్ట. తన పేర వచ్చిన ఉత్తరాల్ని తనకే ఇమ్మనమని."

"దాన్లో విడ్డూరపడాల్సింది ఏముంది?"

"విడ్డూరమా మరీనా! తనకొచ్చిన ఉత్తరాల్ని వీలయితే పోస్ట్‌మాస్టర్‌కి కూడా తెలీనీకుండా అన్నింట్లోంచి వేరుచేసి దాచి ఉంచమన్నాడట. ఎవ్వరికీ ఈ సంగతి ముఖ్యంగా మనకి చెప్పొద్దని కాస్త ఎక్కువ సొమ్మే అతనికి ముట్టచెప్పాడట. అవి చూస్తే హిందీలో ఉంటున్నాయిట. ఎటుపోయి ఎటొస్తుందోనని రామ్మూర్తి వచ్చి బాబాయితో చెప్పి వెళ్లాట్ట. ఇది విడ్డూరం కాదా" ఆవేశానికి ఆక్రోశం తోడయింది గాయత్రి కంఠస్వరానికి.

"నిజమా!" ఆశ్చర్యంతోనూ, అనుమానంతోనూ నొనలు ముడుచుకున్నాయి హేమకి.

అతనికి ఉత్తరాలు రాసేవాళ్లెవరు?

అది అంత రహస్యంగా అందుకోవలసిన అవసరమేమిటి? ఎవరికీ తెలీకూడని నిగూఢ సమాచారమేమి వుంటుందందులో? ఈ దాపరికంలోని మర్మమేమిటి?

సమాధానాలు దొరకని సందేహాలతో మెదడు మళ్ళీ బరువెత్తిపోతుంటే తల విదిలించింది హేమ.

"ఆ దాసేం అన్నాడమ్మా!" అడిగింది తరువాత.

"వాడిది మరి విపరీతం. ఈశుడి దగ్గర కత్తులు, కఠర్లు ఉన్నాయంటాడు" అన్నది కోపంగా గాయత్రి.

"కత్తులా?" ఉలికిపడింది హేమ.

"కత్తులంటే మోపులకొద్దీ ఉన్నాయని కాదే. ఒక కత్తే అనుకో. అయినా అది మాత్రం వాడి దగ్గరెందుకుంటుంది. చత్వారం వెధవ కాకపోతే" అన్యాయపు అభియోగం మోపాడన్నట్లు కినుకగా అంది గాయత్రి.

"అదినరే ఇంతకీ ఎప్పుడు ఎక్కడ చూసాట్ట!" వివరమడిగింది గాయత్రి.

"నిన్న పొద్దున్న గొడ్లని తోలుకుని దివాణం దగ్గరగా వెళుతుంటే మందిరంలో గంట మోగడం విన్నాట్ట.

'అయ్యోరు ప్రసాదం పెడతారేమోనని లోపలికెళ్లానమ్మా. ఓలమ్మా గుండెలవిసి పోయాయనుకో. అక్కడ మీ తమ్ముడి చేతిలో గంటతోపాటు ఇంత బారు కత్తి కూడా ఉందమ్మో. దడుచుకుని బయటకు లగెత్తా అంటాడు పిచ్చివెధవ. ఏం చూసి ఏమనుకున్నాడో.'

కర్రని చూసి కత్తి అనుకునేంత పనివాడుకాదు గానీ దాసు కాస్త వెర్రిబాగులవాడన్నమాట నిజం!

దాసు భ్రమించి ఉంటాడా? మరి స్వామిగారు, రామతారకంగారు వాళ్ళ అనుమానాల మాటేమిటి? వాళ్లు కూడా పొరపాటుపడే అవకాశం ఉన్నదనగలమా?

నిన్నమొన్నటిదాకా అంతులేని భక్తి పారవశ్యతా ప్రదర్శన. ఇప్పుడీ జాబుల దాపరికాలు. అపరిచితులతో భేటీలు, ఆయుధంతో సహవాసాలు, ఏమిటతని వింత చేష్టలకర్థం.

అతని అంతరంగ నిజస్వరూపాన్ని ఎలాగ కనిపెట్టడం? ఎవర్ని సంప్రదించడం? కూతురు ఆలోచనల్లో పడడంచూసి లోపలికి వెళ్లిపోయింది గాయత్రి.

ఆ రాత్రి అదే ఆలాపనతో పడుకున్న హేమకు అర్ధరాత్రి దాటాక ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది.

ఆ నిద్రాభంగానికి కారణమేమిటో అని వెతుకుతుంటే వినిపించిందో సన్నని అలికిడి. శబ్దం కాకూడదనే ప్రయత్నంలో అవుతున్న

చిరునవ్వడి.

దిగ్గున లేచి కూర్చుంది హేమ.

కొన్ని సెకన్ల విరామం అనంతరం వినవచ్చిన ధ్వని ఇంకొంచెం స్పష్టంగా సుపరిచితమైనదిగా... ఆ చప్పుడు ప్రహరీ గేటుది.

మంచం మీంచి రెండే అంగల్లో బయటి కిటికీ దగ్గరికి చేరుకున్నది హేమ.

ఆమెలో పొడసూపిన అనుమానం సత్యమే.

వచ్చిన్నాటినుంచీ బయటి అరుగుమీదే పడుకుంటూ ఉండే పార్వతీశం పక్కమీద లేడు. ఒక చేతిలో పెన్‌టార్చ్ మరో చేతిలో లావాటి కర్ర పిల్లిలా మెత్తగా అడుగులు వేసుకుంటూ గేటు తీసుకుని బయటకు జారుకుంటున్నాడు.

తల్లిని లేపాలనైనా తోచక స్థాణువులా చూస్తూ నిలుచుండిపోయింది హేమ.

❀ ❀ ❀

"ఏమిటీ అర్ధరాత్రివేళ నువ్వొక్కదానివీ అతన్ని వెంబడించి వెళతావా. మతిగానీ పోయిందా?"

సింహం గుహలోకి వెడతాను అని విన్నట్లుగా తుళ్లిపడ్డారు సీతారామయ్యగారు.

"ఔను భయమేముంది. నాముందు వెడుతూ అతను... అదే మామయ్య ఉండనే ఉంటాడుగా" అన్నది హేమ.

"బావుంది. ఎవరిమీద నిఘా వేయడానికి వెడుతున్నావో వాళ్ళే నీకు కాపలానా? తొందరపడి అంతసాహసం చేయకు" మందలింపుగా అన్నారు సీతారామయ్యగారు.

"మరెలా. ఏం చేద్దామంటారు?" ప్రశ్నించింది హేమ అసహనంగా.

"చూద్దాం, ఆలోచిద్దాం."

"ఇంకా ఎప్పుడు?" రెట్టించింది హేమ.

"అంత తొందరేం. సరే రాత్రికి నీ వెంట నేనూ వస్తున్నాను" అన్నారు సీతారామయ్యగారు ఒక నిర్ణయానికి వచ్చి.

"మీరా?" నసిగింది హేమ.

"నేనే మరి. నాకంటే నమ్మకస్తుడు నీకింకెవరు దొరుకుతారు చెప్పు" నవ్వుతూ అన్నారు సీతారామయ్యగారు.

ఆ నవ్వులో 'మీ కంటిని కాచే రెప్పను నేనుగాక మరింకెవ్వరు' అన్న భరోసా స్వచ్ఛంగా మెరుస్తోంది.

హేమ చిరునవ్వు నవ్వింది.

"ఆ మాట నేను కాదనగలనా తాతయ్యా! మిమ్మల్ని మించిన శ్రేయోభిలాషులు మాకు ఇంకెవ్వరు ఉన్నారు. కానీ నడిరాత్రి మిమ్మల్ని ఈ వయస్సులో నిద్ర పోనీయకుండా అటూ ఇటూ తిప్పి అవస్థపెట్టడమా అని తటపటాయింపు అంతే" అభిమానంగా అంది హేమ.

ఆ మాట నిజమే ఆయినప్పటికీ హేమకు సాయంగా మరొకరిని పంపిస్తే సంభవించే పరిణామాలు ఆయనకు తెలియనివి కావు.

అదసలే పల్లెటూరు. తెలిసిన విషయాన్ని ఊరంతా చాటింపు వేస్తేనేగానీ నిద్ర పట్టని అమాయకపు మనుషులు ఉంటారు. నోటినుంచి చెవికి మారినప్పుడల్లా ఉబుసుపోక ఆ సంగతికి కొత్తరంగు అద్దేనైజ గుణం వుంటుంది కొందరికి.

ఫలితం ఏ విషయంలోనైనా మూడో మనిషికి తావీయడమంటే ఇంటి గుట్టు రచ్చకెక్కించుకోవడమే అవుతుంది.

దానకంటే హేమ వెంట తను ఉండడమే యుక్తంగా వుంటుందని తోచిందాయనకి. స్వయంగా తనే వెళ్లడంలో ఇంకో ఉపయోగం కూడా వుంది. పార్వతీశం అంత రాత్రివేళలో ఎక్కడికి వెళుతున్నదీ, ఎందుకు వెళుతున్నదీ తనే కళ్లారాచూసి తెలుసుకుని అది కూడని దారి అయితే 'తప్పు నాయనా' అని అక్కడికక్కడే మందలించవచ్చు. ఏ దుష్టుల కోంప ముంచే వన్నుగడలోనో తెలియక ఇరుక్కోబోతున్నట్లయితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించి ఇవతలికి లాగవచ్చు.

ఎవరో చెప్పగా విని ఆ తర్వాతెప్పుడో తీసుకునే ప్రతి క్రియకంటే తక్షణం తీసుకునే చర్య ప్రభావం తప్పకుండా అధికంగా వుంటుంది.

ఇవన్నీ యోచన చేసారు సీతారామయ్య గారు.

రాత్రికి తను ఏ టైముకి వచ్చి ఎక్కడ కాపు కాచేదీ హేమకి చెప్పి పంపించేసారు.

అప్పట్నుంచీ మొదలైంది హేమలో సంచలనం.

ఏమవుతుందీ రాత్రి! ఎక్కడికెళుతున్నాడు మామయ్య. ఏ అడ్డుత్రోవ తొక్కుతున్నాడు. ఏమిటిది తాగుడా? జూదమా?

ఛ... ఛ అనుక్షణం దేవీ నామ జపిస్తూ ఉత్తముడనిపించుకుంటున్న మనిషి అంత అధమ స్థితికి దిగజారుతాడా?

అయినా చెడు పనికే అని ఎందుకు ఊహించాలి. ఏ మంచిపని చక్కబెట్టడానికో లేదా ఎవర్నో ఉద్ధరించడానికో అనుకోవచ్చుగా. ఊహూ... ఆయి ఉండదు. ఎందుకంటే మంచిపని చేయడానికి అందరూ గాఢ నిద్రలో ఉండే రాత్రి సమయంలో దొంగతనంగా ఇంట్లోంచి వెళ్లడమెందుకు?

కొంపదీసి గుడుంబా, భంగులాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డాడేమో. అలాంటి వ్యసనాలకి సాధుసన్యాసులు

బానిసలని తను విన్నది. బహుశా వాళ్ళ చుట్టూరా తిరిగిన వీళ్లకి ఆ అలవాటు పట్టుబడి ఉండవచ్చు.

వాటి సేవనం కొరకేనేమో ఈ నిశాచర విహారాలు. తనకు అవి నవ్లయ్ చేస్తున్నవాళ్లకేనేమో ఆ ఉత్తర ప్రత్యుత్తరాలు. అవి అందించవచ్చిన వాళ్ళేనేమో ఏటి దగ్గర స్వామిగారి కంటబడిన ఆగంతకులు.

లేకపోతే ఏ క్షుద్ర ఉపాసనలన్నా చేస్తున్నాడా కొంపదీసి. అమ్మో!

'ఛ్ఛ! తినబోతూ రుచులడగనేల? ఏమో ఏమో అనే ఈ సందిగ్ధమెందుకు? రాత్రికి అన్నీ తేలిపోతాయి కదా?' సమాధానపడింది.

పొద్దు పడమటికి వాలింది. పార్వతీశం స్నానం చేసి యథావిధిగా గుడికి బయలుదేరి వెళ్లాడు. అతని ముహంలో ఎప్పటి ప్రశాంతతే. ఎప్పటి ప్రసన్నతే.

అనవసరంగా అపోహ పడడం లేదుకదా' అనుకుంటూ వెనకటి సమాధానానికే వచ్చేసింది.

సాయంత్రమయితే చాలు ఏ పని చెప్పినా 'మళ్ళీ వస్తాను, తరువాత చేస్తాను, రేపు చూస్తాను' అని వాయిదాలువేస్తూ చెప్పుల్లో కాళ్లు పెట్టి ఎప్పుడెప్పుడు ఎగిరిపోదామా అన్నట్టు హడావుడి పడిపోతుండే కూతురు ఇవ్వాళ కాలక్షేపం కోసం తడుముల్లాడు తున్నట్టు 'బియ్యం ఏరి పెట్టనా, కూర తిరిగి పెట్టనా, ఇల్లు తుడిచి పెట్టనా' అంటూ కాళ్లకీ చేతికీ అడ్డం పడుతుంటే వింత పడ్డది గాయత్రి.

"అదేమి ఈ రోజు ఆశ్రమానికి వెళ్లవూ" ఉండబట్టలేక అడిగింది.

సమాధానం కోసం క్షణం వెతుక్కున్నది హేమ.

"ఊహూ... రేపట్నుంచీ పిల్లలకి పరీక్షలు పెడుతున్నారు. ఈ రోజుకి చదువుకొమ్మని వదిలేశాను" అన్నది తరువాత.

నిజమెంతా అని తర్కించలేదు గాయత్రి. అసలు హేమ అబద్ధం చెప్పిందన్న అనుమానం కూడా రాలేదామెకు.

రాత్రయిది. ఆకాశం మీదకు చుక్కలు షికార్ల కొచ్చాయి. గుడి నుంచి పార్వతీశం తిరిగి వచ్చాడు. ముగ్గురి భోజనాలు పూర్తయ్యాయి. గాయత్రి వంటిల్లు సర్దింది.

అటూ ఇటూ పని వున్నదానిలా తిరుగుతున్నదేగానీ హేమ దృష్టి అంతా పార్వతీశం మీదనే వుంది.

పార్వతీశం ఆరుగుమీద పక్క పరుచుకున్నాడు. అలవాటుగా పావుగంట ధ్యానం చేసుకున్నాడు. ఆ పిమ్మట నిద్రకు ఉపక్రమిస్తూ పది నిముషాల్లో సన్నపాటి గురక కూడా తీయసాగాడు.

కిటికీలోంచి అతను కనబడేలా తన పక్క సవరించుకుని పుస్తకం ఒకటి మొహానికి అడ్డుంచుకుని ఓ కన్ను అతని కదలికలమీదే వుంచిన హేమ ఆ డ్యూటీకీ కామాపెట్టి టైమ్ చూసింది.

పదిన్నర. వ్చ్. తనకు కళ్ళు మూసుకుపోతున్నాయి. కానీ ఇప్పుడు నిద్రపోతే సమయానికి లేవగలనా? ఆవులిస్తూ పక్కకు వత్తిగిల్లబోయి చీమ కుట్టి చురుక్కుమన్నట్లు మత్తు వదలించుకున్నది హేమ. నేను సరే. అతను లేస్తాడా. లేచి రహస్య సంచారానికి వెడతాడా? ఏమో రోజూ వెళ్లాలన్న రూలేముంది? అరెరే... హతాశురాలయింది హేమ. వేసిన ప్లానంతా నీరు కారిపోతుందనిపిస్తే ప్రాణం ఉసూరుమంది ఆమెకు.

అంతే వెడతాడో లేదో అనే ఉత్కంఠతో ఇక రెప్పలు మూతలు పడలేదు.

వాచీ పక్కనుంచుకుని టైము చూసుకుంటూ కిటికీ వంక చూపు సారిస్తూ తల్లి కదలడం లేదు కదా అని గమనించుకుంటూ వుండడంతో సమయం గడిచిపోయింది.

పదకొండు, పన్నెండు, పన్నెండున్నర, ఒంటిగంట, ఒకటింబావు.

'అయ్యో తాతయ్య నిద్ర వృధా' హేమ విచారం నగంలోనే ఆగిపోయింది. పార్వతీశం కదిలాడు. బిగుసుకుపోయింది హేమ.

* * *

కాసేపటి తరువాత-

ఇరువక్కలా వున్న ఇళ్లుకూడా నిద్రపోతున్నవా అన్నంత నిశ్శబ్దంలో నడిచిపోతున్నాడు పార్వతీశం.

గాలికి కదిలే చెట్ల నీడలతోపాటు కలసిపోయి కదులుతోంది అతని నీడ. ఆగాగి వెలిగి ఆరుతోందతని చేతిలోని బ్యాటిరీలైటు తళుక్కుంటూ ఎగురుచున్న మిణుగురులతో కలసిపోయి.

అలవాటుపడిన త్రోవ అడుగుల్ని తడబడనీయడం లేదుగానీ పక్కన వున్న ఇళ్లల్లో ఏ ఇంట్లోనుంచీ హఠాత్తుగా నిద్దట్లో తల్లి ఒడిలోంచి దూరంగా జరిగిన పసిబిడ్డ చటుక్కున మేలుకుంటూ కెవ్వుమన్న ఏడుపు వినిపిస్తేనూ-

నిద్రమానుకొమ్మమీద గూటిలో గువ్వపిట్ట నిద్రమత్తులో రెక్కలు టపటపలాడించి ప్రశాంతతను భగ్నం చేసినప్పుడు మాత్రం తటపటాయింపుగా ఆగి తిరిగి కార్యోన్ముఖుడై ముందుకు సాగుతున్నాడు.

పార్వతీశాన్ని కనుమరుగు కానీయకుండా

వెంటపడుతున్నారు సీతారామయ్యగారు, హేమాను.

వెన్నెల రాత్రులు కాకపోయినా మనిషికి మనిషి కనబడనంత చీకటిగాలేదు రోడ్డుమీద.

పార్వతీశం వెనక్కి తిరిగితే పట్టుబడిపోతావేమోనన్న అనుమానం పీడిస్తోంది ఇద్దరికీ.

అయితే పార్వతీశం టార్చిలైటు అంతగా వెలిగించకపోవడం, వెనక్కసలు తిరిగి చూడకపోవడం వారికి బాగా ఉపకరిస్తోంది. బాట పక్కనే పచ్చికమీద నడుస్తుంటే వారి అడుగుల పొలకువ వారికే తెలీడంలేదు.

"తాతయ్య!" దూరాన పార్వతీశం మలుపు తిరగడం చూసి సీతారామయ్యగారి చెయ్యి పట్టుకుని గుసగుసలాడింది హేమ.

"ఏమిటమ్మడూ" సీతారామయ్యగారు అతి నెమ్మదిగా అడిగారు.

"ఆ పక్కకు తిరిగితే చేరేది దివాణం వెనక్కే కదా!"

"మరే"

"మరి అటు వెడతాడేమిటి మామయ్య?"


వాళ్ళు మనసుల్లో అనుకుంటున్నది ఊరవతల ఏటి ఒడ్డుకో లేక కలువకొలను ఇవతల తోటల్లోకో వెళతాడని.

హేమకయితే ఇవన్నీ కాక ఇంకో సందేహం. పక్క ఊరి పొలిమేరల్లో ఉన్న శ్మశానమేమో అతని గమ్యమని.

"మరి ఇదేమిటి?"

"చూద్దాం వెడుతున్నాంగా" పార్వతీశం మలుపు తిరిగాడు కాబట్టి నడక వేగం పెంచుతూ అన్నారు సీతారామయ్యగారు.

వీరుభయులూ కూడా మలుపు తిరుగుతూ ఎందుకైనా మంచిదని సందులోకి తొంగి చూసే వేళకు దూరాన పార్వతీశం ఆకారం దివాణం వెనుక



గుమ్మంలోంచి లోపలికెళుతూ కనిపించింది.

గాలి తీసేసిన బెలూన్‌లా ఒక్కసారిగా చప్పబడిపోయింది హేమ.

"సరిపోయింది. ఈయనగారు వెళ్లేది మళ్ళీ ఆ దేవీ మందిరానికేనా.. ఛ్ప."

"ఇంకా ఎందుకీ కాళ్ళ తిప్పట. పద తాతయ్య పోదాం" అన్నది నిరుత్సాహంగా సీతారామయ్యగారిని ఆపుతూ.

గొప్ప మిస్టరీ ఏదో ఛేదిస్తానని చెప్పి తీసుకువచ్చి గుప్పిట తెరిస్తే ఇట్లా మిడతంబొట్లయి కనిపించినందుకు చాలా సిగ్గుగా, ఇబ్బందిగా అనిపిస్తోంది... హేమకు.

"నీకు మరీ తొందరెక్కువ అమ్మడూ. ఈశుడు మందిరంలోకే వెళ్లాడనుకో. ఇంత రాత్రివేళ ఎందుకు వెళ్లాడో, ఏం చేయడానికి వెళ్లాడో, ఇంత దూరం వచ్చినవాళ్ళం ఇంకో నాలుగడుగులు వేడి చూసొస్తే సరి" అన్నారు సీతారామయ్యగారు మెల్లగానే మందలిస్తూ.

కాదనలేక తప్పనిసరిగా ఆయన వెనుక నడిచింది హేమ.

దివాణం గుమ్మం సమీపానికి రాగానే కరణంగారు ఆగారు "ఒక్క పదినిముషాలు ఆగి వెళదాం లోపలికి" అన్నారు.

అది కోటలాంటి దివాణానికి వెనకతట్టు అవడం మూలాన ఆ ప్రాంతమంతా చిమ్మచీకటి అలుముకుంది.

ఆశ్రమానికి వెళ్ళే కాలిబాట పక్కన అంతా ఖాళీస్థలమే. అక్కడంతా పెద్ద పెద్ద చెట్లు అడ్డదిడ్డంగా పెరిగిపోయి తన నీడల్లో ఆ అంధకారాన్ని మరింత దట్టం చేస్తున్నాయి.

గాలి విసురుకు ఊగిపోతూ కొమ్మలు చేసే ఝంకారం, అసుర గణ వాయిద్యాల మోతల్లా కీచురాళ్ళ వికృత ధ్వనులు, వాతావరణాన్ని బీభత్సంగా తోపిస్తున్నాయి.

రోజూ ఆశ్రమానికి అటుగా వెళ్ళే హేమకు కూడా ఒళ్ళు జలదరించిపోతుంటే గుబులు గుబులుగా సీతారామయ్యగారి చేయి పట్టుకుని నుంచుంది.

క్షణాలు గడిచిపోతున్నాయి. తనతో రమ్మని హేమకు సంజ్ఞ చెసి నడిచారు సీతారామయ్యగారు.

సర్వమంగళాదేవి మందిరంలోంచి సన్నపాటి వెలుతురు కనబడుతోంది. కొద్దిపాటి అలికిడి వినబతుతోంది.

మెత్తగా అడుగులు వేస్తూ వెళ్లి గభాలున మందిర ద్వారం ఎదురుగా నిలుచున్నాడు ఆయన.

మబ్బూ మెరుపూలేని వానలా వున్నట్టుండి ఆయనలా కళ్లెదుటే నిలిచేసరికి వ్యాఘ్ర చర్మం మీద నారవస్త్రం పరచుకుంటున్న పార్వతీశం తబ్బిబ్బయ్యాడు.

"బాబాయ్... మీరు... ఇప్పుడు... ఇక్కడ..." అన్నాడు తత్తరపాటుతో.

ఓరగా నిలబడి అతననే చూస్తున్న హేమకు అతని దిగ్భ్రమలో ఏదో కల్తీ కనిపిస్తోందనిపిస్తోంది.

"అవునయ్యా మేమే" చీడీలనానుకుని తిన్నెమీద కూర్చుంటూ తాపీగా అన్నారు సీతారామయ్యగారు.

అప్పటివరకూ హేమని గమనించని పార్వతీశం ఆమెని చూసి మరింత విస్తుపోయాడు.

"అర్ధకుడిమీద వేళకానివేళ ఈ దండయాత్రేమిటి బాబాయ్" చేతులు ముకుళించి మొహం వేలవేసి నాటకీయంగా అన్నాడు.

"అవునయ్యా నేను అనేదీ అదే. వేళకానివేళ ఇక్కడకు నీ రాకపోకలేమిటని? నువ్విట్లా పురుగూ పుట్రా తిరిగే వేళనిగానీ, గాలీధూళీ చెలరేగే వేళనిగానీ చూసుకోకుండా ఎవళ్లకీ చెప్పా చెయ్యకుండా ఇల్లు విడిచి వెడుతుంటే నువ్వేఆపద పాలవుతావోనని అమ్మడు ఎంత బెంగటిల్లిపోతుందో తెలుసునా! మీ అక్కకి తెలీలేదుగానీ తెలిస్తే ఎంత కలవరపడుతుందో యోచించావా? ఎందుకయ్యా ఓ వేళాపాళా లేకుండా నువ్విక్కడకు రావడం" వెంటనే విషయానికి వచ్చేస్తూ అడిగారు సీతారామయ్యగారు.

"ప్రశాంతంగా జపం చేసుకుందామని బాబాయ్" కొద్దిగా తల వంచి వినమ్రంగా చెప్పాడు పార్వతీశం.

"ఏం పగలంతా చేసుకుంటున్నావు అది చాలదా! అందుకేగదా మందిరం పూర్తిగా నీ ఆధీనంలో ఉంచింది" నుదురు చిట్లించారు ఆయన.

పార్వతీశం వెంటనే జవాబియ్యలేదు. తల తిప్పి సర్వమంగళాదేవిని భక్తిగా చూస్తుండిపోయాడు ఒక్క క్షణం.

దేవి మెడలో ప్రొద్దుటవేసిన మందారమాల జీవితమెంత క్షణికమో చెబుతున్నట్లుగా పూర్తిగా వడిలిపోయి దీనంగా వేలాడుతోంది.

బ్రతుకు బుద్బుదమని తెలిసినా జీవుడిలో ఆరని వాంఛలా దేవి పాదాల దగ్గరున్న నూనె దీపం మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది.

వ్యామోహ పీడితుడైన బిడ్డ బలహీనతల్నీ, నిస్సహాయతల్నీ అర్థం చేసుకున్న మాతృమూర్తిలా దేవి మందహాసం చిందుస్తూ ప్రసన్నంగా చూస్తోంది.

"నా తల్లి దగ్గరకు నన్ను చేర్చి నాకు

మహోపకారమే చేసారు బాబాయ్. కానీ ఈ తల్లి కృపాదృష్టి కోసం చేసే ప్రయత్నంలో నిమగ్నుణ్ణి అయ్యే ఆస్కారం లేకుండా పోతోంది నాకు. కారణమేమిటంటారా? అమృత ఫలరసం గ్రోలుతూ వుంటే గుటక గుటకకీ గింజలడ్డుపడినట్లు నిరంతరం ఎవరో ఒకరు నాకు అంతరాయం కలిగిస్తున్నారు."

"ఎవరువాళ్ళు?"

"ఎవరేమిటి? గడ్డి కోసుకోవడానికి వచ్చే గురవయ్య, వేకకోనం ఆకులు దూసుకోవడానికి వచ్చే కాశయ్య, ఆశ్రమానికి పాలు తీసుకొచ్చే పాపాయమ్మ, గొడ్లని మేపుకోవడానికి వచ్చే రామదాసు... వీళ్లంతా నాగాలేకుండా రోజూ వస్తారు. ప్రసాదం పెట్టు పూజారయ్యా అని అడుగుతారు. అమ్మవారి పూజా కుంకంకొద్దిగా ఇయ్యి అంటుంది పాపాయమ్మ. శఠగోపం లేదా బాబూ అంటాడు కాశయ్య. పలికేదాకా పలకరించడం మానరు. అడిగింది ఇచ్చేదాకా ఇక్కడ్నుంచి కదలరు. కళ్ళు మూసుకుని ధ్యానం చేసుకుంటున్న వాడ్ని కదిలించకూడదనే ఇంగితమెరుగని పామరులు. వాళ్ళనని ప్రయోజనంలేదు."

భారంగా నిశ్వసించాడు పార్వతీశం.

"ఇటు చూస్తే నా దీక్షకు నియమితకాలం పూర్తికావస్తోంది. నా జపమేమో సరిగా సాగడమేలేదు. సకాలంలో అది సంపూర్ణం చేయకపోతే ఇన్నాళ్ళు నేను చేసిన తపస్సంతా వ్యర్థమే అవుతుంది. అది విఫలమయితే ఈ జన్మకే అర్థం లేదు, సాఫల్యంలేదు.

అందుకనే బాబాయ్! రాత్రీ పగలూ అనే తేడాచూసుకోవడంలేదు. ఇప్పుడైతే నా జపం నిరాఘాటంగా సాగుతుందనే ఆశతోనే అపరాత్రయినా మందిరానికి వచ్చేస్తున్నాను. ఇవన్నీ అక్కతో చెప్పి నొప్పించకుండా ఒప్పించే నేర్పు నాకు లేదు. అది అంత అవశ్యకమనీ నేను భావించలేదు. అది తప్పు అని మీరనుకుంటే నన్ను క్షమించండి బాబాయ్" చేతులు కట్టుకుని ఏటో చూస్తూ తన సొద వినిపించాడు పార్వతీశం.

శ్రద్ధగా ఆలకించారు సీతారామయ్య గారు. అతని సంజాయిషీలో అసంగతమేమీ అవుపించలేదు ఆయనకు. పార్వతీశంమీద గొప్ప సానుభూతి కూడా ఏర్పడిపోయింది.

'విన్నావా అదీ సంగతి' అన్నట్లు సాభిప్రాయంగా చూశారు హేమవంక. ఆ చూపులో నిష్కారణంగా పూజాజపము అంటూ దేవుళ్లాడే ఈ వెర్రిబాగులవాడి మీద అభాండాలు వేశావు సుమా' అన్న హెచ్చరిక, 'నన్ను కూడా ఈ రొంపిలోకి దింపి ఫూల్‌ని చేసావుకదమ్మా' అన్న నిష్టూరం కూడా ఉన్నాయి.

కానీ హేమ ఆయన చూపుల్ని ఖాతరు చేసే స్థితిలో లేదు. ప్రమిద దీపం కాంతిలో సైతం లోపల ఒకరి కన్నుగప్పి దాచిబెట్టిందేమీ లేదని స్పష్టంగా తెలిసిపోతున్నా గర్భగుడి నలుమూలలన్నీ కళ్లతోనే చకచకా వెతికేస్తోంది.

ఎంత వెతికినా ఏమున్నాయని-

రోజు ఊడ్చడమి గానీ ఎత్తి పారబోయడం లేదుగావును, తీసేసిన పూలమాలలు ఎగిరొచ్చిన ఆకులూ, అలములూ గట్రా రెండు తట్టల చెత్త ఓ మూల పోగేసి వుంది.

దేవికి ఓ ప్రక్కగా పరిచిన వ్యాఘ్ర చర్మం, పరుస్తూ పరుస్తూ ఆపిన నార వస్త్రం దాని పక్కనే లావాటి చేతి కర్రా, టార్చిలైటూ, గుడ్డ సంచీ ఉన్నవల్లా అవే. కానీ అంతే అనుకోవడానికి మనసొప్పడంలేదు హేమకి.

'ఆ గుడ్డ సంచీలో ఓ అంగుళం మేర తెల్లగా బయటకొచ్చి తొంగి చూస్తున్న వస్తువేమిటో? ఆ మూల అంత పోగు ఉండాల్సిన అగత్యమేమిటో?' అంటూ రంధ్రాన్వేషణ సాగిస్తోందా మనసు.

మళ్ళీ అదేదో పైకి చెప్పి సందేహ నివృత్తి చేసుకోవడానికి జంకు.

తీరాజేసి దానిలో ఏ ఒత్తుల కట్టో, అగ్గిపెట్టో దర్శనమిచ్చెనా ఈసారి చూపుల శిక్షతో సరిపెట్టరేమో తాతగారు' అని భయం.

కానీ నిజంగా హేమ తెగించి ఏ అడుగు ముందు కేసి ఆ సంచీ బోర్లించి వుంటే ఆ పోగు కదిపి వుంటే పార్వతీశం అపరాధి అవునో కాదో తరువాత సంగతి- హేమ అనుమానాలకి ఆధారం లభించి ఉండేది.

"హేమా! ఇక వెళదామా!" లేచి నిలబడుతూ హేమని ఆలోచనల్లోంచి లేవగొట్టారు సీతారామయ్యగారు.

"ఆగండి బాబాయ్ నేనూ వస్తున్నాను" పార్వతీశం అంటూ వుంటే ఆశ్చర్యంగా చూసారు సీతారామయ్యగారు.

"ఈ వేల్టికిక ధ్యానం కుదిరేలా లేదులెండి" పేలవమైన చిరునవ్వుతో అన్నాడు పార్వతీశం.

దేవి ముందున్న ప్రమిదలో వత్తి సరిచేసి చేతి కర్రనీ, టార్చిని చేతిలోకి తీసుకున్నాడు. తలుపులు దగ్గరగా లాగి తాళం వేసాడు.

పార్వతీశం చేతిలో కర్ర చూడగానే ఏదో స్ఫురించి "అవునూ! ఈ కర్రెందుకయ్యా నీ చేతిలో" అని ప్రశ్నించారు సీతారామయ్య గారు.

"ఇది కర్ర కాదు బాబాయ్ కత్తి" మూత తీసినట్లుగా కర్ర సగభాగాన్ని విడగొట్టి చూపించాడు పార్వతీశం. అర అడుగున్న కత్తి బుస్సున పొదలోంచి తల ఎత్తిన మొగలి నాగులా బయటపడింది అందులోంచి.

"అడవుల్లో, కొండల్లో తిరిగే వాళ్ళందరి దగ్గరా చిన్నా చితకా కీటకాల భారినుంచి రక్షణకోసం ఈ రకమైన ఆయుధమొకటి తప్పనిసరిగా ఉంటుంది. వేము హిమాలయాల్లో సంచరించినప్పటి నుంచి ఇది నా వెంటే వుంటోంది" తిరిగి మూత బిగిస్తూ చెప్పాడు పార్వతీశం.

"ఓహో దీన్ని చూసేనన్నమాట దాసు..." అర్థోక్తితో ఆ పేరు సీతారామయ్యగారు పూర్తి సమాచార సేకరణ కోసం పార్వతీశం వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

"మీదాకా కూడా వచ్చి చెప్పాడన్న మాట దాసు. అనుకున్నాను" చిన్నగా నవ్వాడు పార్వతీశం.

"మొన్న శుక్రవారంనాడు అంబకి కొబ్బరికాయ కొట్టి నైవేద్యం పెడదామని పీచు తీసేందుకు మరేందొరక్క ఈ కత్తి పైకి తీసాను. ఆ సమయానికే దాసు ఇక్కడకు వచ్చాడు. నా చేతిలో కత్తి చూసి ఏమనుకున్నాడో ఏమో వెనక్కి తిరిగి ఒకటే పరుగు. ఎంత పలిచినా వినిపించుకోనేలేదు. అప్పుడే అనుకున్నాను - ఈ వెర్రిబాగులవాడేమని ప్రచారం చేస్తాడో ఏమో అని" మందహాసంతో ముగించాడు పార్వతీశం.

'అదన్నమాట సంగతి" తృప్తిగా తల పంకిస్తూ కదిలారు సీతారామయ్యగారు.

ముందు సీతారామయ్యగారు, పార్వతీశం, ఒక్కడుగు వెనగ్గా హేమ నడక సాగించారు.

ప్రకృతి అంతటా పరుచుకున్న నీరవ నిశ్శబ్దం.

అంత నిశ్శబ్దాన్ని భరించలేనట్టుగా సీతారామయ్యగారు మాటలు మొదలుపెట్టారు.

"అదికాదురా అబ్బాయ్. దేవుడ్ని కావాలనుకున్నావో, మమ్మల్నే చూడాలను కున్నావో మళ్ళీ మాలోకి వచ్చి కలిశావు. అలా వచ్చినవాడివి మాలో ఒకడిగా కలసిపోవాలిగానీ మళ్లా ఈ అరమరికలేమిటయ్యా! నీకొచ్చిన కష్టం, నీక్కలిగిన ఆలోచన నువ్వు తీసుకున్న నిర్ణయం, ఇవన్నీ తాళి కట్టిన దానితో చెప్పలేకపోతే పోయావు. తోడబుట్టిన దానితోనయినా చెప్పుకోవద్దా! ఇప్పుడు చూడు ఏమయిందో, అనహజంగా వున్న నీ ప్రవర్తనకి అర్థం వెతుక్కుంటూ నీ వెనకబడి రాత్రిళ్ళు కూడా నీ పనికి విఘ్నం కలిగించాలిసొచ్చింది" పశ్చాత్తాపపడుతూ అన్నారు ఆయన.

కొంచెంసేపు మాట్లాడలేదు పార్వతీశం.

"మనోగతాన్ని ఆప్తులతో పంచుకోవడమంత అదృష్టం, మనశ్శాంతినిచ్చే అంశం మరొటిలేదు బాబాయ్. అది నేను చేయలేకపోయానంటే ఆ గతమెంత హేయమైనదో ఊహించుకోండి" అన్నాడు.

"అబ్బెబ్బే నేనన్నది ఎప్పటి సంగతుల గురించోకాదయ్యా" నొచ్చుకున్నారు సీతారామయ్యగారు.

"అది నాకు అర్థమయింది బాబాయ్. కానీ గతకాల ప్రభావం వర్తమానం మీద పడకుండా ఉండదు. ఉదాహరణకి మొన్నామధ్య ఢిల్లీలో మాతోపాటు పేవ్‌మెంట్ మీద బతికిన సహచరులిద్దరు ఇటువైపుగా వెడుతున్నారట. ఇక్కడ దిగి నన్ను చూడ్డానికి వస్తున్నామని నాకుత్తరం రాశారు. నిజానికి ఈ విషయం అక్కయ్యకి తెలియపరచాలి నేను. కానీ నేనా పని చేయలేకపోయాను. ఎందుకనుకుంటున్నావు బాబాయ్?"

"ఆ వచ్చేవాళ్ళు గొప్పవాళ్ళా, గౌరవనీయులు కారు. కనీసం సాధారణ జీవనం గడిపే సగటు మనుషులన్నా కాదు."

"మరి?"

"జేబుదొంగతనాలు చేసి, దోపిడీలు చేసి పొట్టనింపుకునే నీచులు. మెళ్ళో గొలుసు కోసం పసిపాపపీక ఏ మూల సందులోనో నొక్కేందుకు వెనకాడని నికృష్టులు. వీళ్ళు ఇలాంటి వాళ్ళూ అని నేను చెప్పకపోయినా వాళ్ళ భాష, వాళ్ల రూపం, వాళ్ళ చేష్ట అన్నీ వారి వృత్తినీ, ప్రవృత్తినీ చాటిచెబుతూనే వుంటాయి?"

"నీ అడ్రస్ వారికెలా తెలిసింది?" సీతారామయ్యగారి ప్రశ్న.

"పాత ఢిల్లీ మురికివీదుల్లో కలరా వ్యాధి వ్యాపించిన ఒకానొక దుస్సమయాన మేము ఆఖరయిపోతామన్న భీతి మమ్మావరించింది. ఆ దుస్థితే కనుక తటస్థిస్తే అనాధ ప్రేతాలుగా కార్పొరేషన్ వాళ్ళు మమ్మల్ని ఈడ్చెయ్యక మునుపే మావాళ్ళకి ఆ కబురందించమని వాళ్ళని ప్రార్థించి మా అడ్రస్ ఇచ్చాము. భూమ్మీద ఇంకా నూకలుండి ఆ గండం నుంచి తప్పించుకున్నామనుకోండి" నిర్లిప్తంగా చెప్పాడు పార్వతీశం.

"అంతా భగవత్కృప" ఉద్వేగాన్ని అణచుకుంటూ పార్వతీశం భుజంమీద చెయ్యివేసి తట్టారు సీతారామయ్యగారు.

"వారిద్దరూ ఇప్పుడు ఉత్తరాది నుంచి దక్షిణాదికి మజిలీలు చేసుకుంటూ వెడుతూ నా దగ్గరకు వస్తున్నామని వ్రాసారు. ఏం చేయడమో తోచలేదు నాకు. అట్లాంటివాళ్ళని తీసుకొచ్చి నా మిత్రులని మీకు పరిచయం చేస్తే నామీదున్న సద్భావం మీలో మిగులుంటుందా అని బెంబేలు పడ్డాను. దిక్కు తోచలేదు. ఆ రోజునా ఇలాగే ధ్యానం మీద మనసు నిలిచింది కాదు."

"ఏం చేశావ్‌మరి?" ఆతృత అణచుకుంటూ అడిగారు.

"ఇకనుంచీ నాకొచ్చే ఉత్తరాలు నాకే ఇమ్మని పోస్ట్‌మెన్‌కి డబ్బిచ్చి బ్రతిమిలాడాను. ఏవో సాకులు చెబుతూ వాళ్లని రావొద్దని జవాబు వ్రాసాను. కానీ వాళ్ళవి పట్టించుకోలేదు. నన్ను చూసే తీరాలంటూ పట్టుబడుతూ తిరిగి ఉత్తరాలు రాసారు."

"ఊఁహూ!"

"తప్పనిసరై ఒప్పుకున్నానుగానీ వాళ్ళని ఇంటికి తీసుకురాలేదు. ఏటి ఒడ్డునే కలుసుకుని మాట్లాడి పంపించేసాను."

పజిల్ విడిపోయినట్టు నిట్టూర్చారు సీతారామయ్యగారు.

"అవును బాబాయ్. అప్పట్లో నా ప్రారబ్ధం ఎటు ఈడ్చుకువెళితే అటువైపుగా కొట్టుకుపోయాం. గతం గతహః అవసరార్థం వాళ్లతో సంపర్కం పెట్టుకున్నవాళ్ళమేగానీ జన్మగత సంస్కారం వాళ్ళ మాదిరి దుర్మార్గాలకి దిగజారనివ్వలేదు మమ్మల్ని. మా పూర్వజన్మ సుకృతంవల్ల తొందరగానే వాళ్ళనుంచి విడిపోగలిగాం కుడా.

మునులూ, యోగులూ, నడిచి నలిగిన త్రోవ దొరికింది మాకు. లక్షాలు వేరేగానీ బావా, నేనూ సేవించిన మహానుభావులు సాధారణమైనవాళ్ళుకాదు. జ్ఞానులు, సాధువులు. వారివల్ల నాకు మహోపకారం జరిగింది. నా కర్మ పరిపక్వమయింది. అమూల్యమైన దేవీ మంత్రం లభించింది.

ఆ తల్లి ఆదేశంతో, నా గురువు ఆనతితో సహస్రకోటి జపదీక్ష లక్ష్యంగా ఇక్కడకు వచ్చాను. ఆ అమ్మకృపవలన నా తపస్సు సలక్షణంగా సాగుతోంది. నా ఆశయం సిద్ధించే సమయం ఆసన్నమవుతోంది.

ఈ అదనులో వాళ్ళ రాక నన్ను చాలా ఇరకాటంలో పడేసింది.

పరమ నిష్ఠాగరిష్ఠుడైన సదాశివశర్మగారి పుత్రుడూ, జామాతలమైయ్యుండి కొద్దికాలమే అగుగాక గొంగళి పరుగుల్లాంటి జీవితాన్ని గడిపామని చెప్పుకోవడానికి చిన్నతనమనిపించి గతం గురించి ఒక్క మాట సరిగ్గా చెప్పకుండా దాటవేస్తూ వచ్చాను.

ఇప్పుడు హఠాత్తుగా సంఘానికే చీడపురుగుల్లాంటి మనుషులతో కలిసొచ్చి వీళ్ళు మా మిత్రులని చెబితే మీరేమనుకుంటారు? ఈ జపతపాలు, నడక, వేషం మోసం అని భావించరా!

ముఖ్యంగా అక్కయ్య మా కారణంగా ఎన్నో ఇడుములపాలయింది. ఎన్నో కష్టాలనుభవించింది. మూడొంతుల జీవితాన్ని విషాద యోగంలోనే గడిపింది.

నేను వచ్చాను. నన్ను చూసాక ఆమె మనసు తేరుకుంటున్నది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఆ మనసు ఈ షాక్‌తో మళ్ళీ చెదిరిపోవచ్చు. నామీద కుదురుకుంటున్న విశ్వాసం సడలిపోవచ్చును. మీ అందరి తిరస్కారం మూలంగా నా జపం కుంటుపడవచ్చును. ఇది నేను ఏమాత్రం సహించలేను. అందుకే ప్రస్తుతానికి అన్నీ తెరచాటుగానే వుంచుతున్నాను.

ఇదిగో ఈ జపం పూర్తి కానివ్వండి. అన్నీ అక్కయ్యకు మీరన్నట్టే విశదపరుస్తాను. ఆమె తీర్పు ఏమయితే అది శిరసావహిస్తాను. ఆ తర్వాతే మా గురువు ఆజ్ఞ పాటిస్తాను. అప్పటివరకూ దయచేసి నా మానాన నన్ను వదిలేయండి బాబాయ్. మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను" ఉద్రేకంగా ముగించి వినయంగా నమస్కరించాడు పార్వతీశం. వదలని అనుమానంతో తేల్చుకోలేని అయోమయంతో హేమ తికమక పడుతూనే వుంది.

నిట్టూర్చి అంగీకారంగా తల ఊపేసారు సీతారామయ్యగారు.

ఇల్లు సమీపించింది. గేటు తెరిచి ముందుకు నడవబోయారు. వరండాలో నిలబడి వుంది గాయత్రి.

* * *

"నువ్వు కొంచెం చొరవ చూపించాలి గాయత్రి...! తొందరపడాలి."

"నన్నేం చేయమంటావ్ బాబాయ్! సహజంగా పరస్పరం ఇద్దరి మధ్యనా ఎంతో ఆకర్షణ ఉండాల్సిన వయస్సు. ప్రకృతి ధర్మమే వాళ్ళముందు పరాజయం పాలవుతుంటే నావల్ల ఏమవుతుంది. ఆ దేవుడ్నే వాళ్లను కలపాలి" నిస్పృహగా అంది గాయత్రి.

హేమగానీ, పార్వతీశంగానీ ఇంట్లోలేరు. చేటలో బియ్యం పోసుకుని ముందు పెట్టుక్కూర్చుంది గాయత్రి.

వేళ్ళు మాత్రం యాంత్రికంగా బియ్యాన్ని కదుపుతున్నాయిగానీ సీతారామయ్యగారు కదలేసిన విషయంల్లో క్లిష్టత మూలంగా ఆమె కళ్ళు బియ్యంలోని బెడ్డల్ని గుర్తించడం మానేసాయి.

ఆహ్లాదంగా ఉండాల్సిన ఆ సాయంకాలం ఆలోచనల బరువుతో వేడెక్కుతోంది.

"అలా అంటే ఎలాగ? మానవ ప్రయత్నం ఉండాలిగా?"

"ఏం చెయమంటారు? మీరే చెప్పండి."

"వెంటనే పునఃస్సంధాన ముహూర్తం పెట్టండి' తేల్చేసారు సీతారామయ్యగారు.

"బాబాయ్... వాళ్ల ఎడమొహం పెడమొహం ధోరణి తెలిసీ..."

"ఆ మొహాలు అభిముఖం

కావడానికేనమ్మా ఈ చిట్కా!"

"కానీ ఈశుడిచేత ఊ అనిపించడం సాధ్యమవుతుందంటారా?"

"ఎలాగైనా ఒప్పించాలి. తప్పదు. ఏదోరకమైన బంధనం ఏర్పడకపోతే వాడిక్కడ కాలు నిలిపి ఉండడేమోనని నా అనుమానం."

"ఈశుడు మళ్ళీ వెళ్లిపోతాడంటారా?" హతాశురాలై అంది గాయత్రి. వెనక్కొచ్చిన తమ్ముడు చూపించిన బాటలో భర్త కూడా నడిచి వస్తాడని ఎదురుచూస్తున్న ఆమెకు మొదటికే మోసం తెస్తూ చెబుతున్న ఆయన మాటలు అశనిపాతంలా తాకాయి.

"మాకీ శాపగ్రస్త జీవితాన్నుంచి విముక్తి లేదా బాబాయ్" అన్నది ఆక్రోశిస్తున్నట్లుగా.

"అబ్బెబ్బే ఎందుకంత భయపడతావ్? నాది అనుమానమే అని చెప్తున్నాగా. వాడి ధోరణి చూస్తే అలా అనిపించిందంతే. ఆ జప పూర్తికి తెగ ఆరాటపడిపోవడం, గురువు ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటాననడం. ఆఖరికి నీకు అన్నీ చెప్పుకుంటాననడం, ఇవన్నీ చూస్తుంటే గురువుగారు జపం పూర్తి చేసుకుని తిరిగి రమ్మన్నారంటూ మళ్ళీ హిమాలయాలకి పరుగెత్తడు కదా అని నా సంశయం."

"వాడ్ని ఆపలేమంటావా బాబాయ్?" బేలగా అడిగింది గాయత్రి.

"దాని గురించేనమ్మా నాకు తోచిన ఉపాయం నీకు చెప్పాను. దాంపత్య బంధానికి ఉన్న శక్తి, ఆకర్షణ మరిదేనికీ ఉండవు. నీ భర్త అన్నిటికీ అతీతుడనుకో. అతని సంగతి వదిలేస్తే సదాశివశర్మ వంటి వేదాంతి కూడా సంసారానికి బద్ధుడై ఉన్నాడంటే పన్నెండేళ్ళ తర్వాతైనా నీ తమ్ముడు వెనక్కు తిరిగి ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడంటే కారణం ఆ బంధం యొక్క మహత్యమే అని నా విశ్వాసం. ఆ భార్యాభర్తల్ని కలుపు. వాడిక్కడ శాశ్వతంగా ఆగుతాడు'' నమ్మకంగా అన్నారు సీతారామయ్యగారు.

ఆ రాత్రే పార్వతీశం భోజనం పూర్తిచేసి వస్తున్న సమయంలో ఆ విషయాన్ని ప్రస్తావించింది గాయత్రి.

అవుననీ కాదనీ వెంటనే చెప్పలేదు పార్వతీశం. చాలాసేపు ఆగి "ఒక్క పదిహేనురోజులు ఓపికపట్టు అక్కయ్యా నువ్వేం చెప్పినా వింటాను" అన్నాడు.

"పదిహేనురోజులనగా ఎంత? ముహూర్తం కుదిరేసరికి అవనే అవుతుంది. పురోహితుడికి కబురుపంపి లగ్నం పెట్టుకుందాం. ఆ తరువాత మాత్రం నువ్వు అభ్యంతరపెట్టకూడదు మరి."

పార్వతీశం మౌనాన్ని అంగీకారంగా తీసుకుని మిగతా సన్నాహాలు... కుశులు ఊడదీసి కట్టగట్టి పడేసిన పందిరి మంచం అటకమీదనుంచి దింపింది. వడ్రంగిచేత పాలిష్ చేయించడం, పరుపు ఏకడానికి దూదేకుల సాయిబుకి కబురు పంపడంలాంటి పనులు పరమోత్సాహంగా ఆరంభించింది గాయత్రి.

ప్రత్యేకించి చెప్పకపోయినా పెద్దవాళ్ళ మనోగతం, అందుకు సాగుతున్న ప్రయత్నాలు హేమకు తెలుస్తూనే ఉన్నాయి.

ఆమెలో ఏదో అసౌకర్యం, అశాంతి, తెలీని ఆందోళన.

ఇది ఆమె ఎదురుచూడనీ, ఆశించని ఆకస్మిక పరిణామం. మానసికంగా ఆమె ఇందుకు ఏమాత్రం సిద్ధంగాలేదు.


అలాగని నోరు విప్పి తన అనంగీకారాన్ని తల్లికి తెలపనూ లేకపోతోంది.

ఎలా చెబుతుంది? ఇక్కడకొచ్చే ముందర తల్లి మన సంప్రదాయాలు, హైందవ ధర్మాలూ, సమాజమూ కట్టుబాట్లు అంటూ బోధించిన వాటినల్లా కిమ్మనకుండా విని తల ఊపింది.

భగవంతుడు అందించిన జీవితాన్ని స్వీకరించక తప్పదన్న ఉద్దేశ్యంతోనే బుద్ధిమంతురాల్లా ఈ ఊరొచ్చింది.

ఇప్పుడు నాకిష్టంలేదంటూ తన చంచలతను ప్రదర్శించడం ఏమంత సమంజసం?

ఎందుకిలా మారింది నీ అభిప్రాయమంటే ఏమి సమాధానం చెప్పడం?



అసలు తనకయినా తెలుసా ఆ కారణం?

ఎందుకు అతనంటే తన మనసింత వ్యతిరేకిస్తోంది?

బాల్యం నుంచీ తనకతని ప్రవర్తన, చేతలు అంత హితవుగా వుండేవికావు. కేవలం మెడలో మాంగల్యం ముడి వేసినంత మాత్రాన ఒక వ్యక్తికి ఎందుకంత ప్రాధాన్యత ఇవ్వాలో అర్ధం కాకపోయినా పెద్దల అభిమతం మేరకు అతని ఆధిక్యతను మౌనంగా మన్నించేది.

అతనియందు తనకు స్పందన కలిగించే ఒకే ఒక అంశం అతని అందం.


పసినిమ్మపండు ఛాయలో ఆకర్ణాంత నేత్రాలతో తల్లి సౌకుమార్యాన్ని పుణికి పుచ్చుకున్న బాలమన్మధుల్లా ఉండేవాడు.

కరణం తాత టెలిగ్రాం అందినప్పుడు తన మనసున మెదలిన సుందర రూపం అదే.

వర్తమానానికి వస్తే పూర్వపు అందం అతనిలో ముచ్చుకులేదు. అందం తరిగిందనలేముగానీ మొరటుబారింది.

చక్కదనం కొరవడడంవల్లే అతనంటే తనకి విముఖత కలిగిందా అని ప్రశ్నించుకుంటే లేదు అది కారణం కాదు.

మగవాడి ఆకృతిలో కన్నెపిల్ల అభిలషించేది మగసిరి సంతరించుకున్న దృఢత్వమే కానీ ఎండకువాడే కోమలత్వం



కాదుకదా!

మరెందుకు కాని ఏదో జరగబో తున్నట్లుగా తనలో ఈ సందిగ్ధం, కలవరపాటు, తన మనసేమిటో తనకే అర్థం కాని అయోమయం.

మనసు సరి చెడినప్పుడు ఆశ్రమాన్ని ఆశ్రయించడం ఇక్కడకొచ్చాక అలవరుచుకున్న అభ్యాసం.

హేమ ఆశ్రమానికి వెళ్లింది.

మనసులో భావాలు ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తాయి కొందరికి. హేమ ముఖం మనసుకు అద్దమే.

రోజు మాదిరి పిల్లల ఆటపాటల్లో కలవలేకపోతున్న హేమని "ఏమయింది హేమా... మొహమలా వడిలిపోయింది" అని పరామర్శించారు స్వామిగారు యధాలాపంగా.

వినీ వినిపించనట్టుగా "ఏమీలేదని" తల వంచుకున్న హేమని మరి ప్రశ్నించలేదు ఆయన- వ్యక్తిగత సమస్యలుంటాయి. ఆ జోలికి ఇతరులు పోవడం భావ్యం కాదని.

ఆమె ఇంటికి వెళ్ళేటప్పుడు అడిగారు "నీకు వీలయితే ఈ రాత్రి లక్ష్మమ్మగారికి సాయంగా ఆశ్రమంలో ఉండగలవా?" అని.

లక్ష్మమ్మగారు డబ్బయ్యోపడిలో పడిన వృద్ధురాలు. ఆవిడకు నాలుగు రోజులనుంచీ జ్వరం. మొన్నటి నుంచీ మరీ మూసిన కన్ను తెరవలేదు. ఆశ్రమంలో ఉండే నలుగురి స్త్రీలలో రావమ్మగారు, రాజమ్మగారు మరీ ఓపిక ఉడికిన ఎనభై ఏళ్ల వాళ్ళు. రాత్రిళ్ళు నిద్ర కాచే వయసు కాదు వాళ్ళది. ఇంకొకామె యశోద. దూరపు చుట్టం. ఇంట్లో ఏదో శుభకార్యం ఉంటే వెళ్లింది.

పగలు హేమ వుంటుంది కాబట్టి ఫర్వాలేకపోతోంది కానీ రాత్రిళ్ళు లక్ష్మమ్మగార్ని లేవదీసి ధారకం ఇవ్వడానికీ వేరే అవసరాలు చూడడానికీ చాలా అవస్థపడాల్సి వస్తోంది.

తల్లి అనుమతిస్తే భోజనం చేసి వస్తానన్నది హేమ. విషయం విన్నాక గాయత్రి కూడా అభ్యంతర పెట్టలేదు.

సేవాభావం అనే గుణసంపద జన్మతహా అబ్బేది కొంతయితే పెరిగిన పరిసరాలు పరిస్థితుల్నిబట్టి సంక్రమించేది కొంత.

హేమ చిన్నతనమంతా పెద్దల మధ్యన గడిచింది. వాళ్ళ ముద్దు మురిపాలూ, గారాబాలూ పూర్తిగా అందుకోవడమేకాదు, వారి మనసెరిగి మసలుకోవడం, వారి చాదస్తాలని ఓపిగ్గా భరించడం, వారు మంచాన పడినప్పుడు సేవలు చేయడం, చిన్నపిల్లల మనస్తత్వంతో మంకుతనం వేస్తే మంచి మాటలతో తనదారికి తెచ్చుకోవడం... అన్నీ అనుభవమే.

"ఆకలిగా లేదు, నీరు చేదు" అంటున్న లక్ష్మమ్మగారిని లాలించీ, కోపగించీ పాలు తాగించి మందు బిళ్ల మింగించి తలనొప్పంటే అమృతాంజనం పట్టించి ఆవిడకు కునుకు పట్టాక 'అమ్మయ్య' అనుకున్నది హేమ.

ట్యూబ్‌లైట్ ఆర్పేసి బెడ్‌లైట్ వేసింది. కుర్చీ కిటికీ దగ్గరగా లాక్కుని విశ్రాంతిగా కూర్చుంది.

ఆకాశ వేదికపైన తారకభామలు ఫాషన్ షోలో సొగసులు ప్రదర్శిస్తున్నట్లు తళతళ మెరుస్తున్నాయి.

అంతమంది సుందరాంగుల్లో యెవరికి ప్రథమ స్థానమివ్వాలో తేల్చలేని అసమర్థపు జడ్జిలా చందమామ మబ్బులచాటుకి తప్పుకుంటున్నాడు.

బయట వాతావరణం నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉంది. కొంచెం దూరంలో పిల్లలుంటున్న సావిడిలోంచి కొద్దిపాటి సద్దు వినబడుతోంది.

హేమ టేబుల్ మీది అలారం టైంపీసుకేసి చూసింది. పదకొండు గంటలు. హేమ లేచి వెళ్లి లక్ష్మమ్మగారి నుదుటిమీద చేయివేసి చూసింది.

"జ్వరం దిగజారినట్టుంది. చెమట్లు పడుతున్నాయి" తేలిగ్గా నిట్టూర్చింది హేమ.

ఆ గదిలోనే వుండే రావమ్మగార్ని పక్కగదిలోకి మార్చి తాత్కాలికంగా ఆ వేళకి హేమకి పడక ఏర్పాటు చేసారు స్వామిగారు.

హేమ ఆ మంచం మీద వాలబోతుండగా తలుపు తోసుకుని వచ్చాడు రవి.

ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తూ అతను సంశయిస్తూండడం చూసి "ఏం రవీ! ఏం కావాలి?" అంది హేమ అనునయంగా. ఎదుటివారు ప్రోత్సహిస్తేనేతప్ప అతని నత్తి వెనకబట్టి అతను మాట్లాడలేడని హేమకు తెలుసు.

"అ అ అ అక్కా... మమమరి... మరి నీకోటి చూపించాలి" అన్నాడు రవి ఉత్సాహంగా.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అంది హేమ.

"'దిదిదిదివాణంలో మమందిరంలో.."

"మందిరంలోనా? ఏమున్నదక్కడ?" నుదురు చిట్లించి అడిగింది హేమ.

"రా..." మరి మాట్లాడడానికి రాక చెయ్యి పట్టి లేవదీయబోయాడు రవి.

"ఇప్పుడా?" నిద్రపోతున్న లక్ష్మమ్మగారిని చూస్తూ తటపటాయించింది హేమ.

"ఇప్పుడే చూడాలి రా. వవవవదినిముషాల్లో వచ్చెయ్యొచ్చు" తొందర చేసాడు రవి.

రవి చాలా ఇంగితజ్ఞానంగల పిల్లవాడు. ఎంత గొప్ప విశేషమో ఉంటే తప్ప ఇంత రాత్రి సమయంలో తనను ఇంత త్వరపెట్టడు.

సందేహాన్ని వదిలి లేచింది హేమ.

ఆశ్రయం గేటు దాటితే దివాణం వెనకవైపు చేరడానికి రెండు నిముషాల నడక.

దివాణం గుమ్మం దాకా వచ్చారు ఇద్దరూ.

ఈ నిశ్శబ్ద నిశీథిలో లోపలనుండి దేవీ మంత్రోచ్చారణ చేసే పార్వతీశం గొంతు స్పష్టంగా వినిపిస్తోంది.

రవి హేమ చెయ్యి పట్టుకుని వినమన్నట్లు చూసాడు.

"ఇదా విశేషం?"

అరిగిపోయిన జోక్‌ని ఇరవై ఒకటో శతాబ్దపు సరికొత్త జోక్‌లా చెబితే వన్చొచ్చింది హేమకి.

"ప్ నవ్వకు. లోలోలోపలికి పపద" గుసగుసలాడాడు రవి.

అతను పట్టుకున్న చేతిని విడించుకుంటూ మెల్లగా చెప్పింది హేమ.

"నాకది ముందే తెలుసు రవీ. లోపలున్నది మా మామయ్యే. పగలు నిష్ఠ కుదరక రాత్రిళ్ళు వచ్చి జపం చేసుకుంటున్నాడు. అంతే. పద పోదాం" వద్దనుకున్నా దాగని విరక్తి గొంతున ధ్వనిస్తుండగా.

ఒక్కక్షణం నివ్వెరపోయినట్టు చూసాడు రవి. ఆ తరువాత విడిపించుకున్న హేమ చేయి మళ్లీ పట్టుకుని మాట్లాడవద్దు అన్నట్లు నోటిమీద వేలుంచి "పద" అంటూ లోపలికి తీసుకువెళ్లాడు.

మందిరం తలుపులు ఓరగావేసి ఉన్నాయి.

తలుపుకు పక్కగా నిలబడి "చూడు" అన్నట్లు సూచించాడు.

తొంగి చూసింది హేమ.

లోన పార్వతీశం నేలమీద పడుకుని మంచి నిద్రతీస్తున్నాడు. అతని పక్కనే పాకెట్ సైజు టేప్‌రికార్డర్‌లోంచి మంత్రోచ్చారణ నిరంతరం లయబద్ధంగా వెలువడుతోంది.

నిశ్చేష్టురాలైంది హేమ.

'ఆ రోజున సంచీలోనుంచి తెల్లగా కనబడిన భాగం ఈ టేపు రికార్డుదన్నమాట!'

చేతిలో వున్న ఆమె పిడికిలి బిగపడంతో తెలిసింది రవికి ఆమెకు తెలియని విషయాన్నే చుపించగలిగానని.

వీరిద్దరూ ఆశ్రమానికి తిరిగి వచ్చేసరికి స్వామిగారు లక్ష్మమ్మగారి గదిలో కాచుకున్నారు.

"మేము... అక్కడికి" ఏదో చెప్పబోయిన హేమని వారించారు స్వామిగారు.

"తెలుసు. నీకంటే ముందే తెలుసు. నీకు చెప్పాలనే అనుకుంటున్నాను. ఇంతలో వీడింత సాహసం చేస్తాడనుకోలేదు" అన్నారు గంభీరంగా.

అపరాధిలా తల వంచుకున్నాడు రవి.

"వారంరోజుల క్రితం వీడికి విరోచనాలయి అర్ధరాత్రి బయలు ప్రదేశానికి వెళ్ళాలనిపిస్తే ప్రకాశాన్ని ఇచ్చి పంపాను. అప్పుడు చూసారట. నాతో చెప్పారు. అయితే ఇది ఎప్పుడో కనిపెట్టాను. ఇది ఒకటేకాదు, ఇంకా కొన్ని గమ్మత్తయిన సంఘటనలు కళ్లారా చూశాను కూడా. ఇదీ అని చెప్పలేనుగానీ మనకు తెలీకుండా ఏదో జరుగుతోంది. సందేహం లేదు" హేమకు చెప్పారు స్వామిగారు.

రవిని పంపించేసి చాలాసేపు మాట్లాడుకున్నారు ఇద్దరూ.

ఆ మర్రోజు సాధారణంగా వాహ్యాళికి వచ్చినట్లుగా ఆశ్రమానికి వచ్చారు సీతారామయ్యగారు. ముగ్గురూ మరెన్నో చర్చించుకున్నారు.

88 888 888

ఒక్కొక్క రోజు గడుస్తోంది.

"అమావాస్య వెళ్లిన పంచమి మంచిదన్నారు సోమయాజులుగారు" తమ్ముడితో చెప్పింది గాయత్రి.

"ఊ" అన్నాడు పార్వతీశం ముభావంగా.

ముభావమో, అభావమో మొత్తానికి ఊ అన్నాడు అదే చాలనుకున్నది గాయత్రి.

హేమయితే తల్లి ఆ మాట ఎత్తినప్పుడల్లా గతుక్కుమంటున్నది.

హేమ పడుతున్న టెన్షన్ సీతారామయ్యగారు అంత సీరియస్‌గా తీసుకోలేదు.

"నువ్వంత వర్రీ కాకమ్మడూ. మనం వాడ్ని గురించి మరీ అతిగా అనుమానిస్తున్నామేమోనని నా అనుమానం" అన్నారు తేలిగ్గా. "దొంకతిరుగుడు ఎందుకని మొన్న నీ మేనమామ దగ్గరికి వెళ్లి 'ఏరా నీ దగ్గర టేపురికార్డర్ ఉందటకదా ఓసారి చూపించు' అని నేరుగా అడిగేసాను. బిత్తరపోతాడనుకున్నాను. ఊహూ... నిమ్మకి నీరెత్తినట్టు తొణకలేదు. సంచీలోంచి ఆ టేపురికార్డర్ తీసి కాసెట్ పెట్టి మరీ వినిపించాడు. ఏమ్మన్నాడో తెలుసునా ' నా దగ్గరున్నది ఈ ఒక్క కేసెట్టే బాబాయ్. నిద్రావస్థలో కూడా ఆ దేవీనాదం నా శరీరంలో ప్రవహించాలనే అభిలాషతో

చెవిదగ్గర పెట్టుకుని పడుకుంటూంటాను' అన్నాడు. కొన్ని కొన్ని భ్రమలంతే హేమా? పాము అని భయపడతాం. తాడని తేలుతుంది. పరమ వైష్ణికుడు సదాశివశర్మ కొడుకు ఎంత చెడిపోవుగాక చేయరాని ఘాతుకాలు చేస్తాడంటే నేను నమ్మను" అన్నారు.

"మరి స్వామిగారు చూసినవాటి మాటేమిటి?"

"ఇదిగో, వాటికీ ఇలాగే వడ్లగింజలో బియ్యపుగింజలా ఏదో తాత్పర్యం ఉండే వుంటుంది. మీరు ఆపిఉండకపోతే అదీ తేల్చేసేవాడ్ని" అన్నారు కరణం గారు.

"ఊహూ... వద్దు. వద్దు. నువ్వు తొందరపడవద్దు. ఓపిక పడితే నిజాయితీగల నిజాలు వాటంతట అవే బయటపడతాయి" అన్నది హేమ.

రెండురోజుల తరువాత రామిరెడ్డిగారి జామతోట కాపలా కాసే వీరదాసు తెచ్చిచ్చిన కాగితం చీటీతో కథకి ముగింపు వచ్చింది.

* * *

అమావాస్య చీకటి. అర్ధరాత్రి సమయం: స్టేషన్ పక్కనుంచి నాలుగు స్కూటర్లు బయటదేరి వూరివైపుకి దూసుకువచ్చాయి. సరిగ్గా కలువకొలను దిబ్బ దగ్గరకు రాగానే ఆగాయి. వాటి నధిరోహించి వచ్చిన నలుగురూ దిగారు. లైట్లు ఆఫ్ చేసారు.

ఆపాదమస్తకం నల్లని దుస్తులు ధరించి నిధికి జన్మించిన ముద్దుబిడ్డల్లా చీకటిలో కలిసిపోతూ నల్లగా ఉన్నారు. దేనికోసమో నిరీక్షిస్తూ చాలాసేపు అక్కడే తచ్చాడారు.

"ఇక్కడే కదూ!" వాళ్ళల్లో ఒకడు అడిగాడు మెల్లగా.

వాళ్ళ సంభాషణ హిందీలో సాగింది.

"అవును. వాడు చూపించింది ఈ దిబ్బనే" ఇంకొకడు నిర్ధారించాడు.

"మరి సిగ్నలెంతకీ రాదేం?" విసుగ్గా సిగరెట్‌కోసం జేబులు తడుముతూ అన్నాడు ఒకడు.

"మనమే వెళ్లి చూద్దామా?" అన్నాడు ఓర్పులేని ఇంకొకడు.

"అందరమూనా! వద్దు వద్దు. ప్రమాదం. నేనొక్కడినీ వెళ్లొస్తాను. మీరిక్కడే ఉండండి" అంటూ మొదటతనికి సమాధానమిచ్చి వూరివైపుగా నాలుగడుగులు వేయబోయాడు.

అప్పుడు వినిపించిందొక ధ్వని. వాళ్ళ చుట్టూరా తేనెటీగల రొదలాంటి కోలాహలం.

బిత్తరపోతూ నాలుగుదిక్కులూ చూడబోయేంతలో వాళ్ళ నలుగురిమీదా ప్రభంజనంలా విరుచుకుపడ్డారు ఎందరో. వాళ్ళ కాళ్ళనీ, చేతుల్నీ అంగుళం కూడా కదలనీయలేదు. జేబుల్లో ఆయుధాలు తీయనీయలేదు. క్షణాలమీద బందీలయిపోయారు నలుగురూ.

ఆ తరువాత వెలిగాయి తెగిపడిన తోకచుక్కల్లా ఒకటి తరువాత ఒకటిగా కాగడాలు. పదిమందీ పాతికమందీ కాదు వందమందికిపైగా వున్న ఆ ఊరి జనం వాళ్ళను చుట్టుముట్టి ఉన్నారు.

మొహాన నెత్తురు చుక్క లేనట్లుగా భిన్నులయిపోయారు ఆ దుండగులు.

ఆ తరువాత అంతా గందరగోళమే. వీళ్ళేదో అడుగుతారు. వాళ్ళు చెప్పదేమో వీళ్ళకర్థంకాదు. అంతా అయోమయం, గజిబిజి.

"ఊళ్ళోకి తీసుకుపోదాం పదండి. అక్కడ పడదాం వీళ్ళ భరతం" ఎవరో అరిచారు.

ఆ నలుగుర్నీ తోసుకుంటూ దివాణందాకా లాక్కువచ్చారు అందరు కలసి.

పెద్దగా అరుచుకుంటూ, కేకలు పెట్టుకుంటూ వచ్చిన వాళ్ళందరి నోళ్ళూ అక్కడివరకూ వచ్చేసరికి ఒక్కసారిగా మూతపడ్డాయి.

ఊరికి కాపలాగా వూళ్ళో ఉండిపోయిన కరణంగారూ, స్వామిగారూ, పాలేరు పెద్ద వెంకడూ స్పృహతప్పి పడివున్నారక్కడ.

సర్వమంగళాదేవి మందిరం తలుపులు బార్లాతెరిచి ఉన్నాయి.

పార్వతీశం పత్తాలేదు.

* * *

ఆ చిన్ని గ్రామం మళ్ళీ ఒక్కసారి జమిందారుల కాలంనాటి నందడిని, సంరంభాన్ని నింపుకుంది.

కిందటిరోజు సూర్యాస్తమయం దాటాక పొలం నుంచి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న రైతులందరికీ కరణంగారి నుంచి ఒక వార్త రహస్యంగా అందింది.

ఊరిని దోచుకోవడానికి దుండగులొస్తున్నారు. ఎదుర్కోవడానికి సర్వ సిద్ధంగా ఉండమని.

మాజీ అయినా గ్రామస్థులకి కరణంగారంటే దొడ్డ మనసుగల దేవుడు. ఆయన మాట అవశ్యం ఆచరించదగ్గ వేదవాక్కు.

"మీకెలా తెలసింది ఏమిటీ అని ఎదురడక్కుండా రామాజ్ఞ పాటించే వానర సైన్యంమల్లే ఆయన పథకాన్ననుసరించి చీకటిపడ్డాక ఇంట్లో ఏ ఆయుధం దొరికితే దాన్నందుకుని ఒకరి పొలకున ఇంకొకరికి తెలియనీయనంతా గోప్యంగా బయలుదేరి ఊరి చివరకలువ కొలను దిబ్బచాటున

మాటువేసారు.

సరగ్గా కరణంగారు చెప్పినట్టుగానే అర్ధరాత్రి దాటాక పిశాచాల్లా వచ్చిన నిశాచరుల్ని బంధించారు. ఊళ్లోకి ఈడ్చుకువచ్చారు.

నిందితులు నలుగుర్నీ దివాణం వరండా స్తంభాలకి కట్టిపడేసారు.

వాళ్ళ దగ్గర నాలుగు విస్ఫోటకాళ్ళు, కొండరాతిని వగులకొట్టడానికి ఉపయోగించే మందుగుండూ దొరకడంతో గ్రామస్థులందరిలోనూ ఉత్సుకత, ఉద్వేగమూ పొంగిపొర్లాయి.

"కరణంగారి పుణ్యాన మనం అడ్డుకున్నాంగానీ ఆ మందుగుండుతో ఈ ఊర్ని పేల్చేసి ఉండేవాళ్ళు. అమ్మయ్య... గండం గడిచింది" అని పెద్దలు ఆనందిస్తే పెదరాజుల వీచమడిచిన వీరులల్లే అప్పుడే మీసమొలుస్తున్న యువకులు విజయోత్సాహంతో వీరంగాలు వేసారు.

వారికి సమాధానం దొరకని ప్రశ్న ఒకటే.

'స్వామిగారినీ,' కరణంగారినీ కొట్టిందెవరు? పార్వతీశమే. ఈ బందీలకి నాయకుడూ, వీరిని . ఊరిమీదకి దాడికి పురిగొల్పింది అతనే" వాళ్ళ అమాయకతను విడగొడుతూ బలహీనంగా నవ్వారు సీతారామయ్యగారు.

తెరిచిన నోళ్ళు తెరిచినట్టుండగానే మరో పవర్‌ఫుల్ బాంబు పేల్చారు మళ్ళీ ఆయనే.

"అంత మందుగుండు తెచ్చింది, మీ మట్టికొంపల్ని కూల్చి మీ దగ్గరున్న అణాపరకా ఎత్తుకుపోవడానికి కాదురా పిచ్చి వాళ్ళలారా!"

"మరి?"

"పార్వతీశం పారిపోతూ వదిలివెళ్లిన సంచిలో ఒక రాగిరేకు దొరికింది. అందులో ఆనాటి జమీందారులు దాచిపెట్టిన నిధి రహస్యం నిక్షిప్తమై వుంది. దాన్ని దోచుకోవడానికి."

ఈసారి నిశ్చేష్టులైపోయారు జనం.

మరపున పడిన ఒకప్పటి జమిందారీ తరాలు, వారి దర్పం, కలువ కొలను, నిధి, దాన్ని కొల్లగొట్టే అత్యాశతో వచ్చి పరాజితులై భంగపడి నామరూపాల్లేకుండా సమసిపోయిన అభాగ్యులు, పురోహిత కుటుంబం దివాణం వారితో పెట్టుకున్న సంపర్కం, పతనమయి ఛిద్రుపలైన ఆ సంసారం... పాతబడిపోయిన ఆ ఘటనల్ని తలపుల్లోకి తెచ్చుకున్నారు.

అప్పటికి ఊహ తెలీని ఇప్పుడు వ్యక్తులయినవారికి ఆ చరిత్ర చెప్పారు చిలవలు పలువలుచేసి.

అయిపోయిన నాటి మాట అలా వుంచితే ఆ పార్వతీశం ఎంత గుండెలు తీసిన బంటో!

పైనున్న మంచుగడ్డ కరగనీకుండా కింద నీళ్ళు కళపెళ్లాడించినట్టు పండు ఆకారం కసుగందనీకుండాలోన రసం మాయం చేసినట్లు ఇంతమంది కళ్ళు గప్పి ఎంత పని చేయబోయాడు?

"ఆహా పార్వతీశమా! వెర్రిబాగుల భక్తుడల్లే వెనక్కొచ్చింది ఇందుకా?" అనుకుంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

వాళ్ళ వాఖ్యానాలూ, నిష్టూర వాక్యాలు గాయత్రి చెవిన పడకుండా ఉండానికి నానా తప్పలూ పడుతోంది మహాలక్ష్మమ్మగారు.

ఆశల సౌధం కూలిన శిథిలాల క్రింద అణిగిపోయిన జీవిలా, వేళ్ళు కొట్టేసిన భవిష్యత్ వృక్షంలా, విషాదపుపోగులా పడివున్న గాయత్రినీ, ఆ స్థితిలో వున్న తల్లిని ఏ విధంగా ఓదార్చాలో తెలీక విమూడురాలై చేతులు నలుపుతూ కూర్చున్న హేమనూ చూసిన ఎవరికైనా కడుపులో దేవక మానదు.

ఎవరెలా వున్నా జరిగాల్సినవి ఆగవు.

పోలీసులు వచ్చారు. రాగిరేకులో లిఖించబడిన సంకేతాల ముడి విప్పడానికి పురావస్తు శాఖ లిపి నిపుణులు రావింపబడ్డారు.

కానీ దానిలో వాళ్ళని తికమకపెట్టే భాషగానీ, నిగూఢతగానీ లేకపోవడం విశేషం, విషయం సాదాసీదాగా వుంది.

చంకన పిల్లాడ్ని పెట్టుకుని వూరెల్లా వెతకడమన్నా, తలపైకి జరుపుకున్న కళ్ళజోడుకోసం ఇల్లంతా గాలించటమన్నా ఇదే.

ఎంతో విలువైన కలువకొలను తప్పిపోయించి ఎంత మందినో నాశనంచేసీ ఉసురుపెట్టి వెతికీ వెతికీ వేసారించిన ఆ అపూర్వ నిధి ఇంటి పెరట్లో దాగి వున్నదంటే ఎంత విచిత్రం!

మగపురుగు చొరబడ వీలుకానీ వెనుక భాగం అంతఃపుర ప్రాంగణంలో రాణీవాసం కొలిచే సర్వమంగళాదేవి పీఠం కింద రాతి మందసమే ఆ నిధి ఆవాస స్థానం.

ఆ మందసానికి చెందిన ప్రత్యేకంగా ఉండే తాళం చెవిని సర్వమంగళాదేవి విగ్రహం మీద ఒక కీలక స్థానంలో పెట్టి తిప్పితే దేవి విగ్రహం, క్రింద మందసపు మూతతోనహా నులువుగా పక్కకు జరపవచ్చు.

నిధిని వెలికి తీసేముందు విశేషమైన పూజలు, బలులు జరిపించాలి.

ఇదీ తామ్రపత్ర సారాంశం.

ఎంత వెదికినా పార్వతీశం చేతి సంచిలో ఆ తాళం దొరకలేదు.

ఇక మిగిలిన మార్గం ఒకటే. విగ్రహాన్ని బలవంతంగా పెకిలించి పక్కకి పెట్టాలి. రాతి మందసాన్ని మందుగుండులో పేల్చాలి

తప్పదు.

పార్వతీశం కూడా ఈ ఫార్ములానే ప్రయోగించదలిచాడంటే అతనికి కూడా ఆ తాళం చెవి దొరికి ఉండదు. లేదా పారేసుకుని ఉండాలి.

ఎంతో కష్టంమీద అమ్మవారి విగ్రహాన్ని పీఠం మీంచి తొలగించారు. దూరంగా పెట్టారు. మందసాన్ని పగులగొట్టవచ్చేమో నని గునపాలతో ప్రయత్నించినప్పుడు తెలిసింది అది రాతిది కాదు ఉక్కుదని.

అధికారుల సమక్షంలో, పురోహితులు లక్ష్మీస్తోత్రం పఠిస్తుండగా ప్రజలు జయజయధ్వానాలు చేస్తుండగా సిరిదేవికి ఆహ్వాన దుందుభి మ్రోగించినట్టు మందుగుండు పేలింది.

లక్ష్మి ఆవిర్భవించింది.

ఛిద్రమైన ఉక్కు తునకలతోపాటు బంగారుకణికలు కూడా ఎగిరిపడ్డాయి.

మణిహారాలు, వజ్రవైఢూర్యాలు, బంగారునాణాలతో నిండిన గని, ఐశ్వర్య ఖని చుట్టూ వున్నవారి కళ్ళు జిగేల్మనిపిస్తూ సాక్షాత్కరించింది.

❁ ❁ ❁

నిధిని ప్రభుత్వానికి అప్పగిస్తూ కరణంగారు "జమిందారుల నిష్క్రమణతో మరచిపోయిన మా గ్రామాన్ని అభివృద్ధి పరచండి. ఈ నిధిని దుండగుల పాలవకుండా రక్షించి మీకందించిన స్వామిగార్ని వారి ఆశ్రమాన్ని మరచిపోకండి" అని కోరారు.

❁ ❁ ❁

ఆ చిన్ని స్టేషన్లో రైలాగింది.

అతి భయంకరమైన డిప్రెషన్‌కి లోనయి నవనాళ్ళుకుంగినట్టు ప్రేతకళ వడి నిస్తేజంగా తయారైన గాయత్రిని, సందెట పొదుపుకున్నట్లుగా భుజం చుట్టూ చెయ్యేసి ఊరడింపుగా ఏదో చెబుతున్నది మహాలక్ష్మమ్మగారు.

రైలాగడంతో చలనం వచ్చినట్లుగా మహాలక్ష్మమ్మగారి చేతిని తన హస్తంలోకి తీసుకున్నది గాయత్రి.

"పిన్ని ఈ ఊరికీ మాకూ ఇంకా ఏదో సంబంధముందనీ, ఉంచుకుందామనీ ఆశపడ్డాను. ఆ సర్వేశ్వరుడికి మామీద మళ్ళీ దయ పుట్టిందనీ, రప్పించుకుంటున్నాడనీ ఆనందపడ్డాను. మా రాక దైవ ద్రోహానికి సాయపడ్డానికని కల్లో కూడా అనుకోలేదు. ఇక ఏ మొహం పెట్టుకుని ఈ ఆలయంలో అడుగుపెట్టను? ఆ తండ్రి దర్శనం చేయను? ఈ జన్మకి ఈ ఊరితో రుణం తీరిపోయింది పిన్నీ తీరిపోయింది. మా తప్పులు మీరయినా క్షమించగలిగితే క్షమించండి. సెలవు" గాద్గదికంగా అంటూ మొహం చూడలేనట్టుగా రైలెక్కి కూర్చున్నది.

వంగి పాదాలంటుతున్న హేమని లేవనెత్తి తల నిమిరారు సీతారామయ్యగారు.

"అమ్మా హేమా! సమస్యలనధిగమిస్తూ కంటకాలను తొలగించుకుంటూ ముందుకు చొచ్చుకుపోగల ఆధునిక యువతివి నువ్వు. నీ గురించి నాకు బెంగలేదమ్మా. అమ్మ ఆలా కాదు. అయిన గాయాన్ని మానుపట్టనీకుండా తడుముతూ బాధతో కుములుతూ వర్తమానాన్ని దుఃఖభాజనం చేసుకునే తరహామనిషి. అమ్మకి ధైర్యం నూరిపోసే బాధ్యత ఇక నీదే నమ్మా" అన్నారు.

తల వూపింది హేమ.

స్వామిగారి దగ్గరగా వెళ్లి నమస్కరిస్తుంటే "నా మూలంగానే నీకింత మనస్తాపం సంభవించిందేమోనని చింతిస్తున్నాను హేమా" అన్నారు.


"ఎంత మాట మాస్టారూ! నాకిది అపకారం కాదు ఉపకారమే. పైగా ఇందులో మీ ప్రమేయం నిమిత్తమాత్రమని తెలియని బుద్ధిహీనురాలిని కాదు" అన్నది నొచ్చుకుంటున్నట్టుగా.

తనకు వీడ్కోలు చెప్పేందుకు వచ్చిన ఆశ్రమం పిల్లలనీ, వృద్ధులనీ, వూరి పెద్దలనీ కలియజూసింది కృతజ్ఞతగా.

అందరి దగ్గరా సెలవు తీసుకున్నది. రైలెక్కి నిలబడింది హేమ ద్వారం దగ్గర.

దిగులుగా చెయ్యూపుతున్నారందరూ. జాగ్రత్తమ్మా అని హెచ్చరిస్తున్నారు. ఉత్తరాలు రాస్తుండమని, మరచిపోవద్దని పదేపదే చెబుతూ అప్పగింతలు పెడుతున్నారు.

పిల్లలకయితే అసలు నోటంట మాటలు రావడం లేదు. కళ్లంట బొటబొట నీళ్ళు



కారిపోతున్నాయి.

గుండె చెమరించింది హేమకి.

'రిక్తహస్తాలతో వెనుతిరగడంలేదు తను. ఇంత మంది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని వెళ్తోంది. అమూల్యమైన ఈ సంపద ముందు ఆ నిధి విలువ ఏపాటిది?' తృప్తిగా అనుకున్నది.

రైలు కదిలింది. వేగం పుంజుకుంది. వూరు కనుమరుగైంది.

హేమ వెళ్లి తల్లి పక్కన కూర్చుంది నిట్టూరుస్తూ.


కంపార్టుమెంటులో పెద్దగా జనంలేరు. వున్నా ఒకరిద్దరు వేరే వింగ్‌లో కూర్చున్నారు. హేమ తల్లి వంక చూసింది.

గాయత్రి యోగనిద్రలో వున్నదానిలా కళ్ళు మూసిసీటుకి జార్లబడి వుంది.

అప్పుడు తీసింది హేమ ఉత్తరాన్ని.

నిన్నటి దినం పోస్టులో వచ్చిందామెకది. అడ్రసు రాసిన దస్తూరీ పరిచితమైనది కాదు. కానీ రాసిందెవరో హేమకి చూచాయిగా అర్థమయింది.

తల్లికి గానీ, మరెవరికి గానీ



చూపించడానికి ఇష్టం లేక నిన్నటినుంచీ దాన్ని తెరవనేలేదు.

తల్లివంక మరోసారి చూసి కవరువిప్పింది హేమ.

పెద్ద ఉత్తరమే. పైన సంబోధన కానీ, క్రింది సంతకంగానీ లేదు.

చదవసాగింది హేమ.

"నేను వెళ్ళిపోతున్నాను. మీ దృష్టిలో పారిపోతున్నాను. మీరూహించినట్టు నిధి తవ్వుకుపోదామనే వచ్చాన్నేను. ఎన్నో ఏళ్ళు యోచించి ప్రణాళిక వేసుకుని సరంజామా కూర్చుకుని వస్తే ఫలించే సమయానికి రసాభాస అయింది. వచ్చిన త్రోవ వెతుక్కుంటూ పలాయనం చిత్తగించక తప్పలేదు.

ఏం చేయను, నేను అనుకున్నదొకటి జరిగిందొకటి అయింది.

ఏది ఏమయినా ఈ మూడు నెలలూ అన్నం పెట్టి అభిమానం రుచి చూపించిన మీకు వెళ్ళే ముందు కొన్ని నిజాలు చెప్పి పోవడం నా ధర్మంగా భావిస్తున్నాను.

నేను పార్వతీశాన్ని కాదు, వెంకటచెలాన్ని."

క్షణం గుండాగిపోయింది హేమకి. మరుక్షణం జెట్ స్పీడులో కొట్టుకోవడం మొదలుపెట్టింది.

ఎగిసిపడే గుండెను అదిమిపెట్టి భయ విహ్వలతతో తల్లివైపు చూసింది హేమ.

గాయత్రి యోగముద్రలో మార్పేమీ లేకపోవడంతో తిరిగి దిటువు తెచ్చుకుంటూ ఉత్తరంలోకి చూపులు మరల్చింది.

"బొంబాయిలో పరిచయమయ్యారు నాకు మీ నాన్న సుందర్రామయ్యగారు, పార్వతీశమూను. అప్పటికే చాలా దేశం తిరిగారుట. పెద్ద పులేదో మీద కురుకుతున్నట్లు, ఎవరో వెంటాడుతున్నట్లు తమ నీడకు తామే దడుస్తూ భయం భయంగా ఉండేవాళ్ళప్పుడూ.

నేనూ ఇంటినుంచి పారిపోయి వచ్చినవాణ్నే మొదట్లో నేనూ అలాగే భయపడుతూ ఉండేవాణ్ని.

నేను తెలుగువాణ్ని. ఈ ప్రాంతం వాణ్ని. పైగా పరిపోయొచ్చిన పోలికలు కూడా కలసిన ఒక జాతి పక్షులం. కాబట్టి మాకు స్నేహం ఇట్టే కుదిరిపోయింది.

కలసి తిరిగాం. కలసి తిన్నాం. ఎక్కడ తిరగామో ఏమి తిన్నామో ఎన్ని ఊళ్ళు చూశామన్నది తెలుసుకోకపోవడమే మంచిది. చివరికి ఓ సన్యాసి బాబా వెంట ఢిల్లీకొచ్చిపడ్డాం.

నాకు దావరికం లేదు. మాది రాజమండ్రి దగ్గర పల్లెటూరు. ఉన్నత వంశంలోనే పుట్టాను. నా పన్నెండో ఏట ఆరో సంతానాన్ని ప్రసవించి మా అమ్మ మరణించింది. మరు సంవత్సరం మా మారుటమ్మ మా గృహ ప్రవేశం చేసింది.

ఊహరాని నా మిగతా తోబుట్టువులు ఆవిడకి మాలిమయిపోయారు. ఎవరిది తప్పో చెప్పలేనుగానీ ఆవిడకీ నాకూ ముందునుంచీ పడలేదు.

నాన్నతో నామీద చాడీలు చెప్పి కొట్టించిందన్న కోపంతో ఆవిడ నిద్రపోతుంటే దుడ్డుకర్రతో బుర్రమీద ఒక్క పెట్టుపెట్టి మరి వెనక్కి చూడకుండా ఊరుదాటిపోయాను. అప్పట్నుంచీ అన్ని వూళ్ళూ నా ఊళ్లే!

నా కథంతా మీవాళ్ళకి చెప్పేసాను.

సుందర్రామయ్యగారు చాల ఘటికులు. అరమరికలు లేకండా నేనేమిటో చెప్పినందుకైనా మేమలా అని మాట జారిన పాపాన పోలేదు.

పార్వతీశం అమాయకుడు. బావగారి మాటకి తానా తందాన అనడంతప్ప స్వంత ఆలోచనంటూ లేనివాడు. అతన్ననుకోడానికి లేదు.

పోనివ్వండి. ప్రతి మనిషి వెనుక ఎన్నో చీకటి కోణాలుండవచ్చు. తలుపు తెరిచి అందరికీ అన్నీ చూపించుకోవాలనేమున్నదీ?

గతాన్ని తలవకుండవుంచె, మిగతా విషయాల్లో మీవాళ్ళు చాలా స్నేహపాత్రులు. బ్రతికి వున్నంత కాలం సుందర్రామయ్యగారు నన్ను తమ్ముణ్ని చుసుకున్నట్లే చూసుకునేవారు. తమ్ముడూ అనే పిలిచేవారు.

అవును మీకిదో షాకు అవుతుందని నాకు తెలుసు.

సుందర్రామయ్యగారు ఎనిమిదేళ్ళ క్రితం పాత ఢిల్లీ మురికి పేటల్లో విరచుకుపడిన విషజ్వరానికి బలయిపోయారు.

పార్వతీశం పిచ్చి వాడయిపోయాడు.

తిరణాలలో తల్లివేలు వదిలిన పసివాడి చందంగా రెక్కలురాని పక్షి కూన గాలివిసురుకు గూడు జారి నేలపడిన విధంగా బెంబేలెత్తిపోయాడు.

ఆ సమయంలో నడిసముద్రంలో తుఫానుకి గురై తెరచాప చిరిగి కొట్టుమిట్టాడే నౌకకు మిగిలిన దిక్సూచిలా ఆ పరాయి ప్రదేశంలో అతనికి దొరికిన ఏకైక ఆధారాన్నయ్యాను నేను.

ఒంటరి అయిపోయిన పార్వతీశం బల్లిలా నన్నంటుకుని ఉండేవాడు. బావగారి అదుపు లేకపోవడం వల్ల తన గతం గురించి పెదవి విప్పింది కూడా అప్పుడే.

"మీరే తప్పిదమో చేసి ఇల్లు వదిలి ఉంటే ఆ తప్పటడుగుల బాధ్యత మీ

బావగారిదేగానీ ఆ అడుగుల్లో అడుగు కలిపిన నీదయి ఉండదని నా విశ్వాసం. కీకారణ్యాల్లాంటి ఈ నగరాలు, నక్కలూ, దుమ్ములగొండ్లల్లాంటి నాలాంటివాళ్ళు బతగ్గలరే గానీ పెంపుడు జంతువుల్లాంటి నీబోటివారు మనలేరు. నా మాట విని వెనక్కి తిరిగి మీ అమ్మానాన్నల దగ్గరికి వెళ్లిపో. మీకోసం వాళ్లెంతగానో ఎదురుచూస్తూ వుందుంటారు" అన్నాను.

అప్పుడు చెప్పాడు "మా ఊళ్ళో మా కోసం ఎదురుచూసేది మావాళ్ళొక్కళ్లేకాదు చలం. రాజుగారి మనుషుల రూపంలో నా మృత్యువు కూడా. ఇంకెలా వెళ్ళగలను? పైగా వెనక దన్ను మా బావగారుకూడా లేకుండా" అని.

అప్పుడు విప్పాడు గత పుటల్ని.

మీ వూరు, అందరూ మావాళ్ళే అనుకునే ఆ అమాయక జనం, మీ గుడి, గుళ్ళో కపాలేశ్వరుడు, ఆ పరమేశ్వరుడికి ప్రతిరూపంలాంటి తండ్రి, నోట్లో నాలుకలేని అమ్మ, అన్ని విచారాల్నీ కడుపులో దాచుకోగల అక్క, బావ రూపంలో గురువైన బావగారు. కళ్లతోనే నాకన్నీ తెలుసునని బెదిరించగల చురుకు చూపుల మరదలు, బొమ్మలాంటి ఆ పిల్లతో అయిన బొమ్మల పెళ్లిలాంటి వివాహం, తండ్రి శిక్షణలో వరంగా అబ్బిన సంస్కృత భాషా జ్ఞానం, దివాణంలో అర్చకత్వం.

ఇంతవరకూ మీకూ తెలుసు. ఇక్కడ్నించే మీరు ఇప్పటికీ విప్పలేని చిక్కుముడికి సమాధానం వుంది.

పార్వతీశం సంస్కృత భాషా పరిజ్ఞానాన్ని దివాణంవారు ఉపయోగించుకోవాలనుకున్నారు.

దేవతార్చన, పురాణం చెప్పించుకోవడం, అంతఃపుర స్త్రీలు నోములు నోయడం, ఇవన్నీ అతన్ని ఎక్కువసేపు దివాణంలో అట్టే పెట్టుకోవడానికి చెప్పేమిషలు.

ఎప్పటెప్పటివో పురాతన తాళపత్రాలు, తామ్రపత్రాలు తెచ్చి ఇచ్చి చదివి అర్థం చెప్పమనేవాళ్లట. ఈ విషయాన్ని తల్లిదండ్రీతో కాదుకదా గురువుగారైన బావగారితో కూడా చెప్పకూడదని కట్టడి. చెబితే సర్వనాశనం చేసేస్తాం సుమా అని బెదిరింపు.

ఆయా సమాయాల్లో సుందర్రామయ్య గారిని ఊళ్ళో ఉండనీయకుండా పట్నంలో పని ఒప్పగించి పంపించేశేవారట.

కానీ పార్వతీశానికి దివాణం వారి భయంకంటే బావగారిమీద భక్తే ఎక్కువ తూకంలో ఉంది. పత్రాలలో తెలిపిన విశేషాలతోపాటు వాళ్ళు వెల్లడించవద్దన్న మాట కూడా బావగారికి విన్నవించేసి తన విధేయతను చాటుకునేవాడట.

కొన్నాళ్ళవరకూ ఆ పత్రాల సమాచారం ఏమంత సాముఖ్యమైనదిగా లేదు. పూర్వపు ప్రభువులకు ఏ మహారాజో ఇచ్చిన బిరుదులు, లేదా కానుకలుగా ఇచ్చిన జాగీర్లు, ధనం, వాటికి సంబంధించినవే.

"ఏవుందిందులో. వాళ్ళకు లవ్వ కలిసోస్తే మనకేం ఒరిగిందీ" అని పెదవి విరిచేశాడట సుందర్రామయ్య.

ఆ తరువాత లభించిన వాటిల్లో విశేషమున్నది.

ఒకరోజు దివాణంలోని పెద్ద తలకాయలన్నీ ఒకచోట కూడిన రహస్య సమావేశానికి పార్వతీశం పిలిపించబడ్డాడు.

ఆ కిందటిరోజే చేతినిండా డబ్బిచ్చి సుందర్రామయ్యని పట్నం పంపించివేసారు.

అయన్ని అడపాతడపా పట్నం పంపించి చేయించుకుంటున్న పనులేవో బహు చిన్నవి. ప్రతిఫలం చాలా ఎక్కువ.

ఇది కాకుండా సుందర్రామయ్యగారి చపలచిత్తం చాటునా మాటునా రాణీవాసం దానీలతో సరసమాడుతూ ఉందనిన చెవినబడుతున్నా తెలిసీ తెలీనట్లుగా అపేక్షిస్తూ వుండేవాళ్ళట.

ఆనాటి సమావేశంలో రాజుగారి మూడో కొడుకు రెండు రాగి రేకుల్ని అతి పదిలంగా తెచ్చి పార్వతీశానికి అందించాడు.

"చిన్నఅయ్యవారూ! పాతవాటిలా సాధారణమైన పత్రాలు కావు సుమా. జాగ్రత్తగా చుసి చదవండి" పెద్దకొడుకు హెచ్చరించాడు.

వాటిలో లిపి కూడా సంస్కృతమే. విషయం కూడా విపులంగానే వుంది.

వారి వంశంలో ఎనిమిదోవాడైన రాజా మార్తాండ వర్మ వ్రాయించిన గుప్త పత్రం అది.

తరతరాలుగా అభివృద్ధి పరుస్తూ ముందు తరంవారికి వారసత్వంగా సంక్రమింపచేస్తున్న తమ అంతులేని సంపద మణి మాణిక్య కనకాదులను బందిపోట్ల వెరపుతో దొంగ చేతికే తాళాలు అంపకం చేసిన సామెతగా ఆ బందిపోట్లు ఇలవేల్పుగా కొలుచుకునే మరిడి మహంకాళమ్మ గుడిలో రెండు నిలువుల లోతున రెండు మందసాలలో పూడ్చి పెట్టి పైన గుర్తుగా పోతురాజు శిల ఒకటి ప్రతిష్టించారట.

విపత్కర పరిస్థితుల్లో తమ పుత్ర పౌత్రాదులు మాత్రమే దాన్ని వెలికి తీసి అనుభవించాలని ఆయన అభిలాష.

ఈ రహస్యం తమ వంశస్థులు ఒకరి తరువాత ఒకరు తమ వారసులకు అందజేయాలని ఆయన ఆదేశం.

పత్రం రెండోవైపున ఆ గుడి సరిహద్దులు, నైసర్గిక స్వరూప వివరణ వ్రాసి వున్నాయి.

ఇక మొదటి పత్ర కాలానికి, రెండవ పత్ర కాలానికి చాలా వ్యత్యాసముంది.

అప్పటికి వాళ్ళ సంస్థానాలు పోయాయి. రాజులన్న బిరుదులు మాత్రం మిగిలాయి.

రెండవ పత్రం కలువకొలను నిర్మించిన రాజా భుజంగవర్మ వ్రాయించినది.

లిపి స్పష్టంగానే వుంది. అర్థం తెలుస్తూనే వుంది. భావం మాత్రం తికమకగా వుంది.

'నిధి కైవసం చేసుకున్నాను. ఇక కనుమరుగు కానీయను. ఆనవాలుకి ఆనవాలుగా కలువకొలనును కట్టించాను. నిధి దర్శనం చేయాలంటే అంబని ఆశ్రయించక తప్పదు. ఈ రహస్యం మాత్రం నా పూర్వీకుడి ఆన మేరకు నా అంతిమ దినాల్లో నా నోటి నుండి నా కుమారుని శ్రవణాలకు మాత్రమే అందీయబడుతుంది.

ఈ అంశాన్ని నా వంశం వారందరూ ఆవశ్యం ఆచరించి తీరాలని నా హెచ్చరిక.

ఈ రెండు పత్రాల సారాంశం మీదా అక్కడున్న పెద్దలందరూ చర్చలు జరిపారు.

మొదటి పత్రం తేటతెల్లంగా ఉంది.

ఊరికి చివర్న చిన్న మహంకాళమ్మ గుడి పాడుపడి శిథిలావస్థలో ఉండేదట పూర్వం. మార్తాండవర్మ వ్రాయించిన హద్దులు నైసర్గిక రూపం దీనికి సరిగ్గా సరిపోతుంది.

దానిలోని అమ్మవారినీ, పోతురాజు శిలనీ ఊరికి మరోవైపునవున్న గ్రామ దేవత రాములమ్మ గుడిలోకి మార్పించి ఆ చోట కలువకొలను నిర్మించాడు భుజంగవర్మ. దీన్నిబట్టే మొదటి పత్రంలోని మహంకాళమ్మ గుడి అదేననీ, నిధిని ఆయన కనుగొన్నాడనీ అర్థమవుతోంది.

జాగ్రత్త కొరకు ఆ నిధి తమ ఆధీనంలోనే ఉండేలాగున ఎంతో ఖర్చుచేసి కలువకొలను కట్టించాడు. అదీ బాగానే వుంది. ఆ తర్వాత వాక్యార్థమే బోధపడ్డంలేదు. అంబ అంటే ఎవరు? ఆశ్రయించటమంటే ఏం చేయాలి?

వంశంలో ఒకరినుంచి ఒకరికి చేరవేసిన ఈ చివరి రహస్యం భుజంగవర్మ తదనంతరం ఆయనగారి సంతానం సుగుణవర్మ గుర్రప్పందేలికి చెన్నపట్నం వెళ్లి అక్కడే గుండాగి మరణించడంతో మిగతా తరాలకి తెలీకుండా పోయింది.

అనుకోకుండా ఆ రెండు పత్రాలూ ఈ తరం రాజాగారి మూడో కొడుకు కళ్ళబడ్డాయి. అవి దాచబడిన వైనం అనుమానాస్పదంగా తోచి అతను ఎవరితో చెప్పకుండా వాటికి చేతనయినట్లు తానే నకళ్లు వ్రాసుకెళ్లి ఎవరితోనో చదివించుకున్నాడు. కలువకొలను అడుగున నిధి ఉన్నదన్న రహస్యం బయటపడింది. దొంగతనంగా కలువ కొలను త్రవ్వించిన తొలి ప్రయత్నం అతని ఆధ్వార్యంలోనే జరిగింది.

కొన్ని రహస్యాలు ఇంగువ లాంటివి. దాచుదామన్నా దాగవు. చాలామందికి ఈ ఉప్పందిపోయింది.

అన్నదమ్ముల్లో వివాదాలు రేకెత్తాయి. అఫిషియల్‌గా అనఫిషియల్‌గా కలువ కొలను మీద దాడులు జరిగాయి. దాదాపు మూడొంతులు తవ్విపోసి పరీక్షించడం జరిగింది. ఫలితం శూన్యం. ఎవ్వరికి ఏమి దొరకలేదు.

అప్పుడు అన్నదమ్ములందరూ ఏకమయ్యారు. అందరూ కలసి ఏమి చేయడమో నిర్ణయించుకోవాలని నిశ్చయించారు. నిధిని ఆవిష్కరించటమెలా అని తర్జనభర్జనలు చేశారు.

అనుమానం తీర్చుకుంటే పోతుందని మహంకాళమ్మని ప్రతిష్ఠించిన రాములమ్మ గుడిని పునరుద్ధరిస్తున్నామనే నెపంమీద పూర్తిగా పెళ్ళగించి చూసారు. అక్కడా ఏమీ దొరకలేదు.

చిట్టచివరకు పార్వతీశాన్ని పిలిపించి ఇంకేమన్నాకల్లా వున్న పత్రం దొరుకుతుందేమోనని ఇంట్లో వున్న పాతకాలం పత్రాలన్నీ చదివించారు. ఊహూ... ఆఖరికి ఈ అసలైన రెండు పత్రాలూ ఇచ్చి పజిల్ విడగొట్టే సంకేతాలున్నాయేమోనని చూడమన్నారు. పార్వతీశం ప్రతి పదానికి అర్థం చెప్పాడు.

కొత్తగా లభించిన విశేష సమాచారమేమీ లేకపోవడంతో తలలు పట్టుక్కూర్చున్నారు పెద్దలంతా.

ఈ విషయం సుందరరామయ్యగారికి చెబితే ఏమియోచన చేశాడోగానీ "జాగ్రత్తరా ఈశా! ఈసారి ఏమన్నా తెలిస్తే నాకు ముందు చెప్పు. మనకేమన్నా లాభిస్తుందేమో చూద్దాం" అన్నాట్ట.

లాభం మాటేమోగానీ కడుపులో చల్ల కదలకుండా ఒక గాడిలో సాగిపోతున్న వారి జీవితాలు తుపాకీ గుండు పేలుడుకు కకావికలుగా ఎగిరిపోయి గూడులేని పక్షుల్లా మిగిలిపోవడానికి కారణమయిన సంఘటన కొద్దిరోజుల్లోనే జరిగింది.

అమావాస్య వెళ్లిన మరునాడు దేవుళ్ళకి సంప్రోక్షణ కార్యక్రమం పెట్టుకున్నాడు పార్వతీశం.

దాసీవాళ్ళని దూరంగా ఉండమని చెప్పి చిన్న అంగోస్త్రం కట్టుకుని నూతి పళ్లెంలో కూర్చుని ఒక్కొక్క విగ్రహాన్నే జాగ్రత్తగా శుభ్రం చేస్తున్నాట్ట.

దుర్గాదేవి పంచలోహ విగ్రహాన్ని తోముతుండగా ఆ తల్లి నడుము

వడ్డాణానికున్న వజ్రం పార్వతీశం రాగి ఉంగరానికి తగులుకున్నదట. అది చూసుకోకుండా లాగేసరికి ఏమయిందో తెలీదు టిక్కుమంటు విగ్రహం రెండుగా విడిపోయి అందులోంచి చుట్టగా చుట్టిన రాగి రేకు ఒకటీ, గమ్మత్తుగా వున్న తాళం చెవి ఒకటీ పార్వతీశం దోసిట్లో పడినాయి.

దిగ్భ్రాంతిలో వుండే యధాలాపంగా గారిరేకు చుట్టని విప్పి చదివాడు.

'మార్తాండవర్మ దాచిన మహంకాళమ్మ గుడిలోని నిధిని కనుగొన్న భుజంగవర్మ ఆ సంపదను ఇక అక్కడుంచదలచలేదు. ఆ లక్ష్మిని పెద్ద పీఠంలో బంధించి పైన అంబ ప్రతిరూపమైన సర్వమంగళాదేవిని నిలబెట్టాడు. అనుమానం సోకిన లోకుల్ని మాయ చేసేందుకు కలువ కొలను కట్టించాడు. ఈ రహస్య కార్యాన్ని పూర్తిచేసిన శిల్పులిద్దర్నీ స్వర్గానికి పంపించి కళేబరాల్ని కలువ కొలను అడుగున స్థాపితం చేసారు.

అసలైన నిధి రహస్యం అదే. ధనమున్న పీఠానికి సంబంధించినదే ఆ తాళం.

ఇక వెనుకా ముందూ ఆలోచించలేదు పార్వతీశం. అవి చేతబట్టుకుని జామతోటలో వుంటానన్న బావగారి దగ్గరకు పరుగెట్టాడు.

ఎవ్వరికీ అంతుపట్టని మర్మాన్ని ఛేదించానన్న సంబరం ముంచుకొస్తున్న ఆపదని కానలేకపోయింది.

అంగవస్త్రంలో ఏదో దాచుకుని పార్వతీశం పరిగెత్తడాన్ని చూసిన దాసీజనం దివాణం వారిని మేల్కొల్పి ఉంటారు.

రెండు రెళ్ళు నాలుగన్నట్లు తెలియడం లేదనుకుంటున్న తామ్రపత్రంలోని వాక్యానికి అర్థం విడిపోయి వున్న అమ్మవారి విగ్రహం తెలియజెప్పి వుంటుంది.

బావగారు వేసే ప్రశ్నలకి బావమరిది వివరణ ఇంకా పూర్తికాలేదు. రొప్పుకుంటూ పార్వతీశం చెలికాడొకడు పరుగెత్తుకు వచ్చేశాడు.

"పారిపొండి, పారిపొండి. మీ కోసం రాజాగారి నౌకర్లు దుడ్డుకర్రలు పట్టుకుని ఇల్లిల్లూ గాలిస్తున్నారు" అని చెప్పి అదే వేగంతో పారిపోయాడు.

అప్పుడు తెలిసింది ఆ ఇద్దరికీ తామెంత ప్రమాదంలో వున్నదీ!

అంతే! దారీతెన్నూ చూసుకోకుండా చేలకు అడ్డంబడి పరుగెత్తారు.

"వాళ్ళవి వాళ్ళకిచ్చేస్తానని చెబితే మన జోలికి రారు కదా! పారిపోవడమెందుకు?" పార్వతీశం పరిగెడుతూనే అడిగాడు.

"ఎంత పిచ్చివాడవురా! మృత్యువు తరుముతుంటే ఎదుట నిలబడి నాకు వయస్సు చెల్లలేదు, ఆయుష్షు తీరలేదు అంటూ చంపకుండా ఉండటానికి రీజను చెబుతావా? వింటుందనే! ముందుగా మెడకి పాశం విసిరి ఆనక మిగతాది యమలోకంలో చెప్పుకోమంటుంది. నిధి రహస్యం మన కంట పడిందని తెలిశాక వాళ్ళు మనల్ని బ్రతకనిస్తారనుకుంటున్నావా? వెర్రివాడా! వద వద. ప్రాణాలు నిలుకోవాలంటే కాలికి బుద్ధి చెప్పడమే శ్రేష్ఠం" అన్నాట్ట.

పరుగెత్తారు, పరుగెత్తారు. కనిపించిన వాహనం ఎక్కారు. ఎక్కడెక్కడో తిరిగారు. ఇక్కడకొచ్చి పడ్డారు.

ఇలాంటప్పుడే విధిని నమ్మాలనిపిస్తుంది.

కోట్లు కిమ్మత్తు చేసే సంపదకు దారి చేతిసంచిలో పెట్టుకుని అడుక్కున్న ఎండు రొట్టముక్కలు తిన్నారు. ధర్మం చేసిన పీలికలు కట్టుకున్నారు. దుమ్మూ ధూళిలో నిద్రించారు. దురదృష్టం కాకపోతే మరేమిటీ!

నిండా ఇరవై ఏళ్ళు లేవు పార్వతీశానికి. పాపం అప్పుడప్పుడు అమ్మ మీదకీ, అమ్మ వున్న ఇంటిమీదకి ధ్యాస మళ్లి అల్లాడేవాడు.

"బావా! రాజాగారికి ఆ దిక్కుమాలిన రేకూ అవి పంపించేద్దాం. క్షమించమని వేడుకుందాం. ఆస్తి వాళ్ళ స్వాధీనంలోకి తెచ్చుకున్నాక మనమీద వగ ఎందుకుంటుంది?" అని గునిసేవాడట.

"ఛత్! కీలకం మన దగ్గర పెట్టుకుని వాళ్ళకి దాసోహమనడమేమిటి? చూస్తూండు. రెండు మూడేళ్ళు ఉద్రేకాలు సద్దుమణగనీ. మన కాళ్ళ దగ్గరికి వాళ్ళని రప్పిస్తానో లేదో'' అనేవారట సుందర్రామయ్యగారు.

ఇల్లు విడిచిన దగ్గర్నుంచీ పడుతున్న అగచాట్లు బావగారి సామర్థ్యం మీద కొద్దిపాటి అవిశ్వాసం. ఆయనగారి పద్ధతులు మంచివనుకున్న తన అంచనా తప్పేమోనన్న అనుమానం పార్వతీశం మనస్సులో చోటు చేసుకునేలా చేశాయి. కాని ప్రస్తుతం ఆయనొక్కడే అతనికి దిక్కు మరి. ఏమన్నా ఊ అనక తప్పదు.

సందర్రామయ్యగారి బుర్రలో ఏమి ఎత్తుగడ ఉన్నదో తెలీదుగానీ ఆలోపలే మృత్యువు కబళించేసిందాయన్ని.

బావగారి మరణం పార్వతీశాన్ని కృంగదీసి విరక్తుడ్ని చేసిందనాలి. మానసికంగా కూడా సంఘర్షణకీ లోనయ్యాడనుకుంటాను. 'దేవుడ్ని నమ్ముకోమన్న మా నాన్నగారి హితవు విననందుకు నాకీ శాస్తి జరగాల్సిందే' అనుకునేవాడు పదేపదే పశ్చాత్తాపపడుతూ.

ఒక్కోసారి నిశ్శబ్దానికి భయపడుతున్నట్టుగానో ఆలోచనల వాడికీ వేడికీ తట్టుకోలేనట్టుగానో విపరీతంగా మాట్లాడేవాడు. మీ ఊరి గురించి, వూళ్లో

వాళ్ళ గురించి వర్ణించి చెప్పేవాడు. ఉన్నట్టుండి స్తబ్దుగా అయిపోయేవాడు.

క్రమక్రమంగా ఆ స్తబ్దత ధ్యానంగా రూపాంతరం చెందింది. రానురాను ఆ ధ్యాన సమయం పెరిగి పెరిగి ఆకలి దప్పికలను కూడా మరిపించగలిగే స్థాయికి చేరుకున్నది.

అతనలా ఎప్పుడు చూసినా ఏ దేవాలయంలోనో కళ్ళు మూసుకుని కూర్చుండిపోతుంటే వేళకతన్ని లేవదీసుకొచ్చి స్నానం పానం చూసేవాణ్ని.

అలాగూ ఎంతోకాలం సాగలేదు. రానురాను పార్వతీశం ధ్యానంతో సరిపుచ్చుకోవడం లేదు. కాషాయం కట్టిన ఏ సాధు సన్యాసులు కనబడ్డా ఏ మంత్రమో తపదేశించమంటూ వెంట తిరగడం. వాళ్ళతో రుషీకేశమో, హరిద్వారమో వెళ్లి నాలుగయిదు రోజుల తరువాత మొహం వేళ్లాడేనుకుని తిరిగి రావడమో పరిపాటయింది.

ఒకసారి రుషీకేశ్‌లో ఒక ఆశ్రమంలో ఎవరో పేరొందిన స్వామీజీ ఆధ్యాత్మికోపన్యాసాలు ఇస్తున్నారంటూ వెళ్లాడు. వారం తరువాత వచ్చి 'నేను స్వామివారితో రుషీకేశ్‌లోనే ఉండిపోతున్నాను. నన్నాయన శిష్యుడిగా స్వీకరించారు' అని చెప్పాడు. ప్రపంచాధిపత్యం దొరికినంత సంబరంగా, కొన్నాళ్ళు శిష్యరికపు సేవ అనంతరం సన్యాస మిప్పించి మంత్రోపదేశం చేస్తానన్నారు' అన్నాడు నిధి సొంతం చేస్తానన్నంత సంతోషంగా.

వెళ్ళేముందు కాస్సేపు నా దగ్గర కూర్చున్నాడు.

"బంధాలూ, అనుబంధాలతోసహా నాకున్నవన్నీ త్యజించి రమ్మని గురువుగారి ఆజ్ఞ. ఇంటికి తిరిగి వెళ్లే ఆశ పోయాక నావాళ్ళ మీద మమకారం పోయింది. బావ పోవడంతో నాకన్నిటిమీదా విరక్తి పుట్టింది. ఇక నువ్వున్నావు. నువ్వు నన్ను పట్టి ఉంచగల సంకెలవికావు. వస్తురూపంలో కూడా నన్ను ప్రలోభ పెట్టేవి నాకంటూ ఏవీలేవు. నాది కాకపోయినా నా దగ్గర మిగిలిందల్లా ఇది ఒక్కటే. ఇది నీకు ఇస్తున్నాను. నా గురించీ, నా వారి గురించేకాక దీని గురించి కూడా పూసగుచ్చినట్లు నీకన్నీ చెప్పాను. ప్రళయాన్ని సృష్టించగల మహా పాతకకారిణి ఇది. ఒళ్ళో కొరివుంచుకున్నట్లు దీన్ని నువ్వు కూడా దగ్గర పెట్టుకోవద్దు. దాని స్వంతదార్లకో, ప్రభుత్వానికో అప్పగించెయ్యి. లేదా నీ ఇష్టమొచ్చి నట్లు చెయ్యి. నాకివన్నీ చేసే సమయం లేక నీకీ పని అప్పచెబుతున్నాను" అని చెప్పి రాగిరేకూ, తాళంచెవీ నా చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

చేతికి దొరికింది పసిడి పర్వతమో, పాములమూటో తేల్చుకోలేని అయోమయంలో ఉండిపోయాన్నేను.

పార్వతీశం నిజంగా చాలా అరుదైన వ్యక్తనుకోవాలి. నన్నడిగితే బొమ్మ తయారీకి శిల్పకారుడు సిద్ధం చేసి పెట్టుకున్న మృణ్మయం లాంటివాడు పార్వతీశం.

బావగారి నిర్దేశంలోకాక అతను తండ్రి దగ్గరే వుండుంటే గొప్ప పండితుడో, భక్తాగ్రేశ్వరుడో అయ్యుండేవాడు.

నిధికోసం అతనేనాడూ ప్రాకులాడలేదు. ఆసక్తి కనబర్చలేదు. సమయమొచ్చేసరికి దాన్ని తృణప్రాయంగా విడిచిపెట్టేసి జ్ఞాన వైరాగ్యాలనబడే దారి వెంట ముక్తినాశించి సాగిపోగలిగేడు.

ఇంత చిన్న వయసులో అంతటి వైరాగ్యం కలగడానికి ఎంత జన్మ గత సంస్కారం ఉండాలి!

నేను సామాన్యుణ్ని. కలి ప్రభావం నన్ను చుట్టుముట్టే వుంది. కనకం కామితాల పట్ల నాకేమాత్రం మోహం చావలేదు.

నేనా నిధిని స్వంతం చేసుకోవాలనే నిర్ణయించుకున్నాను.

చాలా నిదానంగా ఆలోచించాను. ఏ లొసుగులూ లేకుండా ఒకటికి పదిసార్లు సరి చూసుకుని పథకం వేసాను.

అవసరమైన సరంజామా... అంటే పుట్టుమచ్చ, చెవికాడ, బుగ్గన గాటు వగైరాలు సమకూర్చున్నాను. పార్వతీశం చెప్పిన వూరివాళ్ళ సంగతులన్నీ ఒకటికి వందసార్లు మననం చేసి మెదడు పొరల్లో ముద్రించుకున్నాను. పార్వతీశం అలవాట్లు, ఇష్టాలు నాకు బాగా జ్ఞాపకమే.

నా సహచరులు నలుగురికి అవసరమయినంతవరకూ చెప్పి సమయమొచ్చినప్పుడు సాయపడేలా సిద్ధం చెసుకున్నాను. మీ వూరొచ్చాను. నేను ఆశించినట్లు వూళ్లోవాళ్ళు ఆనవాళ్ళు చూసేరే తప్ప పోలికలంతగా పట్టించుకోలేదు. ముందుగా రాజాగారి వారసులెవరూ వూర్లో లేరనీ, మిగల్లేదనీ స్టేషన్‌లోనే ఎవరికీ అనుమానం కలక్కుండా దర్యాప్తు చేసి నిర్ధారణ చేసుకున్నాను. వూర్లోకి అడుగుపెట్టాను.

మొదట్లో కొద్దిగా తికమక. దివాణానికి సంబంధించిన గుడిలో సర్వమంగళాదేవి విగ్రహం కిందని పార్వతీశం చెప్పాడు. దివాణం వెనుక దాగున్న ఆ మండపం నా కళ్ళబడలేదు మొదట. అంచేత కపాలేశ్వరస్వామి ఆలయం జమీందార్లు కట్టించినదే అని వూరివాళ్ళు అనుకోగా విని దాక్షాయణీదేవినే సర్వమంగళాదేవి విగ్రహమని పొరపాటుపడ్డాను. అక్కడే తిష్టవెయ్యబోయాను.

దివాణ ప్రాంగణంలోని

సర్వమంగళాదేవిని కరణంగారు చూపించాక అదే అసలైన విగ్రహమని గ్రహించి స్థిరపడ్డాను.

ఆ తరువాత అంతా నేననుకున్నట్టుగానే సవ్యంగా జరిగింది. మీతో నమ్మకంగా వ్యవహరిస్తూనే గుట్టుచప్పుడు కాకుండ కొద్దికొద్దిగా నిధిని నా సహచరుల ద్వారా తరలించాలని నా పన్నాగం.

ఇక్కడే నేననుకున్నది కాస్తా బెడిసికొట్టింది. రాత్రింబవళ్ళు వెదికినా సర్వమంగళాదేవి విగ్రహం మీద తాళం చెవి పట్టే రంధ్రం కనిపించలేదు. నిర్ణీతమైన ఆ స్థలం దేవి విగ్రహం మీద ఎక్కడున్నదో ఆ వివరణ రాగి రేకుమీద రాయబడలేదో, పార్వతీశమే నాకు చెప్పడం మరిచిపోయాడోగానీ నేను చాలా ఇబ్బందిలో పడిపోయాను. చల్లగా పని జరుపుకుపోదామనుకున్న నా కోరిక ఫలించలేదు.

రోజులేమో తిరిగిపోతున్నాయి. మీ మనసుల్లో నామీద అనుమాన బీజాలు పడ్డాయి. కేసెట్టు పెట్టినేనా విగ్రహాన్ని పరీక్షిస్తున్నప్పుడు, జామ తోట కాపలాదారు దానుతో మంతనాలాడుతున్నప్పుడు, మామూలు డ్రెస్సుతో స్టేషన్‌కి వెళ్లి ఉత్తరాలు పోస్టు చేస్తున్నప్పుడు ఒకటి రెండుసార్లు స్వామిగారి కంట, ఇంకొకరిద్దరి కంటపడ్డాను. ఏవో కథలు చెప్పాను గానీ స్వామిగారదినమ్మారనుకోను. మీ ముగ్గురేదో గూడు పుఠాణీ చేస్తున్నారని నాకు వాసన తగిలింది. ఇక ఆలస్యం చేయకూడదని మావాళ్ళని మందుగుండుతో రమ్మన్నాను.

కానీ అప్పటికే సమయం మించిపోయింది. నా బండారం బయటపడిపోయింది. పట్టు చిక్కకుండా తప్పించుకునేసరికి ప్రాణం కడబట్టి పోయింది. జేబులో మిగులున్న తాళం చెవిని తుప్పల్లోకి విసిరి రైలెక్కేసాను.

కానీ నాకెందుకో ఈ అపజయం కలగజేయవలసినంత ఆశాభంగాన్ని కలగజేయలేదు. బహుశా పార్వతీశం అభిమతమే అమలు జరుగుతుందన్న తృప్తితోనేమో!

నేను బాధపడుతున్నదొక్కదానికే.

మహర్షిలాంటి నా మిత్రుడి పేరుకి కళంకం అంటగట్టాను. కపటం లేకుండా నన్ను నమ్మి ఆశ్రయమిచ్చిన మీ కుటుంబానికి మాయని మచ్చని ముద్రించాను. అదే విచారం.

ఏం.. ఈ విషయం ప్లాను వేసేముందు తెలియదా అంటే.. ఊహూ నిజంగానే తట్టలేదు. ఒక వేళ తట్టినా పరిగణనలోకి తీసుకునేవాడ్ని కాదేమో!

ఇప్పుడు దాదాపు మూడునెల్లు మా తల్లి గాయత్రి దేవుడిచ్చిన నా సహోదరి, ఆమె చేతి అమృతం తిన్నాక ఆమె నాపై కురిపించిన అపరిమిత వాత్సల్య మాధురిలో తడిశాక ఈమెకా ఇంతద్రోహం చేస్తున్నాను అన్న పశ్చాత్తాపం కలుగుతోంది.

కానీ ఇక ఇప్పుడేం చేయగలను?

ఇప్పుడు నేను పార్వతీశాన్ని కానని బయటపెడితే దిగజారుతున్న మీ ప్రతిష్ట ఉద్ధరించడం మాట ఎలావున్నా మూడునెలలపాటు ఒక మోసగాడు అల్లుడి హోదాలో మీ ఇంట్లో తిష్టవేసిన పాపం మీ భవిష్యత్తునే దెబ్బతీయగల ప్రమాదమున్నది.

మీకూ ఆ ఆలోచన వున్నట్టయితే దయచేసి విరమించండి. ఈ మూడునెలలలో రెండు మాటలన్నా మాట్లాడుకోలేదంటే నమ్మేవాళ్ళు ఈ లోకంలోనే ఉండరేమో!

చివరిగా ఒక్క అభ్యర్థన.

భౌతికంగా మీ తండ్రి నందరామయ్యగారు పరమపదించి వుండవచ్చుగానీ మీ అమ్మగారి నుదుటన దిద్దుకున్న ఆ కుంకుమలో, ఆమె హృదయంలో వెలుగుతున్న ఆశాభావంలో, విసుగు చెందకుండా ఆ కళ్ళు చూసే ఎదురుచూపులో ఆయన సజీవంగా ఉన్నారు.

ఆ భావం ఆమెలో తుంచెయ్యక పోతేనేం?

చెప్పేటంతవాడను కానుగానీ మీకూ ఒక్క మాట.

ఈ జీవితం బహు చిన్నదే కాదు, చాలా అమూల్యమైనది హేమగారూ! జీవన గమనంలో వెనుకబడిన వారికొరకు నిరీక్షిస్తూ కాలాన్ని వ్యర్థం చేసుకోవడం బుద్ధిమంతుల లక్షణం కాదు. బ్రతుకుకొక లక్ష్యం ఏర్పరచుకుని ముందుకు సాగిపోవడంలోనే జన్మ సాఫల్యముంటుంది. ఆలోచించండి.

ఇక సెలవు!

కాగితాలు మడిచింది హేమ. సీటుకు జార్లబడి కళ్ళు మూసుకున్నది.

అల్లకల్లోలంగా వున్న సముద్రాన్ని ఒంటరిగా ఈదుకొచ్చినదానిలా దస్సిపోయి నిర్వేదంగా వున్నదామె మానసం.

మెల్లగా మెల్లగా హృదయాన్నావరించిన ప్రశాంతత ఆమెను శాంతచిత్తురాలిని చేసింది. సమీక్షకు సమాయత్తం చేసింది.

'ఎప్పుడో పన్నెండేళ్ళనాడు ప్రారంభమైన ప్రకరణం ఈతని రాక, నిష్క్రమణలతో సమాప్తమైనదన్న మాట' నిశ్శబ్దంగా నిట్టూర్పు విడిచింది హేమ.

అతనాడిన బూటకపు నాటకంలో తమని పావుల్ని చేసి ఆడుకున్నాడని అర్థమయినా అతనిపైన రావలసినంత ఆగ్రహం రావడం లేదెందుకనో? బహుశా అతని సుగుణశీలతే కారణమయ్యుండాలి. అర్థానికి లోభపడ్డాడే

గానీ నీతితప్పినవాడు కాదతను. అందుకు అతడు తనతో ప్రవర్తించిన తీరే నిదర్శనం.

సరే. గతం గతః. జరగాల్సినదేదో జరిగిపోయింది. తన కర్తవ్యమేమిటిప్పుడు?

ఓరగా కళ్ళు తెరిచి తల్లివంక చూసింది హేమ.

నిద్రలోకి జారినా గాయత్రి మొహంలో ఎదురు చూపులతోనే అలసిన చిహ్నాలు ప్రస్ఫుటంగా అవుపిస్తున్నాయి.

అతను చెప్పినట్లుగా తన భర్త ఎక్కడో ఒక చోట క్షేమంగా వున్నాడన్న నమ్మకంతో దిద్దుకుంటున్న ఆ కుంకుమ, ఎప్పుడో వస్తాడు, వచ్చేస్తాడు అని అతి నమ్మకంగా ఎదురుచూసే ఆ నిరీక్షణ ఆమెకీ ఇన్నేళ్ళూ బలాన్నీ, శక్తినీ ఇచ్చి బ్రతికిస్తూ వచ్చాయి.

ఆయనిక భూమ్మీద లేరన్న నిజం తెలిసిన మరుక్షణం ఆమె కుప్పకూలిపోదూ!

ఊహూ... ఈరహస్యమిక తన గుండెలోనే ఉండిపోతుంది శాశ్వతంగా.

ఇక తన సంగతి!

హేమ చేతిలో కాయితాన్ని చిన్న చిన్న ముక్కలుగా తుంచి కిటికీలోంచి విసిరేస్తూ బయటకు తల వంచి నీలాకాశంలోకి చూసింది.

వినువీధిన విహంగమొకటి రెక్కలు చాచి హాయిగా, స్వేచ్ఛగా ఆనందంగా గిరికీలు కొడుతూ విహరిస్తోంది.

----సమాప్తం---